ఆంధ్ర సచిత్ర వార పత్రిక

ఉగాది సంచిక



0 పైసలు

6-4-73



ఉగాది పండుగ సంబరము

చిత్రకారుడు : శ్రీ వై. పాపయ్య

ఆధునికంగా, ఆడంబరంగా ఉండడం తప్పుకాదు!
కాని, అది బలహీనతగా మారితే ముప్పు తప్పదు!



శ్రీపూర్ణ మూవీస్
సమర్పించు

స్త్రీ

ఈనాటి పెద్దలకు
ఒక సమస్య!
ఈ చిత్రం పెద్దలకు
మాత్రమే!!

A

కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: కె. ప్రత్యగాత్మ
నిర్మాతలు: అట్లూరి పూర్ణచంద్రరావు
యం. చంద్రశేఖర్
ఆంధ్రప్రదేశ్: శ్రీ ఫిలింస్

సహనిర్మాతలు: పి. ఆర్. కృష్ణ, డి. కృష్ణారావు
మాటలు: రాచకొండ విశ్వనాథశాస్త్రి
సంగీతం: కె. వి. మహదేవన్ కెమెరా: శేఖర్ సింగ్
మైసూర్: నవయుగ పిక్చర్స్ సర్క్యూట్ (బెంగుళూరు)

Veekay

KalaMandir

ఉత్తరాలు

పాఠకులకి, రచయిత (త్రు)లకి శుభ ఉగాది శుభాకాంక్షలు.

దీపావళి కథల బాలట్ పోటీలో మొదటి బహుమతి పొందిన వ్యాస రచయిత్రి శ్రీమతి బి. ఎస్. దేవిగారు తమ జీవిత వివరాలని తెలుపుతూ రాసిన ఉత్తరాన్ని ఈ కింద వేస్తున్నాము. —సం.

బి. ఎస్. దేవి

"జననం : 1950, జన్మస్థలం తుని. 1966 లో వివాహమైంది. భర్త పేరు శ్రీ బి. కోటేశ్వరరావు. శ్రీవారి ఉద్యోగరీత్యా ప్రస్తుత నివాసం విజయవాడలో. మాకు సంతానం ఇద్దరు ఆడపిల్లలు. చిన్నప్పటినుంచీ కథలు చదవడంలోనూ, వాటిని గురించి ఆలోచించడంలోనూ ఆసక్తి అధికం. కొన్ని వ్యాసాలు వ్రాశాను. కథలు వ్రాయాలన్న అభిలాష కూడా వుంది. ఎక్కువగా సినిమాలు చూడడం నా హాబీ. ఫోటో వెంటనే పంపడానికి వీలుకానందువల్ల పంపించలేక పోతున్నాను."

ప్రత్యేక రాష్ట్ర సమస్య

2—3—73 వ తేదీ సంచికలో డోర్నకల్ నుంచి శ్రీ పల్లగాని రామసర్సయ్య వ్రాసిన ఉత్తరం చదివి యిది వ్రాస్తున్నాను.

తెలంగాణావారు చాలా ధైర్యవంతులనీ, ప్రస్తుత పోరాటంలో లేక ఉద్యమంలో ఆంధ్రులకు పూర్తి మద్దతు నిస్తున్నారనీ, కాని అదే ఉద్యమం తెలంగాణాలో నడచినప్పుడు ఆంధ్రులు తమ మద్దతును యివ్వలేదని తద్రీత్యా ఆంధ్రులు పిరికివారనీ, అదిగాక భావాలు వ్యక్తం చేసేటప్పుడు కొంచెం పరుషమైన భాష వాడుతున్నారనీ బాధపడ్డారు. నిజం. సహజం కూడా. కాని ఒక్కటే నవ్వు తెప్పిస్తోంది : 'తన దాకా వస్తేకాని...' అన్న విషయాన్ని అక్షరాలా నిజం చేశారు తమ లేఖల ద్వారా శ్రీ రామసర్సయ్య— లక్ష్మీకుమారీను.

ఆంధ్రులంటే ఎంత అభిమానం, గౌరవం ఉందో ఆ విషయాన్ని తమ సభ్యతా సంస్కృతుల ద్వారా యెంత అందంగా, హుందాగా వెల్లడించరో 1969 సం.లో తెలంగాణాలో ఉద్యమం సాగిన రోజుల్లో భాగ్యనగర వీధుల్లోని కుడ్యలిఖితాలను చదివిన వారికి తెలుసు. తామేం వ్రాస్తున్నారో కూడా ఆలోచించక ఆంధ్ర స్త్రీలతో స్వజాతి సంపర్కాన్ని కోరుతూ తెలంగాణా స్త్రీలు గోడలపై స్వయంగా వ్రాసిన ఆ సిగ్గుచేటు వ్రాతలు యిప్పటికీ గుర్తుకు వస్తూ వళ్ళు గగుర్పొడుస్తోంది. తెలుగు చదవ నేర్చిన ప్రతివాడు, సిగ్గుతో తలవంచుకోవలసిన, వంచుకున్న సమయమది. ఎక్కడిది సంస్కృతి దౌరా..యిది? ఎవరు నేర్పిన సభ్యత యిది. దీనికేనా ఆంధ్రుల మద్దతు లేదని శ్రీ రామసర్సయ్య గారి ఆవేదన? నిర్దాక్షిణ్యంగా, నిస్సంకోచంగా ఆంధ్రులు (తెలుగు ప్రజలలో ద్వితీయశ్రేణివారు) నివసించే ప్రాంతాలలో గూండాలు, ఆందోళనకారులు స్వైరవిహారం సల్పి 'ఖలానా రోజులోగా తెలంగాణా వదిలి వెళ్ళకపోతే ఈ ఉద్యమ యజ్ఞంలో ఆంధ్రులు సమిధల్లా మాడిపోతారు' అని బెదిరించిన వారికి యేమని మద్దతు నివ్వాలి? తమను కండకొక ముక్కగా నరకమనా? తమ యిల్లాళ్ళను చెరచమనా?, యేమని? ఆనాడు జరిగిన ఉద్యమం వెనుక ఎన్ని దారుణాలు జరిగాయో, తమ రాష్ట్ర రాజధానిగా భావించి వచ్చి మధ్యలో చిక్కుబడ్డ ఆంధ్రులు యెన్ని అవమానాలకు గురయ్యారో తల్చుకుంటే ఆ వ్రాతలను, నినాదాలను జ్ఞప్తికి తెచ్చుకుంటే రక్తం సలసలా మరుగుతూంది. 'మా తెలుగులకొక, తెలంగాణా' అంటూ 'నాన్ తెలుగూస్' చేసిన ఉర్దూ ఉపన్యాసాలు ఆంధ్ర దూషణలు యింకా చెవుల్లో మార్మోగుతున్నాయి. అప్పుడే మర్చిపోయారా? కాని యింతటి ప్రళయకాల భీకర రూపాన్ని పొందిన యీ ఉద్యమంలో ఒక్క తెలంగాణా వ్యతిరేక నినాదం లేదే! ఒక్క దూషణభరితమైన కుడ్య లిఖితం లేదే! పైగా నిండు మనస్సుతో గతాన్ని మరచి, స్నేహపూర్వకంగా నిండు మనస్సుతో, 'జై తెలంగాణా' అనే నినాదాన్ని ఆంధ్ర జిల్లాల్లో మార్మోగించారే. ఎవరిది సంస్కృతి? ఇప్పుడు చెప్పండి? ఎవరిది నిజమైన సభ్యత? అంతే కాదు— ఆనాడు ఆంధ్రులు సమైక్యత కోసం ఆంధ్రులు నడుంకట్టారు. సాధించారు. ఈనాడు తెలంగాణా ముసుగు నుండి విముక్తి కోసం పోరాడు తున్నారు. అదీ సాధిస్తారు.. అదీ వ్యక్తిత్వమంటే అదీ ఆంధ్రపౌరుషమంటే. ఆరంభశూరులే కాదు ఆంధ్రులు అజేయపరాక్రములు గూడా.

ఒక తెలుగు ప్రాంతం వారిని, చరిత్ర తెలియని, తెలుసుకోనిచ్చగించని మరొక తెలుగు ప్రాంతం మహిళలు ఊహల్లో విహరించే ఆనాటి (1969) దౌర్భాగ్య పరిస్థితి రారాదనే యీనాటి ఆంధ్రుల కోరిక. అందుకే యీ ఉద్యమం. 'రోగి పాలే కోరాడు, వైద్యుడూ పాలే చెప్పాడు' అన్న సామెత విధంగా ఆనాటి వేర్పాటువాదులే ప్రస్తుత ఆంధ్రోద్యమపు సత్తా చూసుకుని బావుటా ఎగరేస్తున్నారు. అంతేకాని తమ మద్దతు నిస్తున్నామనుకోవడం యెంత భ్రమ. తమ కోసం తాము ఉద్యమాన్ని నిర్వహించడం మరొకరికి వేరే విధంగా మద్దతివ్వడమౌతుందో అర్థంకాదు. డోర్నకల్ కాని, తెలంగాణా కాని పొరుగు రాష్ట్రంలోను లేవు— పొరుగు దేశంలోనూ లేవు. ఇప్పటి ఉద్యమం ఆంధ్రప్రాంతం వారు శ్రీ రామసర్సయ్య ఉన్న ప్రాంతం నుంచి విడిపోవడానికే — అటువంటప్పుడు ఆయన మద్దతు నిచ్చినా యివ్వకున్నా ఫలితం ఒక్కటే.

ఆయనన్నట్టు ఒక్కమాట మాత్రం నిజం. ఎవరికి వారు ఆత్మపరిశీలన చేసుకుంటే యదార్థ విషయాలు అవగాహన అవుతాయి. సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఆంధ్రులకే కాదు, దేశంలోని యావత్తు ప్రజలకూ నష్టం కల్గుతుంది. 'ఊరంతా ఒక దారి, ఉలిపికట్టెది ఒక దారి'' అన్న సామెత యిక్కడ అక్షరాలా నిజం. అంకెల గారడీని చూసి మోసపోయే వారు కాదు తెలంగాణా వారన్నది ఎంత సత్యమో, మాకన్యాయం జరిగిపోయింది, మేం వెనకబడిపోతున్నాం అని దేశప్రజలను యింకా వారు (తెలంగాణా) నమ్మించలేరనేది కూడా అంత నిర్వివాదాంశము. ఈనాడు యదార్థ విషయాలను మరుగుపెట్టి శ్రీ పి. వి., అంజయ్యలు చేస్తున్న ఉద్యమ వ్యతిరేక ప్రచారం యెంత నిజమో, ఆ అంకెలలో గారడీ వుందన్న సర్సయ్యగారి మాటలు కూడా అంతే నిజం. 'నీకంట్లో నేను వ్రేలు పెడతా— నా నోట్లో నువ్వు వ్రేలు పెట్టు', అన్న పద్ధతిలో సాగే యీ సమైక్యతావాదనలు, పంచసూత్ర ప్రహసనాలు యిక చాలు. కావలసింది, సాధింపబడేది, సంపాదించేది ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం.


మరొక చిన్నవిషయం : బి. విద్యాసాగర్, దేవరాజ మహారాజుల ఉత్తరం కూడా చదివాను. ఇది తెలుగుల పత్రిక — సాగుతూన్న ఉద్యమం తెలుగునాట. రోజూ తగలబడుతూంటే నీరో ఫిడేలు వాయించినట్లు, రాష్ట్రంలో మూడింట, రెండొంతులు ఆందోళనతో ఉడికి పోతూంటే పి. వి. క్రికెట్ చూసినట్లు — యీ సాహితీప్రియు లిద్దరికీ నాలుగు పేజీల ఉత్తరాల శీర్షిక —వ్యాసాలు చెత్తగా కనిపిస్తున్నాయంటే, తద్వారా పత్రిక ఎంత దిగజారిందో అర్థం చేసుకుంటున్నారంటే వారి ఆలోచనా విధానం మాకర్థమై అంత బాధా కలుగుతూంది. సెంట్రల్ లైబ్రరీలో కూర్చుని తిక్కన పోతనల గ్రంథాలను తిరగవేసి కాలాన్ని సార్థకం చేసుకోవచ్చు. సాహిత్య సముద్రంలో పల్టీలు కొట్టవచ్చు.

—వి. సూర్యనారాయణ (హైదరాబాద్)

* * *

పత్రికలో శ్రీమతి కె. రామలక్ష్మి గారు ఒక ప్రశ్నకు జవాబిస్తూ ఆంధ్ర విద్యార్థులను, ఆంధ్రోద్యమాన్ని చాల కించ పరిచారు. విద్యార్థులుచదువు లంటే ఇష్టంలేక మాత్రమే ఈ ఉద్యమంప్రారంభించి దానితో రాజకీయ బాధితుల మనిపించుకొని తద్వారా స్వీయ ప్రయోజనాలు పొందజూస్తున్నారనీ ఈమె ఆరోపించారు.

తమ స్వంత రాష్ట్రంలో తాము రెండవ తరగతి పౌరులుగా జీవించుటకు ఇష్టపడని ఆంధ్రుల అభిమాన మెంత దెబ్బతిని ఈ ఉద్యమం ప్రారంభించారో, ఈమెకు తెలియదు కామాలు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమఫలితంగా తమిళనాడులో ధరలు పెరిగాయని, ఈ తెలుగు మహిళ తమిళ సోదరితో బాటు వాపోయింది (3—3—72 ఆంధ్రపత్రిక ఇది నారీదృక్పథంలో). ఈ ఉద్యమం ఫలితంగా మద్రాసులో ఇడ్లీ, సాంబారు మొ॥ పదార్థాల పెరుగుదల మాత్రమే ఈమెకు కన్పించింది గానీ,



ఒక్క పొరపాటు చాలు
మనుషుల చరిత్ర
మారడానికి.
ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్
తాత - మనవడు
నిర్మాత
కె. రాఘవ
కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం
దాసరి నారాయణరావు
సంగీతం: రమేష్‌నాయుడు
THARAKARAMA
విడుదల ఆంధ్ర: తారకరామ సీడెడ్: నవభారత్ నైజాం: శ్రీ తారకరామ
Rama Rao Arts

ఉత్తరాలు

తెలుగ గడ్డపై ప్రత్యేక రాష్ట్ర వాంఛ వెలడి చేసి, కాల్పుల్లో మరణించిన 300 పై చిలుకు తెలుగుసోదరుల ఆవేదనను ఈమె చెవిన పడలేదు(?) ప్రజా బాంధు(ధు)రాలైన ఈమె ఇప్పటికైనా కళ్ళు తెరచి ఉద్యమంలో పాల్గొనక పోయినా, కనీసం ఉద్యమాన్ని కించపరచవలదని, ఆంధ్ర విద్యార్థులకు క్షమాపణ చెప్పుకోవలసిన బాధ్యత ఈమెకు కలదని హెచ్చరిస్తున్నాను.

జై ఆంధ్ర, జై తెలంగాణా,

బి. వి. వి. సత్యనారాయణ మూర్తి, (పిఠాపురం.

* * *

16—2—73 శ్రీ రెడ్డి వెంకటరెడ్డి (మిర్యాలగూడ) గారి ఉత్తరం చూశాక ప్రత్యుత్తర మివ్వాలనిపించి....

వెంకటరెడ్డిగారూ! మా వూరు పల్లెటూరు గాన మీ ఉత్తరం గల సంచికను త్వరలో చూడడం తటస్థించలేదు.

ఎవరు ఎవరితో కలిసి మునిగిపోయారన్నది ఒక్క విజ్ఞులకు మాత్రమే తెలుసు. హైదరాబాదు ఆంధ్రప్రదేశ్ రాజధాని అయ్యుండటం వల్ల, మా వల్ల అన్నిరంగాల్లో అభివృద్ధి అయ్యింది... అందరికీ తెలుసు. రాజధానిలో మమ్మల్ని రెండవ తరగతి పౌరులుగా ఉండమని చెప్పటంలో మీ విజ్ఞత ఎంతో తెలుసు. వెనుకబడిన ప్రాంతాలు అన్నిచోటా ఉండిన మీక మాత్రమే ప్రాంతీయ బోర్డుల నేర్పరిచి, మీకెలా ప్రత్యేక వసుపాయాలు చేసింది కూడా తెలుసు. ఇన్ని అన్యాయాలు ఆంధ్రులకి జరిగాయి. కదా! మీరు మునిగిపోయారా? మేం మునిగిపోయామా?

మిమ్మల్ని ఏ బూతో ప్రయోగించి నేను తిట్టలేను. మాకు అన్యాయం జరుగుతున్నదని ప్రత్యేకాంధ్ర ఏర్పాటు చేయమని ఇందిరను అడిగాను. 1969 లో మీ ఉద్యమాన్ని ఏ పత్రికా ప్రచురించ లేదన్నారు. 2—3—73 సంచిక చదవండి.

ముల్కీ రూల్సు కూడా మీకు అంత లాభదాయకం కావని తెలిసినప్పటి నుంచి, విడి తెలంగాణ వస్తే మంచిదనుకొని మీరు మాకు సానుభూతి చూపిస్తున్నారు. విడి ఆంధ్ర వస్తే విడి తెలంగాణా ఆటోమాటిక్‌గా వస్తుందని మీకు తెలుసు కదా!

ఇప్పుడిప్పుడే మీరు ఉద్యమంలో దిగుతున్నట్టుంది. మైత్రీగానే విడిపోదాం. మీ తెలంగాణా ప్రాంతంలో కూడా ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేసి, త్వరలోనే రెండు ప్రాంతాలు విడిపోయేందుకు దోహదం కల్పిస్తారని ఆశిస్తాను.

మోరాచరా, (యాళ్ళూరు)

* * *

23—2—73 తేది వారపత్రికలో 'చికాగో తెలుగు సమితి'లో ఒక విలేఖరి వ్రాసినట్టు 'దూరంగా వున్నప్పుడే ఎక్కువ ఆత్మీయత అనిపిస్తూ వుంటుంది' తెలుగువారు దగ్గరగా ఉండి అసూయాద్వేషాలు పెంచుకునే బదులు దూరంగా ఉండటం నయం.

— కె. భవాని, (హైదరాబాద్)

సవరణ


నందిని పిక్చర్స్ 'మీనా' నవలను సినిమాగా తీస్తున్నారని, ఆ నవల మాదిరెడ్డి సులోచన గారు వ్రాశారని, 9—3—73 ఆంధ్ర సచిత్రవార పత్రిక సినిమా వార్తల్లో పొరపాటున పడింది.

ఆ నవలను యద్దనపూడి సులోచనా రాణి గారు వ్రాశారని గమనించ కోరుతున్నాము. —సం.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938—1972)
శుక్రవారం : 6-4-73
(శ్రీ ప్రమాదినామ సం॥ చైత్ర శు॥ తదియ
సంపుటము : 66 సంచిక : 29
స్థాపితం : 1908
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1
విడి ప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక


నా ధ్యేయం ఈ రోజు వాగ్దానం రేపు నెరవేర్చడమే
ఆ రేపు అన్నది అసలు వస్తుందా?
ఉన్నత స్థానంలో ఉన్న ఎవరో రాజీనామా చెయ్యాల్సి ఉంది. కానీ దాన్ని ఉపసంహరించుకో కూడదు.
గరీబీ హటావో
ఆవ్రో ప్రమాదం
కూలిపోయిన మరో ఆవ్రో
ఇందిర పరిపాలన వల్ల అన్నం, కూరల సంగతి మరిచి పోవాల్సిందే. ఉప్పు, గంజి మాత్రమే మన తాహతుకు సరిపోతాయి.
భారత దేశం కంటే నేను ఎత్తుం ఎదిగి పోతున్నాను
అమెరికా ఆయుధాల సరఫరా పునరుద్ధరణ

సంపాదకీయం


పరీధావి సంవత్సరంలో ఆంధ్ర పత్రిక వారపత్రికకి ఇంచుమించు మూడున్నర దశాబ్దాలు అధిపత్యం వహించిన శ్రీ శివలెంక శంభూప్రసాద్‌గారు శివసాయుజ్యం చెందారు. వారు సంపాదకులుగా ఉన్నంత కాలం ఆంధ్ర పత్రిక వారపత్రిక అన్ని విధాలా తెలుగువారి సంస్కృతికి ప్రతిబింబంగా ఉండేందుకు ప్రయత్నించిందంటే అతిశయోక్తి కాదు. పత్రికలు తమ చుట్టూ ప్రపంచాన్ని వదిలి నడవలేవు. కొంత కాలంగా తెలుగువారి జీవితాలలో తీవ్రమయిన సంక్షోభం ఏర్పడింది. ఆంధ్ర పత్రిక వారపత్రిక ఈ సంక్షోభాన్ని పట్టించుకోకుండా ఉండలేక పోతోంది. వివిధ దృక్పథాలకి చర్చావేదికగా ఉండేందుకు ప్రయత్నిస్తోంది. అపోహలు ఏమయినా ఉంటే వాటిని తొలగించటానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోంది. ఈ విధంగా ఆంధ్ర పత్రిక వార పత్రిక శ్రీ శంభూ ప్రసాద్‌గారు అనుసరించిన మార్గాన్నే అనుసరించటానికి ప్రయత్నిస్తోంది.

నేడు తెలుగువారు ఎదుర్కొంటున్న సమస్య ఏమిటో అందరికీ తెలుసు. అది ఎందుకు ఇంత దుర్భరంగా మారిపోయిందో కూడా అందరికీ తెలుసు. తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంతో కలిపి ఆంధ్రప్రదేశ్‌ని ఏర్పరచినప్పుడు అప్పుడు అధికారంలో ఉన్నవారు కొందరు ఆంధ్రుల కన్నా వెనుకబడిఉన్న తెలంగాణా వారికి కొన్ని సంరక్షణలు కల్పించారు. మొత్తం మీద తెలంగాణాలోని వారంతా ఆంధ్రుల స్థాయిని చేరుకున్న తరువాత ఇవి అనవసరం అవుతాయనీ అప్పటికి ఆంధ్ర, తెలంగాణా ప్రాంతం వారిమధ్య భావసమైక్యత కావలసినంత ఉంటుందనీ వారు ఎదురుచూసి ఉండవచ్చు.

1956 నుంచి నేటివరకూ జరిగినదంతా పరిశీలించి చూస్తే ఎందరో ఎదురుచూసిన ఫలితాలు రాలేదని స్పష్టంగా తెలిసిపోతుంది. అధికారంలో ఉన్నవారు అవలంబించిన విధానాలన్నీ ఆంధ్ర, తెలంగాణా ప్రాంతం వారిమధ్య విభేదాలని అధికం చేశాయేకాని తగ్గించలేదు. ఎన్ని సంరక్షణలు ఉన్నా తెలంగాణా వారికి అనుమానాలు, భయాలు పోలేదు. వీరుతల సమైక్యతతో విసిగిపోవటమేకాక క్రమంగా తెలంగాణా వారిలో అత్యధిక సంఖ్యాకులకి తమతో కలిసి ఉండటం ఇష్టంలేదన్న చైతన్యం కలుగటంచేత ఆంధ్ర ప్రాంతంవారు కూడా ఇప్పుడు వేర్పాటునే కోరుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో, కేంద్రంలో అధికారంలో ఉన్నవారంతా బాధ్యతా రహితంగా నడుచుకొనటంచేత తెలుగువారి కష్టాలు అధికం అవుతున్నాయి. ఎటు చూసినా చీకటే కాని వెలుగు కనిపించటంలేదు. క్రమానంద సంవత్సరంలో ఈ చీకటి తొలగిపోయి వెలుగు రాగలదని ఆశిస్తున్నాము.

(సంపాదకుడు)



ఈ చిత్రంలోని దారు శిల్పాలు కేవలం కళాదృష్టితో నిర్మింపబడినవి కావు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీ పశుప్రవృత్తులు సోవియట్ దేశంపై దండయాత్ర సల్పినప్పుడు వారు ధ్వంసం చేసిన వేలాది గ్రామాలలో లిథుయేనియన్ గ్రామమైన అబ్లింగ ఒకటి. యుద్ధానంతరం స్మారక చిహ్నంగా, ఆ గ్రామం వున్నచోట ఈ దారు శిల్ప సముదాయం నెలకొల్పబడింది. ఔత్సాహిక జానపద కళాకారుల సమాజం ప్రోత్సాహంతో 28 మంది దారు శిల్పులు తమ తీరిక సమయాలలో 30 శిల్పాలను తయారుచేసి అక్కడ నెలకొల్పారు, వాటికి కావలసిన దారువును స్థానిక సమిష్టి వ్యవసాయ క్షేత్రం సమకూర్చింది. ఈ అబ్లింగ స్మారకదారుశిల్ప సముదాయం ఔత్సాహిక కళాకారులచే నిర్మింపబడిన మొట్టమొదటి స్మారక చిహ్నం. ప్రఖ్యాత లిథుయేనియన్ దారుశిల్పి విటవ్తాస్ మేజలస్ నాయకత్వాన ఈ పని జరిగింది.

ప్రమాది ఉగాది

అనంతమైన కాలానికి కొన్ని అవధులు కల్పించకపోతే ప్రపంచ వ్యవస్థ తారుమారైపోతుంది. సెకెండ్లూ, వాటి కూడిక వల్ల నిమిషాలూ, ఇలాగే గంటలూ, దినాలూ, నెలలూ, సంవత్సరాలూ ఏర్పడినాయి. వ్యవహారంలో కాలానికి నిర్ణీతమైన అవధిగా సంవత్సరం నిలిచింది. మానవ జీవయాత్రకు సంవత్సరం ఒక మైలురాయి! ఆ సంవత్సరానికి ఆరంభ సూచకమే ఉగాది.

కొత్త సంవత్సరం పుడుతుందనగానే ఆ సంవత్సరంలో ఏమేమి చెయ్యవలెనో—ఎలా అభివృద్ధి పొందవలెనో—కాస్త బుర్ర ఉన్నవారికి ఆలోచనలు కలుగుతాయి. 'గతం న శోచామి' అని జరిగిపోయినదాన్ని గురించి ఆలోచన పెట్టుకోక—ముందును గురించిన ఆలోచన చెయ్యడం పరిపాటి. ఆ ఆలోచనలతో ఎన్నో కొత్త సమస్యలూ ఏర్పడవచ్చు. ప్రస్తుత కాలంలో జీవితమే ఒక సమస్యగా పరిణమించింది. కాలం మార్పుతో పాటు సమస్యలు పెరుగుతున్నాయి. వాటిని పరిష్కరించాలనే ఆలోచన కొందరికి ఉండవచ్చు. సమస్యలు లేకపోతే జీవితమే రాణించదనీ, అవి తెగకుండా వుంటేనే మంచిదనీ కొందరి అభిప్రాయం. ఉభయపక్షాల వారికీ రాజీ పద్ధతిగా కొన్ని చిన్న చిన్న సమస్యలు పరిష్కృతాలయితే—పెద్దవి ఉన్నరీతిగానే ఉండిపోతూ ఉంటాయి.

మనకు కొత్తసంవత్సరం ప్రారంభమవుతుంది. పోయిన సంవత్సరం తుదిదాకా పరిష్కృతంకాని సమస్యలు ఎన్నో ఉన్నాయి. వాటితో కలుపుకుని కొత్తవీ ఎన్నో మొలకెత్తగలవని గట్టిగా చెప్పవచ్చు. అయినా—ఆ చిక్కులలో పడక—ధైర్యంగా వాటిని ఎదుర్కొనే మానసిక శక్తి ఉండాలి.

అసలు కొత్త సంవత్సరం పేరే ఒక సమస్యగా ప్రారంభమయింది. ఇది 'ప్రమాది' సంవత్సరం అయినా కొందరు 'ప్రమాదీచ' అని వ్యవహరిస్తూ ఉన్నది. పాత పంచాంగాల కట్టను విప్పి చూస్తే 60 ఏండ్ల క్రితంనాటి పంచాంగం 'ప్రమాదీచ నామ సంవత్సర పంచాంగం' అనే పేరుతోనే ఉన్నది. దాన్ని గుణించిన సిద్ధాంతిగారు 'ప్రమాదీచ' అనేదాన్నే పంచాంగం పూర్తిగా వాడి ఉన్నారు. ఈ అభిప్రాయభేదం ఎందుకు కలిగింది? అని ఆలోచించి, దీనికి సంబంధించిన పుస్తకాలు తిరగవెయ్యగా—సంవత్సరాల పేర్ల పట్టికలో ఈ శ్లోకాలు కానవచ్చాయి.

'పరీధావిః ప్రమాదీ చ
ఆనందో రాక్షసో నళః;
పింగళః కాళయుక్తిశ్చ
సిద్ధార్థీ రౌద్రి దుర్మతీ
దుందుభీ రుధిరోద్గారీ
రక్తాక్షిః క్రోధనః క్షయః'

దీన్నిబట్టి చూస్తే 'ప్రమాది' అనే పేరే సరైనదనీ, ఛందస్సు కుదరడానికి సాధారణంగా శ్లోకాల్లో ఉపయోగించే 'చ—వై' మున్నగువాటిని గురించి తెలియనివారు చకారాన్ని పేరుతోకూడా కలిపి 'ప్రమాదీచ'గా చెప్పడంవల్ల గతానుగతికంగా 'ప్రమాదీచ' అనేది వాడుకలోకి వచ్చి పంచాంగాలలో కూడా స్థానం కల్పించుకున్నదనీ తెలుస్తున్నది. ఈ విధంగానే చివరి సంవత్సరం 'క్షయ' అయినా కొందరు 'అక్షయ'గా వాడడం ఉన్నది. దానికి శ్లోకం చివర ఉన్న క్రోధనః క్షయః అనేదాన్ని 'క్రోధనోక్షయః' అని పఠించడమే కారణం. 'క్రోధనో' అని చెప్పినప్పుడు 'అక్షయః' అనే విరవక తప్పదు. ఈ విధంగా అర్థం లేని మార్పులవల్ల సమస్యలు ఏర్పడడం వింత కాదు.

'ఉగాది' అనే పదం 'యుగాది' వల్ల ఏర్పడినదని అందరూ చెప్తున్నారు. మనకు కృత—త్రేతా—ద్వాపర—కలి నామములతో నాలుగు యుగాలున్నవి. పయి పదాన్నిబట్టి కాల పరిమాణాన్ని తెలిపే యుగప్రారంభ దినం 'ఉగాది' అని చెప్పవలసి ఉన్నది. మనం జరుపుకుంటున్న 'ఉగాది' చైత్ర శుద్ధ పాడ్యమి గదా! ఇది ఏ యుగానికి ఆదిగా ఉన్నదో ఆలోచిస్తే—ఏమి చెప్పడానికీ సాధ్యం కాలేదు.

చతుర్వర్గ చింతామణికారుడైన హేమాద్రి పండితుడు—చైత్ర శుద్ధ పాడ్యమితోనే సృష్టి ప్రారంభమైనట్లు

'చైత్రే మాసి జగద్బ్రహ్మ
ససర్జ ప్రథమేఽహని,
శుక్లపక్షే సమగ్రం తు
తథా సూర్యోదయే సతి;
ప్రవర్తయామాస తథా
కాలస్య గణనా మపి'

అని చెప్పియున్నాడు. మరిన్నీ నాడు సూర్యోదయ కాలంలోనే సృష్టి జరిగిందనీ, అప్పటినుంచే కాలపు లెక్కింపు ప్రారంభమైనదనీ దీనివల్లనే తెలుస్తున్నది. యుగాల్లో కృతయుగం మొదటిది కాబట్టి ఉగాది కృతయుగాదిగా కావలసి ఉన్నది.



ప్రమాది ఉగాది

కాని ఈ విషయంలో శాస్త్రకారులకు ఏకాభిప్రాయం లేదు.

వైశాఖ శుద్ధ తదియనాడు కృతయుగం ప్రారంభమయినదనీ, త్రేతా యుగారంభం కార్తీక శుద్ధ నవమినాడనీ, ద్వాపరయుగం భాద్రపద బహుళ త్రయోదశినాడనీ, కలి యుగారంభం మాఘ బహుళ అమావాస్య నాడనీ ఒక గ్రంథంలో ఉన్నది. మాఘ పౌర్ణమినాడు కలియుగారంభమని మరొకరి అభిప్రాయం.

కార్తీక శుద్ధ నవమి రోజున కృత యుగమూ, వైశాఖ శుద్ధ తదియనాడు త్రేతాయుగమూ, మాఘ బహుళ అమా వాశ్యనాడు ద్వాపరయుగమూ, భాద్రపద బహుళ త్రయోదశినాడు కలియుగమూ ప్రారంభమైనట్లు గ్రంథాంతరాలవల్ల తెలుస్తున్నది. ప్రస్తుత పంచాంగాలనుబట్టి చూస్తే చైత్ర శుద్ధంతోనే కలియుగం ప్రారంభమైనట్లు కానవస్తున్నది.

ఈ విధంగా మతభేదాలు ఉండడం వల్ల, అందరినీ సంతృప్తిపరచడానికో యేమో వివిధాలయిన యుగాదులూ, మన్వాదులూ కూడా యుగాదులుగా పరిగణించబడతాయని నిర్ణయం చేయవలసి వచ్చింది. ఆ సమయాల్లో స్నాన జప హోమదానాదులను ఆచరిస్తే అంతంలేని ఫలం లభిస్తుందనిన్ని ఇలా చెప్పబడింది.

'యుగాదయశ్చ కథ్యంతే
తథైతాః సర్వసూరిభిః,
యా మన్వాద్యా యుగాద్యాశ్చ
తిథయ స్తాసు మానవః,
స్నాత్వా హుత్వా చ దత్వా చ
జప్త్వానంతఫలం లభేత్.'

ఇందువల్ల చైత్ర శుద్ధ పాడ్యమిని యుగాది లేక ఉగాది అని వ్యవహరించడం సబబుగానే ఉన్నది.

ఇది చాంద్రమానాన్ని అనుసరించిన ఉగాది. సౌరమానాన్ని అనుసరించిన ఉగాదికి మరికొన్ని రోజులు పడుతుంది. సూర్యుడు మీనరాశి నుంచి మేషరాశిలో ప్రవేశించే సంక్రమణ దినమే సౌర సంవత్సరాది.

ఈ రెండు మానాలలోనూ చాంద్రమానాన్ని తెలుసుకోవడం సులభం. చంద్రుని వృద్ధిక్షయాలు, పౌర్ణమి, అమావాస్యలు—అందరికీ దృగ్గోచరాలు అవుతాయి. కాని సంక్రమణం ఎప్పుడు వచ్చేదీ పంచాంగంవల్లనే తెలుసుకోవాలి. అందువల్ల — కాలనిర్ణయానికి చాంద్రమానమే గ్రహింపబడుతూ ఉన్నది.

ఈ చాంద్రమానమాస విషయంలోనూ రెండు పద్ధతులు కానవస్తున్నవి. శుక్ల పక్షం పాడ్యమి మొదలుకొని బహుళ అమావాస్యవరకూ నెల అని ఒక పద్ధతి. కృష్ణ పక్ష పాడ్యమి మొదలుకొని పౌర్ణమివరకూ మాసమని మరియొక పద్ధతి. ఈరెండు పద్ధతులలోనూ వింధ్య పర్వతానికి దక్షిణాన ఉన్నవారంతా శుక్ల పాడ్యమి మొదలు అమావాస్య అంతంగా గల మాసాన్నే అంగీకరిస్తారు. వింధ్యకు ఉత్తరంగా ఉన్న ప్రాంతాలలో రెండు పద్ధతులూ ఉన్నవి. అయినా—అక్కడకూడా శుక్ల పక్షాది మాసమే ప్రధానం. కృష్ణపక్షాది మాసం గౌణం—అప్రధానం.

'చాంద్రోఽపి శుక్ల పక్షాదిః
కృష్ణాదిశ్చేతి చ ద్విధా,
కృష్ణపక్షాదికం మాసం
నాంగీకుర్వంతి కేచన,
యేఽపీచ్ఛంతి న తేషాము
పీష్టో వింధ్యస్య దక్షిణే.
వింధ్యస్య దక్షిణే కృష్ణాదినిషేధా దుత్తరతో ద్వయో రభ్య నుజ్ఞా గమ్యతే. తత్రాపి శుక్లాదిర్ముఖ్యః. కృష్ణాదిర్గౌణః.'

అనే దానివల్ల ఈ విషయం స్పష్టమవుతున్నది.

మనం వింధ్యపర్వతానికి దక్షిణప్రాంతం వారమే కాబట్టి శుక్లాదిమాసమే మనకు సమ్మతమైనది. నిర్ణయ సింధుకారుడు 'తత్ర చైత్ర శుక్ల ప్రతి పది సంవత్సరారంభః' అని చైత్ర శుద్ధ పాడ్యమియే సంవత్సరాది అంటూ స్పష్టంగా చెప్పాడు. ధర్మసింధుకారుడున్నూ ఈ విధంగానే నిశ్చయించాడు.

మనకు కొత్తసంవత్సరం వచ్చింది. శర్వరీ ధారి పోయి, ప్రమాది వచ్చింది. ఈ పేరునుబట్టి ఎన్నో ప్రమాదాలు సంభవించగలవనే భయం కలగడం సహజం. కాని, పేరునుబట్టి మంచి చెడ్డలను నిర్ణయించలేము. పేరు మంచిదిగా ఉన్నా, సంభవించేవి చెడ్డవే కావచ్చు. అట్లని నామప్రభావాన్ని పూర్తిగా కాదనలేము! ప్రపంచ పరిస్థితులను గమనిస్తే సర్వత్రా సంక్షోభమే కానవస్తున్నది. ముఖ్యంగా భారతదేశంలో వివిధ ప్రాంతాలలో వేర్వేరు సమస్యలు! రాజకీయ సంక్షోభాలే కాకుండా ఇతరములూ ఎన్నో! ఆంధ్రప్రాంతంలో తీవ్రరూపం దాల్చిన ప్రజోద్యమంవల్ల సామాన్యప్రజలు తల్లడిల్లి పోతున్నారు. రాకపోకల సౌకర్యాలు కొరవడ్డాయి. రవాణా సౌకర్యాలు లేనందున ఆహారవస్తువుల సరఫరా నిలిచిపోయింది. ధరవరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చాలా తగ్గిపోయి పరిశ్రమలు దెబ్బ తింటున్నాయి. దీనివల్ల నిరుద్యోగుల సంఖ్య పెచ్చు పెరిగిపోతుందనే భయం అధికమయింది. ఈ పరిస్థితులు కలగడానికి కొన్నిచోట్ల స్వార్థపరత, కొన్నిచోట్ల అసమర్థతా, ఇంక కొన్నిచోట్ల శ్రద్ధ లేమి కారణాలని అనుకోవలసి వస్తున్నది. కాల పురుషుడు వీటినన్నిటినీ గమనించి యావత్ప్రజాక్షేమాన్నీ ఆపేక్షించి 'ప్రమాది' సంవత్సరాన్ని సార్థకనామం కలదానిని చెయ్యకుండా ప్రజా సమస్యలను పరిష్కరించి అనుకూల వాతావరణం కలిగించవలసి ఉన్నది. కాలం మనుషులను మనీషులుగా మార్చే అద్భుత శక్తి కలది. అట్టి మంచి కాలం రాగలదనే ఆశతో—అందుకోసం

"బ్రతుకుపాట"

ఇది ఉగాది.
యుగ యుగాల ఆది.
బ్రతుకుపాటను
ఉత్సాహంగా
పల్లవించాలనుకున్నాను.
ఆనందంగా ఈ జీవన
రథాన్ని నడపాలనుకున్నాను.
కాని...........
మానవత్వం మంటకలసిపోతుంటే
రాక్షసత్వం తీక్షణంగా
(రాజకీయపు రంగు పూసుకుని)
రంకె వేస్తుంటే
మామూలు మనిషికి
మనుగడే దుర్భరమైపోతుంటే
కోకిలగానం కర్ణ కఠోరమైంది!
వసంతం కూడా
శిశిరంలాగే పరిణమించింది.
ఉగాది పచ్చడిలో
తీపి తక్కువైంది
చేదు మాత్రం మిగిలిపోయింది!
ఇక బ్రతుకు పాటను
ఏ రాగంలో పల్లవించను?
ఉగాదిని ఏగానంతో;
ఏ నాదంతో ఆహ్వానించను?

—'పి. డి. వి.'

సర్వ విధాలా ప్రయత్నించడం అందరికీ ఆవశ్య కర్తవ్యం.

సంవత్సరాదినాడు మామూలుగా జరగవలసిన పనులన్నీ జరిగిపోతాయి. దానితో తృప్తిపడకూడదు. ప్రగతిపథంలో ప్రయాణం చెయ్యడానికి—ఎన్ని శ్రమలైనా—కష్టాలైనా పడి నేటినుండీ శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తాననే దృఢసంకల్పం కలగాలి. మనోదౌర్బల్యం నశించాలి. మనస్సు పెడితే సరి—అడుగు ముందుకు సాగుతుంది.

—"గౌతమ"

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

శాతాల నూతాలు తెంచుతున్న ధరలు

జంటనగరాలలో ప్రాణావసరాలైన నీరు, వెలుగుల కరువు ప్రకులోడు నిత్యజీవితావసరాల ధరవరలు శాతాలనాతా వదిలి ఒకటి రెండు అని అంగలు వేసుకొంటూ వింగి నిచ్చెనలు ఎక్కుతుంటే, సాధారణమ్మనిషి ఐంద్రజాలిక శిఖామణి సర్కార్ రోప్ ట్రిక్కును చూచినట్లు చూస్తూ నివ్వెర పోతున్నాడు. జొన్నలు— కార్మికవర్గం ప్రధాహారమైన జొన్నల — ధర 50 శాతం ఎక్కువయింది. ఉస్మాన్‌గంజ్ వంటి పెద్ద మండి ప్రాంతాల ధరలకు, ఇతర ప్రాంతాల చిల్లర వ్యాపార సంస్థల ధరలకు దాదాపు 50, 60 శాతం వార కనిపిస్తుంది. సామాన్య గృహిణులు సర్దుకోలేక పోతున్నారు. ప్రభుత్వం ఇన్ని ధరలను అదుపులో పెడుతున్నామని అధికారులు పదే పదే అంటున్నా, ప్రభుత్వం నియమ నిబంధనలు తరచు అమలుపరుస్తున్నా, ధరలు ప్రతినెలా ఎందుకు పెరుగుతున్నాయో తనకు అర్థం కావడం లేదని మధ్యతరగతి కుటుంబిని, నిజాం కళాశాలలో లెక్చరరు శ్రీమతి కె. కమలా రఘుపతిరావు నాతో అన్నారు. 'అయ్యా, ఈనెల ధరలు పెరగడంవల్ల 50 రూపాయలు చేబదులు తీసుకోవలసి వచ్చిందండి; ఉన్న అప్పులు చాలక' అన్నాడు ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేసే అటెండర్ నర్సింగరావు. ధరలు పెరగడంవల్ల పడే బరువుతో పాటు వ్యాపారస్థులు పరోక్షంగా తోసే రాబడి పన్నుతో సాధారణమ్మనిషి వెన్ను విరుగుతూంది పాపం!

ద్రాక్షారాజం అనబేషాహీ!

జంటనగరాలలో ఎటు చూచినా బండ్లలోను, పళ్ల దుకాణాలలోను గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతూ కన్నుల పండువు చేస్తున్న ద్రాక్షోత్తమ అనబేషాహీని చూచినప్పుడల్లా నాకు అఖండభారతం, సమైక్య ఆంధ్రప్రదేశ్ జ్ఞాపకం వస్తుంటాయి. గుత్తిలోని ప్రతిపండూ, రంగులోను, రుచిలోను, వాసనలోను విశిష్టంగా వుంటుంది; అయినా ఒక్కటిగా బలమైన తీగతో నిబద్ధమై వుంటుంది. మాగినవి, అరమాగినవి, కచ్చావి— ఇలా సూక్ష్మతమ వర్ణ విభేదంతో సహృదయులను ఊరిస్తూ, విడదీయకుండా గుత్తిగా వుంచేసే చూస్తూ ఆనందిద్దామా అన్నట్లు వుంటుంది. అనబేషాహీ అని ఎవరు పెట్టారో పేరు ఈ గోస్తనికి? నిజంగా ఇది ద్రాక్షారాజమే. జంటనగరాల శివారులను చూస్తూవుంటే, ఒనాడు శ్రీనాథుడు విజయనగరం పరిసరాలలో విహరిస్తూ, తన కవిత్వాన్ని 'కళసాపుర ప్రాంతకదళీ వనాంతర ద్రాక్షాలతా ఫలస్తబకములకు' పోల్చుకున్నాడు. ఈనాడు తిరిగివచ్చి జంటనగరాల పరిసరాలలో పర్యటించినవాడయినా; 'భాగ్యపురప్రాంత భవ్యానబేషాహి ద్రాక్షలతా ఫలస్తబకములకు' అని చెప్పుకొనేవాడే.

సంస్కృత అకాడెమికి నూతనభవనం

సంస్కృతం నిజంగా చచ్చిందా? భారతీయ భాషలలో పాలలో పంచదారలాగ, ఎవరో కవి అన్నట్లు నీళ్లలో నెళ్లలాగ, పాదరసంలో పాదరసంలాగ కలిసిపోయింది గదా! మరణించిందనడం ఎట్లా? 'చావ లేదు, అమరం, అమృతం' అన్నారు గవర్నర్ శ్రీ ఖండూభాయిదేశాయి ఈ నెల 12 వ తేదీ సంస్కృత ఎకాడెమీ భవనానికి ప్రారంభోత్సవం జరుపుతూ. 'ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో వెలసిన ఈ సుందర భవనంలో ప్రవేశిస్తున్న అకాడెమీ, సుందరాపూర్వగ్రంథాలను ప్రచురిస్తుందని, పరిశోధనపరాయణులను రూపొందిస్తుందని ఆశిస్తున్నాను' అన్నారు, గవర్నరు. అధ్యక్షత వహించిన వైస్ చాన్సలర్ శ్రీ నూకల నరోత్తమరెడ్డి, సంస్కృత అకాడెమి డైరెక్టర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత శాఖాధ్యక్షుడు, ప్రొఫెసర్ డాక్టర్ బొమ్మకంటి రామలింగశాస్త్రి అకాడెమి లక్ష్యాలను, కృషిని వివరించారు. సాయంకాలం టాగూర్ ఆడిటోరియంలో డాక్టర్ బొమ్మకంటి రామలింగశాస్త్రి రచించిన 'దేవయాని' అనే సంస్కృత నాటకం రచన, ప్రదర్శనం ప్రేక్షకులను ఆనందపరచేశాయి.

పద్మశ్రీ భీమన్నకు సన్మానం

సత్యనిష్ఠుడు, ప్రజాసేవా దీక్షితుడు అయిన సహృదయుడు, మానవత్వంవైపు, ఆత్మోన్నతివైపు ఎంతగా పెరుగుతూ పోగలడో, మిత్రుడు శ్రీ బోయి భీమన్న తనకు మార్చి 7వ తేదీన నారాయణగూడా వై. ఎం. సి. ఏ. హాలులో జరిగిన సన్మానంలో నిరూపించాడు. పత్రికా రచయితగా, కవిగా, నాటకకర్తగా, ప్రజాసేవకుడుగా ప్రభుత్వం భీమన్నను 'పద్మశ్రీ' బిరుదంతో గౌరవించిన సందర్భంగా రాష్ట్ర షెడ్యూల్డు తరగతుల సంక్షేమ సంఘం ఈ సన్మానం ఏర్పాటు చేసింది. శ్రీ నార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. తనకు శ్రీ భీమన్నకు గల సన్నిహితత్వాన్ని ఆయన వివరించారు. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని శ్రీ భీమన్న కవితా ప్రక్రియలను వివరిస్తూ, కోనసీమ సౌందర్యమంతా ఆయన తమ రచనలలో గుప్తరించారని ఇదివరకు 80 గ్రంథాలు రచించారని, ఇంకా 80 అముద్రితాలున్నాయని అన్నారు. శ్రీమతి డాక్టర్ యశోదారెడ్డి ప్రసంగిస్తూ, ఆయన ప్రేమ సిద్ధాంతం అమలినమయినదని, రాగద్వేష

లో ఆయన ప్రతిపాదించిన ప్రేమ ఐంద్రియ ప్రేమకాక, పరమ పవిత్రీకృత ప్రేమారాధనమని అన్నారు. శ్రీ శశాంక తన ప్రసంగంలో శ్రీ భీమన్న కవిగా రూపొందిన చిన్ననాటి పరిస్థితి పరిసరాలు వివరించారు. దాదాపు 50 సంస్థల పూలమాలలు వేసిన తర్వాత, డజనుమంది అభినందనల పిదప శ్రీ భీమన్న ధన్యవాదాలు సమర్పిస్తూ, తన అభ్యుదయానికి కారణమయిన ప్రతి వ్యక్తిని పేరుపేరున స్మరించి కృతజ్ఞతలు తెలిపి, మనిషిగా పెరగడమంటే ఇది—అని శ్రోతల ప్రశంస లందుకున్నారు.

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ఉత్తరప్రదేశ్ సంస్కృతాచార్యుల మహాసభకు అధ్యక్షత వహించి, కాశీ సంస్కృత విశ్వవిద్యాలయం నిర్వహించిన అఖిలభారత జోష్ణ తర్కశాస్త్ర సదస్సులో కుమారిల భట్టు అపోహ సమీక్షపై పరిశోధన వ్యాసం చదివి, దేవరియాజిల్లా ఖంప్‌పార్ రాణి నగరంలో జరిగిన మదనమోహన మాలవ్య శిక్షా సంస్థాన్ రజతోత్సవాలను ప్రారంభించి నిర్వహించి, పూరీశంకర జగద్గురువుల అధ్యక్షతన ఆ ఉత్సవాలలోనే 'మహీంద్రవరొళి' బిరుద తామ్రపత్రంతో సత్కృతుడై, మరి ఎన్నో సభలలో ప్రసంగించి, తిరిగివచ్చిన మిత్రుడు శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రికి సంస్కృతాభిమానులు ఘనస్వాగతమిచ్చారు సురభారతి సమితి అభినందించింది; జంటనగరాలలో ప్రస్తుత తిరుపతి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థులు విందుగానో ఆనందించారు. శ్రీ లక్ష్మణశాస్త్రి ఇంగ్లీషు, దాక్షి, కర్నాటకి, గుజ్రాతీ, హిందీ, మరాఠీ, ఉరదూ భాషలలో గద్యదశ పద్యోద్వారి ప్రవాహంలా ప్రసంగిస్తాడు; పంచాంగాలలో గంటలు గడిపిస్తాడు; ఆంధ్ర సంస్కృత హిందీలలో కమ్మని కవిత చెబుతాడు. వి మాణిక్యదేవ చరితాదులు తాద్యాలు. ఇప్ప భాషలపై అధికారంవున్న శాస్త్రికి పాణినీయాది వ్యాకరణాలు. ఈ వయసు లోను వ్రాత్యవిశేలు కొండపల్లి సభలలో

శాంతికి లేఖ

ప్రియమైన శాంతీ !

నీకోసం ఎగాటపడగా వ్రాస్తున్నా ఈ లేఖ బాధతో. ఈ పరీధావి సంవత్సర ప్రారంభం నుండి దుర్దశకి పాల్పడింది మన రాష్ట్రం. అనేక కష్టనష్టాలకి గురి అయింది. వేసవిలో ఆదిత్యు డగ్నివర్షం కురిపించి ప్రజలను ప్రచండ తాపానికి గురిచేస్తే, ప్రస్తుత పరిస్థితుల పట్ల సుభావ వైఖరి ప్రదర్శిస్తున్న మన ప్రధానిలా వర్షాకాలంలో వరుణుడు మనపై విముఖత వహించి, అన్నపానాలకి లోటు కలుగజేస్తే, శీతాకాలంలో గోరుచుట్టుపై రోకటి పోటులా అల్లకల్లోలం చేసేసింది మనల్ని ముల్కీ సమస్య.

మన రాష్ట్రంలో నలువైపులా ప్రజలు వేర్పాటుకై నడుంకట్టి కదన రంగంలో దూకారు. సి. ఆర్. పి. సైన్యాలకి భీతిల్లలేదు—వారి కాల్పులకు వెరవలేదు. ఏకైక లక్ష్య సాధనకై సమ్మెలు చేసారు. నిరాహారదీక్షలు కొనసాగించారు. ప్రాణాలను లెక్క చేయలేదు. అమరవీరులనిపించుకున్నారు. రైళ్ళురాపాగు. కొన్నాళ్ళు ద్వీపాంతర వాసంలా ఏ సంబంధ బాంధవ్యాలు లేకుండా అలమటించింది ఆంధ్ర ప్రజానీకం.

ఎన్ని చేసినా, ఎంతమందితో సమాలోచనలు జరిపినా చెవిటివాని ముందు శంఖారావము చేసినట్లే అవుతోంది పరిస్థితి.

దుర్భిక్షంలో అధికమాసం వచ్చింది. ధరలు మిన్నుముట్టాయి. నిత్యం వాడుకునే బియ్యం, చక్కెరపై కంట్రోలు వచ్చింది. బ్లాక్ వ్యాపారస్థులు లాభాలు చేసుకుంటున్నారు.

ఇంతలో జంటనగరాలలో వచ్చిపడింది ముఖ్యావసరాలైన నీరు, కరంట్‌కి 'కొరత'.

ఒకప్పుడు అందచందాలకు, విశాలమైన పురవీధులకు సుందర నందనోద్యానములకు, రామణీయకతకు, భోగభాగ్య విలాసాలకు పేరుగాంచిన జంట నగరాలు నేడు నిర్జీవ ప్రతిమలలా నిలబడియున్నవి. అధిక ధరలకు తట్టుకోలేని మనబోటివారితో, బ్లాకులో కొనలేని బీదప్రజలతో, జీతాలు లేక రాష్ట్ర సాధనకై సమ్మెలు జేయు ఎన్. జి. ఒ. లతో, చాలీచాలని నీరు, విద్యుచ్ఛక్తి సరఫరాలతో అక్రోశిస్తోంది ఆంధ్రుల రాజధాని ఈనాడు.

అందమైన దీపాల కాంతిలో అలరారెడి పురవీధులు క్రొవ్వొత్తుల కాంతిలో కళావిహీనంగా కనబడుతున్నవి. కాంతిని గోల్పోయిన రాత్రి సమయంలో, వాహనాలు వాయువేగ మనోవేగాలతో రద్దీగా ప్రమాదాలకు లెక్క చేయకుండా పోతుంటే మనలాంటి వాళ్లము ప్రాణాల నరచేతులలో పెట్టుకొని పయనించవలసి వస్తోంది.

చరిత్ర తిరిగి రిపీట్ అవుతుందంటారు ఇందుకే కాబోలు. లాంతర్లు, క్రొవ్వొత్తులు, దీపం సెమ్మెలు మళ్లీ మనం వాడుకోవలసి వస్తోంది బజాజులు దులుపుకొని. వీటి ధర ఎక్కుతోంది విపరీతంగా ఈ మధ్య.

పాత కొత్తల కలయిక అనిపిస్తోంది ప్రతి వీధిలో పంపు ప్రక్కన తవ్విన బోరింగ్ బావి చూస్తుంటే. ఇళ్ళల్లో, వీధులలో ఎక్కడ చూసినా బావులే. ఏది మాట్లాడినా 'నీటి' ఎద్దడి గురించియే. బావులను తవ్వించలేని మనవంటి వారు నీటితొట్టెలు, కుండలు, కూజాలు కొనుక్కొని నీటిని స్టాక్ చేస్తున్నారు. వీటికీ డిమాండ్ పెరిగిందనుకో.

ఇక వస్తోంది నూతన సంవత్సరం. పేరులో ప్రమాదీ అని ఉన్నా, మనకి మన రాష్ట్రానికి ప్రమాదాలు తెచ్చిపెట్టకుండా, నవ్య శోభ నిచ్చి, నూత్న రాష్ట్రమిచ్చి వినూత్నమైన దివ్యకాంతులనిచ్చి శోభాయమానంగా ప్రకాశింపజేయాలని, ప్రశాంతత నిట్టూర్పాలని కోరుతూ శుభాకాంక్షలతో

ఇట్లు

— ఎస్. ఎల్. దేవి.

హైదరాబాద్ ...

పండిత ప్రకాండులూ 'అపశబ్ద భయం నాస్తి అప్పలాచార్య సన్నిధౌ' అని నిశ్చింతగా వుండలేదు. వనపర్తి సంస్థానం ఆస్థాన విద్వాంసుడుగా ఆయన జరిపించిన విద్వద్వ్యాఖ్యార్థాలు, గోష్ఠులు ఎన్నైనా ఉదాహరించవచ్చు. మిన్నువిరిగి మీదపడినా కలగుండు పడనితలంపు, అన్నిటికన్న మిన్నగా 'ఇది మీవల్ల జరగాలి' అని ఎవరుకోరినా నెత్తిమీద పెట్టుకొని పట్టుదలతో పని సాధించే మెత్తని మనసు శ్రీ శాస్త్రిని లోకప్రియుని చేసింది. కనుకనే, వారాణసి సార్వభౌమ సంస్కృత ప్రచారిణిసభ కార్యదర్శి శ్రీ వాసుదేవ ద్వివేదీ ఆ మధ్యన శ్రీ శాస్త్రిపై చెప్పిన


'మూర్తిః మత్తగజేంద్ర దర్పదళినీ,
వాణీ వినోదప్రియా,
వ్యాఖ్యా, లేఖ, కవిత్వ కౌశల కళా -
పారంగతా శేముషీ,
శక్తిః సంస్కృత భాషణేష్వనుపమా,
విద్వజ్జనేష్వాదరః,
శ్రీమల్లక్ష్మణశాస్త్రిణాం గుణగణాః
తేషాం నతోషా వహాః.'

అనే చాటు శ్లోకం జ్ఞాపకం వచ్చినప్పుడు, ఈ మత్తగజేంద్రమూర్తి సంస్కృత సాహిత్య పద్మాకరంలో విహరిస్తూ అసంఖ్యాక పద్మాలను ఆంధ్రావళికి అందిస్తాడని ఆశిస్తుంటాను; అందివ్వకపోతాడా అని నమ్ముకున్నాను.

ఉపశ్రుతి

రాజకీయసభ. వక్త ప్రత్యర్థి వాదం సరిగా ఖండించలేక నంగినంగిగా మాటలు మింగుతున్నాడు. 'వై ఆర్ హి చూయింగ్ వాటర్?—అంటే ఆయన ఎందుకు నీళ్ళు నములుతున్నాడు?' అన్నాడు ఒక విద్యార్థి. 'స్వామీ తాగడానికే నీళ్ళు లేవే? నమలడానికి నీళ్లెక్కడవయ్యా?' అన్నాడు పక్క పెద్దమనిషి. 'మరేమిటి ఆయన నమిలేది?' అని మరొకరి ప్రశ్న. 'సిద్ధాంతాలు నములుతున్నాడు సాబ్!' అన్నాడు సాధారణ మనిషి.

చేదు లో తీపి



జై తెలంగాణా
జై ఆంధ్ర
పాకిస్తానుకు అమెరికా యుద్ధ సామగ్రి
ఇక్కణ్ణుంచి చూస్తే అది చాలా చిన్నదిగ అగుపిస్తోంది!!
చైనా
ఐ.సి.బి.యం
7,000
ప్రజల సమస్యల సమస్యలు ...
ప్రతి పక్ష నాయకులు
తీపి
Jayadev

ప్రజలూ - సినిమా

ఆంధ్ర సచిత్ర వారపత్రిక నిర్వహించిన 'ప్రజలూ—సినిమా' వ్యాసరచన పోటీలో ఎంతో ఉత్సాహంతో పాల్గొని దానిని జయప్రదం చేసిన రచయిత (త్రు) లందరికీ మా కృతజ్ఞతలు. వ్యాసరచన పోటీలో మొదటి మూడు బహుమతులని పొందిన వ్యాసాలని ఈ కింద వేస్తున్నాము. ఒక్కొక్కటి రు. 50 చొప్పున ప్రత్యేక బహుమతులు పొందిన శ్రీయుతులు దెందుకూరి దుర్గాప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, శ్రీమతి దుగ్గిరాల ధనలక్ష్మి గార్లు రాసిన మూడు వ్యాసాలని పై వారంసంచికలో ప్రచురిస్తాము. బహుమతులని పొందిన వ్యాసరచయిత (త్రు) లందరికీ మా అభినందనలు. —సం॥

మొదటి బహుమతి రు. 250 పొందిన వ్యాసం

అభిప్రాయాలు కాలానుగుణ్యంగా మార్పు చెందటం చూస్తున్నాము. కళ కళకోసమే అన్న వాదన ఇదివరకు ఉండేది. కళ కళకోసం గాదు. కళ ప్రజలకోసరం అన్నమాట ఇప్పుడు చలామణీ అవుతున్నది. కేవలం ప్రచారసాధనంగా, వినోదప్రధానమయినదిగా భావింపబడిన సినిమా ఇవాళ కళాసాధనంగా ప్రయోజనాత్మకమయినదిగా గుర్తింపబడినది. విజ్ఞానం, వినోదం అందిస్తూ ప్రజల్లో చైతన్యం ఉద్దీపింప చేస్తూ ఇవాళ సినిమా ప్రముఖమయిన పాత్ర వహించాలని గట్టిగా చెప్పవచ్చును. సామాన్య జనుడికి చవగ్గా లభ్యమవుతూ, అతడికి మిక్కిలి దగ్గరగా వచ్చిన సాధనాలలో సినిమా మొట్టమొదటిదవటమే అందుకు ప్రధానమయిన కారణం.

సినిమా పరిశ్రమని పోషించేవి ప్రజలు. ప్రజల బాగోగులమీదనే సినిమా పరిశ్రమ బాగోగులు ఆధారపడి వుంటాయనాలి. కనుక ప్రజలమీద తనకుగల అనల్పమయిన ప్రభావం వెనువెంటనే గల బాధ్యతని సినిమా గుర్తించి తీరాలి.

అయితే సినిమా కేవలం కళాసాధనమే గాక పెద్ద వ్యాపారం కూడా. కోట్లాది రూపాయల పెట్టుబడితో నడుస్తున్న ఈ పరిశ్రమ మీద ఎందరో ఆధారపడి వున్నారు. నిర్మాతలు నటీనటులు, టెక్నీషియన్సు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రదర్శకులు — వీరంతా సినిమామీద ఆధారపడి వున్నారు. వీరందరికీ ఎన్నో సాధకబాధకాలు వున్నాయి. వాటన్నిటినీ అధిగమించి వీరు గొప్ప కృషి చేస్తున్నారు. ప్రయోజనాత్మకమయిన కృషికి వెంటనే గుర్తింపూ లభ్యమవుతూ వుంది. ఇదే అందరూ ఆనందించదగిన అంశం.

ప్రజలమీద ఎంతో ప్రభావం చూపించగల సినిమా ప్రజల సమస్యలగురించి నిర్లిప్తత వహించటం బాధ్యతగల పని గాదు. ఆ బాధ్యతని కొంతవరకు సినిమా పరిశ్రమ గుర్తించినట్లు లోగడ కొన్ని దాఖలాలు వున్నాయి. క్షామనివారణ, వరద నివారణ, దేశరక్షణ వంటి సమస్యలు ప్రజల్ని ఎదుర్కొన్న సందర్భాలలో సినిమా పరిశ్రమ ముందుకువచ్చి చేయూతనివ్వటం గమనించబడిన విషయమే. అయితే అంత మాత్రంచేతనే ఆ బాధ్యత పూర్తిగా నిర్వర్తించబడిందని చెప్పటానికి వీలులేదు.

ఏ కళ అయినా యదార్థ జీవితాన్ని ప్రతిబింబించాలన్న అభిప్రాయం ఈనాడు నిరూపితమయింది. ఆ అభిప్రాయాన్ని నేటి సినిమా నిరూపించటంలేదని చెప్పి విచారించక తప్పదు. దేశ కాలపరిస్థితులకి తల వొగ్గి బ్రతుకు బండిని భారంగా ఈడుస్తూ జీవితాన్ని నెట్టుకువస్తున్నాడు సామాన్యజనుడు. ఆ బాధని కొంతవరకు మరపు కలిగించి, నేటి సినిమా మత్తుపదార్థంలా పని చేస్తున్నదేగాని, చైతన్యాన్ని, మానసికోన్నతిని ఇవ్వటంలో చాలవరకు విఫలమవుతున్నదని అనటంలో అసత్యంలేదు.

తనకు తాను గిరి గీసుకుని, అందులోనే వ్యూహాలు అల్లుకుంటూ పల్టీలు కొట్టే ఏ వ్యవస్థా ప్రజల్ని ఎక్కువకాలం ఆకట్టుకోలేదు. ఈ సత్యాన్ని గుర్తించిన నాడు సినిమా ప్రజలకి మరింత దగ్గరకి రావటానికి ప్రయత్నించగలదు.

ఆకలి, కరువు, కన్నీళ్ళు, ఆకాశం అంటుతున్న ధరలు, ఎగసిపడుతూ విజృంభిస్తూ వున్న స్వార్థ పిశాచం — మున్నగు ఈతి బాధలేగాక ప్రజల్ని పట్టి పీడిస్తున్న ఇతర సమస్యలూ ఎన్నో వున్నయ్. ఈ అన్నిటినీ ఎలాగో అధిగమించి ఆత్మోన్నత్యాన్ని నిలుపుకోవాలని తాపత్రయ పడటం జాతికి గర్వకారణం. అభిమానాన్ని, అస్తిత్వాన్ని నిలుపుకోలేని జాతి జాతిగా మన జాలదు. ఆ చైతన్యమే జాతికి జీవగర్ర. అందుకోసం రక్తాన్ని ధారవోసి తర్పణం చెయ్యటానికి ప్రజ సిద్ధపడటం ఆరోగ్యవంతమయిన లక్షణం.

ధనికులు, మేధావులతో నడుపబడుతూ వున్న సినిమా పరిశ్రమ ఈ సత్యాన్ని గుర్తించక నిర్లిప్తత వహించటం ప్రజలు సహించరు. ముఖ్యంగా ఎన్నో సౌకర్యాలు, ఎంతో ప్రభావమూ కలిగి వుండిన సినిమా పరిశ్రమ వెనుకబడి వుండటం వలన తన బాధ్యతనే విస్మరించిందని బాధ పడటం అసహజం కాదు.

ప్రజలు అందరూ ఒకే కోరికని కోరుకుంటున్నప్పుడు ఆ కోరికని ప్రతిబింబించే విధంగా ప్రచార సాధనం కావటంలో సినిమాకి గల అసౌకర్యం ఏమీలేదు. కేవలం వినోద ప్రదర్శనల ద్వారా ప్రజల్నించే ధనం సేకరించి ప్రజలకి అందివ్వటంలో గొప్పతనం లేదు. స్వయంగా విరాళాలు ఇచ్చి కష్టంలో వున్న ప్రజని ఆదుకోవటం 'సినిమా'కి కష్టతరమయిన పనిగాదు. సకాలంలో బాధ్యతని గుర్తించగలిగితే, ఆ బాధ్యతని నెరవేర్చటానికి ఎన్నో మార్గాలు వున్నాయి. ఎన్నో సాధనాలు, సుసంపన్నమయిన వ్యవస్థా నేటి 'సినిమా' వెనుక అండగా వున్నాయి. కలిసి వుంటే కలదు సుఖం అన్న నానుడి చివికిపోయి, విడివడి, అభిమానంతో, ఔన్నత్యంతో బ్రతకటంలో నవజీవన సంప్రదాయం నిలబడి వుంటుందన్న సత్యం 'సినిమా' మేధావి తనం గుర్తించని లేదా? అట్టి పరిస్థితిలో తనకు గల పరిగణన అదృశ్యమయి ప్రజల మీద గల తన ప్రభావం నీరుగారి పోవటం, అభివృద్ధి చెందాలని కోరుకొనే ఏ వ్యవస్థా ఆశించని ఒక దుష్పరిణామం వచ్చి తీరుతుందని విచారించక తప్పదు.

—పాలడుగు విజయలక్ష్మి

వ్యాసరచన పోటీ ఫలితాలు!

రెండవ బహుమతి రు. 200 పొందిన వ్యాసం

సామాన్యుడికి అందుబాటులో వున్న ఒకే వినోదం సినిమా. అది మిగతా కళా రూపాల్ని వెనక్కి నెట్టేసింది. ఈనాడు గ్రామీణ స్థాయి వరకూ పాకి ప్రభావితం చెయ్యగల కళాశక్తి అది. ప్రజల సాంస్కృతిక జీవితాన్ని మనోభావాలను కనిపించని ముసుగులో వుంచి మార్చగల శక్తి. విచారకరమైన విషయం ఏమిటంటే ఈ రోజు సినిమా ప్రజల జీవితాన్ని ప్రతిబింబించటం లేదు. వారి సమస్యల్ని దూరం నుంచి అయినా తాకటం లేదు. వీటి నుంచి వేరు పడి ఎక్కడో అరువు తెచ్చుకున్న సంస్కృతిని ప్రచారం చేస్తూ వుంది. కొన్ని కృత్రిమ సమస్యల చుట్టూ కథల్ని అందమైన బంగళాలనుంచి రంగులతోటల్లోకి పరుగెత్తి అండర్‌గ్రౌండ్ యుద్ధాలలో అంతమవుతుంది సినిమా.

'ప్రజలు కోరే సినిమాలే తీస్తున్నాం' అంటారు సినిమావాళ్ళు. 'లక్షలు ఖర్చు పెట్టి మమ్మల్ని మట్టికొట్టుకు పొమ్మంటారా?' అని కోప్పడతారు. అచ్చం వ్యాపారమే అని ప్రజలకు తీపిపూసిన నల్లమందు మింగించే హక్కు వారికి లేదు. కళాకారులు మేధావులుగా ప్రజలకన్న ముందు వుండాల్సిన అవసరం వుంది. ఏది కావాలో చూపించలేక పోయినా ఏది జాతి జీవితాన్ని సంస్కృతిని వక్రమార్గాలు పట్టిస్తుందో కనీసం దాన్ని అందించక పోవటం నైతిక బాధ్యత. సినిమా సుమతీ శతకం లాగా నీతులు వల్లించనవసరం లేదు. కాసేపు వినోదం కోసం వచ్చినవాళ్ళ్ని కన్నీళ్ళతో సాగనంపనవసరం లేదు. కాని జీవితాన్ని సామాజిక సమస్యల్ని విశ్లేషించటం కళ కనీస బాధ్యత. కల్పన నేపథ్య గీతమైతే సాంఘిక వాస్తవికత కథగా ప్రాణం పోసుకోవాలి.

ఈనాడు జాతియావత్తూ కొత్తమార్పులకు లోనవుతున్నది. పాత విశ్వాసాలు, ఆచారాలు, కుటుంబ సంబంధాలు, ఆర్థిక వ్యవస్థ, కనిపించనంత వేగంగా మార్పు చెందుతున్నాయి. సమిష్టి కుటుంబాల బలం సడలి పోతున్నది. స్త్రీ నాలుగు గోడలను దాటి వుద్యోగాలలోకి వుద్యమాలలోకి దూకి కొత్త చిక్కులలో చిక్కుకుంది. గ్రామ వృత్తులు నశించగా తేలిన దారిద్ర్యం కట్టులు తెంచుకుని పట్టణాల వైపు ప్రవహిస్తూ వుంది. భూమిని నమ్ముకున్న మధ్యతరగతివాడు భూమిని అమ్ముకోవటానికి వీలులేని స్థితి. నిరుద్యోగం యూనివర్సిటీల్ని తగలబెడుతూ వుంది. అడవులలో హింసా మార్గాల్ని వెతుకుతోంది. రాను రానూ వ్యక్తి ఏకాకి అవుతున్నాడు. రక్షణ కల్పించలేని ప్రభుత్వం క్రమేణా అతని స్వాతంత్ర్యాన్ని హరించి వేస్తోంది. శాంతికి దూరమైన సమాజం నిరంతర సంఘర్షణకు లోనవుతోంది.


జనజీవితంలోని ఈ మార్పులకు స్పందించక కొన్ని పడికట్టు రాళ్ళతో పాత చింతకాయపచ్చడినే జాడీలు మార్చి ప్రజలకు పంచుతోంది నేటి సినిమా.

తెలుగు సినిమా 'ఆంధ్రప్రదేశ్' భాషా సాంస్కృతిక సమైక్యతకు కూడా ఏ విధంగానూ తోడ్పడలేక పోయింది. సినిమాలో తెలంగాణా భాష, రాయలసీమ యాస, వినపడదు. సంక్రాంతి పాటలు వినపడతాయి. కాని బతకమ్మ కనిపించదు. సింగరేణి కార్మికుడు, ఆదిలాబాద్ సామాన్యుడు రాయలసీమ రైతు సినిమాల్లో కనిపించరు. దాని భాష సర్కారు జిల్లాల భాష. దాని కథ పై మధ్య తరగతుల కృత్రిమ జీవితం. ఒకే రాష్ట్ర ప్రజల మధ్య సాంస్కృతిక సమైక్యతకు తెలుగు సినిమా ఏ విధంగానూ దోహదం చెయ్యలేక పోవటం పెద్ద దురదృష్టం.

సినిమా పరిశ్రమలో ఎందరో కళాకారులున్నారు. తెలుగులో వుత్తమ రచయితలు అనదగ్గ మేధావులున్నారు. వారు ప్రజలకన్నా ముందు వుండవలసిన వారు. జాతి సమస్యల్ని జీవితాల్ని సరాసరి స్వతంత్రంతో గ్రహించి బలంగా చిత్రించాల్సిన బాధ్యత వారిపై వుంది. ప్రజల్ని పట్టి పీడించే సమస్యల నుంచి వారు ఎంతో కాలం దూరంగా వుండలేరు. ప్రజలు ఆంధ్ర వుద్యమంలో చేసిన హెచ్చరికలు ఈ సూత్రాన్నే రుజువు చేస్తున్నాయి.

సంస్కృతిని దిద్దగల ఆయుధం సినిమా చేతుల్లో వుంది. అది పిచ్చి వాడి చేతులో రాయి కాకూడదు.

చివరికి—ఈనాడు ప్రజలనుంచే 'సినిమా' ఎంతో నేర్చుకోవలసి వుంది. అలా జరుగుతుందనే ఆశిద్దాం. —కె. మాధురి ●



మూడవ బహుమతి రు. 150 పొందిన వ్యాసం

మానవుని కవసరమైన తిండి, గుడ్డలతో పాటు నేటికాలంలో ఆవశ్యకమయిన వినోద సాధనంగా ప్రజానీకానికి అతి సన్నిహితమయిన విజ్ఞానయుక్తమయిన కళ—'సినిమా'! సినిమాలు కేవలం వినోద సాధనాలుగానే కాక సామాజిక వ్యవస్థకు ప్రతిబింబాలుగా, జాతీయ సమైక్యతకు, జాతీయ భావానికి, విజ్ఞాన వికాసాలకు కూడ మార్గదర్శిగా వుంటోంది. నేడు 'ప్రజలు — సినిమా'లు పరస్పరాశ్రితులుగ తయారయ్యారు. ప్రజాజీవనంలో ఓ భాగమైంది సినీ పరిశ్రమ! ప్రజల్లో చైతన్యాన్ని, భావ విప్లవాలకు ప్రముఖ ప్రచార సాధనాలయ్యాయి. ఇలాంటి సినీ పరిశ్రమ వల్ల ప్రజల్లో, సమాజంలో విప్లవాత్మకమయిన, ప్రయోజనాత్మకమయిన మార్పులు తేవడం సులభం. సకల కళలకూ నెలవైన యీ పరిశ్రమ దేశ విదేశ ప్రజలకూ, ప్రభుత్వాలకూ భావవారధులై వారి వారి జాతీయతలను ప్రతిబింబింపజేస్తున్నాయ్.

1890 లో 'ఎడిసన్'చే కనిపెట్టబడి, 'క్లైస్సర్'చే వ్యాప్తి చేయబడిన యీ సినిమాలలో నేడు 'కళ' అంతరించి—జన వ్యామోహాన్ని ఆధారంగా చేసుకుని వ్యాపార సంస్థగా తయారయింది. వినోదంతో కూడిన విజ్ఞానాన్నందించవలసిన యీ సినిమాలు వికారాన్ని కలుగజేస్తున్నాయి. నేడు దేశకాలమాన పరిస్థితుల కనుగుణంగా వుండే ప్రజోపకరమయిన చిత్రాలు రావడం లేదు. ప్రపంచం నలుమూలలా ఎన్నో సమస్యలున్నాయి. వాటి నాధారంగా తీసుకుని చిత్రాలు నిర్మించి పరిష్కారమార్గాలు పలువిధాలుగ చూపిస్తే అవి ప్రజల కుపయోగపడతాయి గానీ, ప్రేమించడాలు, పెళ్ళాడటాలు, శృంగారగీతిక ల్నాలాపించడం, వీలైతే అవివాహితలను గర్భిణీలు చేయడం, విషాదగీతాలు పాడుకోవడం చిత్రీకరిస్తే ఒరిగే వుపయోగం ఏముంది? అసలీ సమస్యలు ప్రజల కుపయోగించునా? కేవలం యిలాటి 'స్టీరియో టైప్డ్' కథలే నేటి సినీపరిశ్రమ మన ముందుంచుతోంది. ఇందువల్ల అటు ప్రభుత్వానికీ, యిటు ప్రజానీకానికీ ఏవీ లాభం కల్గదు — ప్రజల్లో వెర్రిమొర్రి వేషాలకు, చిత్త ప్రవృత్తులకు తావివ్వడం తప్పిస్తే!

సరియైన పంథాలో నడిస్తే యీ సినిమాల వల్ల ప్రజలకెంతో ఉపయోగం వుంది. విదేశాల్లో ముఖ్యంగా రష్యా, చైనా, జర్మనీల్లో చలన చిత్రాలు ప్రజా జీవనానికి మార్గదర్శకాలయ్యాయి. 1924లో రష్యాలో చలన చిత్రాల ద్వారా ప్రజలకు విద్యా బోధనలు గరిపేవారు. చైనాలో యీ పరిశ్రమ ప్రజా విప్లవం, భావసమైక్యతకు దారి తీసింది. ఈ సినీ పరిశ్రమే జర్మనీలో, ముఖ్యంగా తూర్పు జర్మనీలో ప్రపంచ యుద్ధాలవల్ల కలిగే నష్టాలు... వాటి క్లిష్ట పరిస్థితులు ఆ దేశ ప్రజలకు తెలియజెప్పింది. ఇప్పుడా దేశాలు శాంతి సహజీవనాలతో సుభిక్షంగా వుంటున్నాయ్. ఇంతటి విప్లవాత్మకమయిన యీ పరిశ్రమ మన దేశంలో కేవలం వినోద సాధనమవడం — క్వాంటిటీ పెరుగుతూ, క్వాలిటీ తగ్గడం బహు విచారకరం! నేడు విడుదలవుతోన్న చిత్రాలవల్ల అసభ్యత, అశ్లీలము, కుసంస్కారం 'ఫ్యాషన్' పేరుతో నేర్చుకుని; దేశాభ్యుదయాన్నీ, సమాజ కళ్యాణాన్నీ వుపయోగపడే యువతరం—అభిమాన దురభిమానాలకు లోనై, 'కూపస్థ మండూకా'లై సమాజంలో ఎందుకూ పనికిరాని వారుగ తయారౌతున్నారనే విషయం శోచనీయం...

ప్రజల చిత్తవృత్తి బహు విచిత్రమైంది. ముఖ్యంగా సామాన్య ప్రజానీకం అమాయకమైన, 'గొర్రెదాటు' మనః ప్రవృత్తి గలవారు. వీరిని సరైన మార్గంలోకి యీ సినిమాలు నడపాలి. వారిలో సభ్యతా సంస్కారయుతమైన భావ చైతన్యం కలిగే మాదిరి పరిశ్రమ పాటుపడాలి. ప్రజా జీవనంలో ఓ భాగమైన యీ సినిమాల నుండి ప్రజలకు కాలక్షేపం, వినోదం, విజ్ఞానంతోపాటు, ప్రభుత్వాదాయాన్ని పెంచడం (పన్నులు ఎగగొట్టకుండా), భాషాంతరీకరణం చేయడం లోనూ, అంతర్రాష్ట్రీయ సంబంధాలను, సాంస్కృతిక వ్యాపారిక సంబంధాలను ద్విగుణీకృతం చేయగల్గిన చిత్రాలు నిర్మితములవ్వాలి. అప్పుడే జాతి ఉద్విగ్నమౌతుంది; అపుడే జాతి బలపడుతుంది...

పరిశ్రమ ఉత్తమ చిత్రాలను నిర్మించాలి. ప్రజలా చిత్రాల్ని ఆదరించి, పోషించాలి. ఇలా పరస్పరాశ్రితులయిన యీ 'ప్రజలు—సినిమా'కు, ప్రభుత్వం అండదండలు కూడ వుండాలి. సినీపరిశ్రమకు కల్గే ఈతిబాధల్ని తొలగించడాన్కిగాను 'ఫిలిం ఫైనాన్స్ కార్పొరేషన్' పేరిట ఆర్థిక సహాయాన్ని, క్రమశిక్షణకు 'ఫిలిం కౌన్సిల్'ను, చిత్రాలపై అదుపుకు 'ఫిలిం సెన్సార్' బోర్డుల నేర్పాటు చేయాలి. పరిశ్రమలోని పెద్దల నీ విషయంలో సంప్రదించడం ఉత్తమం, శ్రేయస్కరం! మన సినీపరిశ్రమకు చెందిన పెద్దలుగూడ కొన్ని విషయాల్లో బహు జాగరూకులై వుండాలి. పాశ్చాత్యచిత్రాల్లో యీనాడు ప్రబలిపోయిన 'స్వైరత' (పెర్మిసివ్‌నెస్), తత్సంబంధమైన దిగంబరత (న్యూడిటీ) మన చిత్రాల్లో దిగుమతి కాకుండా చూడాలి. చిత్రాల సంఖ్య పరిమితం గావడాన్కి నిర్మాతలందరూ 'కార్పొరేషన్స్'గా ఏర్పడాలి. అపుడే ఉత్తమ చిత్రాలు, తత్ఫలితంగా ఉత్తమపౌరులు ఏర్పడగలరు. అప్పటికిగానీ సినిమా పరిశ్రమ, సామాజిక వ్యవస్థ ఆరోగ్యకరం కానేరవు. ఆనాటికిగానీ, పండిట్ జవహర్‌లాల్ చెప్పినట్లు — 'చిత్రాలు జాతీయ సమైక్యతను, సామాజిక వ్యవస్థను ప్రతిబింబింపజేసే కళాస్వరూపాలు' కాజాలవు!

— శివ

ఉగాదిపండగవచ్చింది

వచ్చింది! వచ్చింది!
ఉగాది పండగ వచ్చింది
కలకల్లాడుచు నూతనకాంతితో
చక్కని శోభను యిచ్చింది!
పిన్నలు పెద్దలు అందరును
ప్రొద్దుటే ముందుగ లేచారు!
తలంటి స్నానం చేశారు.
క్రొత్త బట్టలు కట్టారు!
మామిడి కొమ్మలు తెచ్చారు
గుమ్మాలకు వరుసగా కట్టారు!
ఉగాది పచ్చడి వగైరా
దండిగ ఎన్నో చేశారు!

—కుమార్



తిరిగిరాని వసంతం

గొల్లపూడి రాజ్యలక్ష్మి

(గత సంచిక తరువాయి)

ఏలూరు తిరిగి వచ్చినాక— సత్యకో సుదీర్ఘమైన లేఖ వ్రాస్తూ — శంకరం గుణగణాలు పొగిడి—అతని ఔన్నత్యాన్ని స్తుతించి—అతని సంస్కారాన్ని మెచ్చుకొని —'అలాంటి ఆదర్శపురుషుడిని అర్థం చేసుకోకపోవటం నీ దురదృష్టం' అంటూ జాలిపడి — పరిపూర్ణమైన వ్యక్తులు ఎక్కడా వుండరు—ఏదో ఒక బలహీనత ప్రతి మనిషికీ వుంటుంది. అది సరిపుచ్చుకుని బ్రతకటం నేర్చుకోవాలని హితోపదేశం చేస్తూ—శంకరానికి—నాకు మధ్య జరిగిన విషయాల్ని వ్రాసి—నేను చేసిన వాగ్దానాన్ని వివరించి—'నీకు నీ భర్త తర్వాతనే ఎవరైనా! అతన్ని కాదని నువ్వేమీ చేయగలిగింది లేదు! ఇప్పటికైనా నీ మనసు మార్చుకుని — గుంటూరు ప్రయాణానికి సిద్ధమై వుండు! నేను వీలు చూసుకుని వస్తా'నంటూ కర్తవ్యాన్ని ఉపదేశిస్తూ ముగించాను. ఉత్తరాన్ని పోస్టులోవేసి—నా ఉత్తరాన్ని—నన్నూ సత్య లక్ష్యపెట్టి—విలువ తప్పక ఇస్తుందనే నమ్మకంతో వున్నాను. తర్వాత పదిరోజులకనుకుంటాను. సత్య దగ్గరినించి సమాధానం వచ్చింది.

'బావా!

నా మనసు నీ ముందు పరిచాను. నా సంతోషాల్ని సుఖాల్ని—ఆవేదనల్ని అన్నీ నీకు విశదపరిచాను. నువ్వు నాకెంతో ఆత్మీయుడివనీ — సన్నిహితుడివనే నమ్మకంతో. కానీ—నా దురదృష్టం! ఎంతో మంచి మనసుగల నువ్వుకూడా ఛాందసుడి వయ్యావు! బావా! నన్ను అజ్ఞాపిస్తున్నావా? శంకరంతో తిరిగి సంసారం కొనసాగించటం నాకేమాత్రం ఇష్టంలేదు. ఇష్టంలేని పని నేను ఛస్తే చెయ్యను. నిన్ను చూస్తుంటే నాకు జాలి—నవ్వు కలుగుతున్నాయి. ఒక విధంగా నువ్వు అమాయకుడివి కూడా. శంకరం తిరిగి నన్ను స్వీకరిస్తానని అన్నాడని ఆకాశాని కెత్తేశావు అతన్ని! అందులోని పరమార్థం నీకు తెలియదు. నేను ఓటమి నంగీకరించి—అతని దగ్గర కెళ్ళటంలో — తన గెలుపున్నది. 'నేను తొందరపడ్డాను'! అని అభిమానం చంపుకుని అతనితో జీవితం కొనసాగించటమంత ఘోరపరాజయం వేరేమీ లేదు. ఒకవేళ ఆపరిస్థితి వస్తే అంతకంటే చావు వెయ్యిరెట్లు నయం. ఎందుకంటావా? ఇప్పటికే ఒకరిపై ఒకరికి సదభిప్రాయం పోయింది. గౌరవం — నమ్మకం అసలు లేవు. పైగ దురభిప్రాయం, కోపం— అసహ్యం — చీదర! ఇవన్నీ దాచుకుని ఎలా జీవితాన్ని కొనసాగించాలి? ఇదేమన్నా ఒక రోజా — రెండు రోజులా? కళ్ళు మూసుకుని అయిష్టాన్ని మింగి గడిపేయటానికి? జీవి

తాంతం ఒకరి నొకరు అల్లుకుని — మధురోహలు నింపుకుని సాగించాల్సిన జీవన యాత్ర! అతనిమీద ఏ కొంచెమైనా అనురాగం, అతని తలపుల్లో ఏ మాత్రమైనా— పులకింత వున్నా నేనన్నీ సహించి వుండిపోయేదాన్నేమో! తన బలహీనతల్ని ఒప్పుకుని అసహాయతని వెల్లడించివుంటే— కించిత్తయినా సానుభూతిని కలిగి — అర్థం చేసుకోటానికి ప్రయత్నించి వుండేదాన్నేమో!

బావా! ఒక్కమాట! శంకరానికి— వనజతోడిదే లోకమైనా—సహించివుండమని సలహా ఇస్తున్నావే! — నేనే అతని పరిస్థితిలో వుంటే— ఏంసలహా ఇచ్చివుండేవాడివి? అవును బావా! నువ్వు మగాడివి! తరతరాల పురుషుల రక్తం నీలోనూ వున్నది! నువ్వు ఇంతకంటే వున్నతంగా — సానుభూతిగా — సంస్కారవంతంగా ఆలోచిస్తావనుకోటం నా భ్రమ! నాకు నిజంగా సహాయం చేయాలనివుంటే — నేనంటే నీకు నిజంగా అభిమానముంటే — నన్ను నీదగ్గరికి తీసుకెళ్లు! నువ్వు నిజమైన సంస్కర్తవైతే— నా జీవితాన్ని నేను తీర్చిదిద్దుకోగలస్థాయిని కలుగజేయి! అంతేకాని — ఇష్టంలేని మగడితో కాపురం చెయ్యమనే సలహాలు మాత్రం ఇవ్వకు!

సత్య.'

సత్య సమాధానంతో నా తల బొప్పి కట్టినట్లయింది. ఇంక ఆమె విషయాల్లో జోక్యం కలిగించుకోకూడదనుకున్నాను. ఆమెపై — నిష్కారణమైనభావం, కోపం— నిష్ఠూరం—నామాటల్ని తీసిపారేసిందనే కసీ ఏర్పడి చాలారోజులు ఉత్తరాలు రాయలేదు. పండుగ శలవుల్లో అమ్మ — నాన్నల దగ్గరకెళ్లొచ్చేవాడిని! సంక్రాంతి పండక్కి వెళ్లి వచ్చాడనుకుంటాను అమ్మ అన్నది.

'సత్య ఇంత తెగించిపోయిందేమిట్రా?' అంటూ విడ్డూరంగా.

'దాని సంగతి నాకు చెప్పకు!' అన్నా— ముఖాన గంటుపెట్టుకుని.

'అదేమిటి? మీ ఇద్దరిదీ ఒక్కప్రాణం కదూ?'

'ఆఁ...ఏం ప్రాణం? ఒకరంటే ఒకరికి విడిపోయిన తర్వాత!' అన్నా చిరాగ్గా.

అదేం వినిపించుకోనట్లు తన ధోరణిలో అన్నది.

'అన్నయ్య నీగులుపడి కూర్చున్నాడు—

తిరిగిరాని వసంతం

దాన్నిగురించి. ఇలాంటివాళ్లు కడుపున పుట్టటం వింత పాపం చేసుకుంటేనో. అయినా కట్టుకున్నవాడిని కాదని ఈవిడేం చేస్తుందిట? ఇంకా నయం... 'వయసులో తేడా లేకపోతేమటుకేం? నీకొడుక్కి చేసుకోరాదుటే?' అంటూ అడిగాడన్నయ్య. వింత అప్రతిష్ట తప్పిపోయింది! దాన్ని చేసుకుని వుంటే తలెత్తుకు తిరిగేవాళ్ళమేనా?'

ఉలిక్కిపడ్డాను. 'ఏమిటీ సత్యను నా కిస్తానని మామయ్య అడిగాడా? నాకెప్పుడూ చెప్పలేదేం?'

'ఇందులో ఏముందని చెప్పటానికి? ఏమైనా జరిగే విషయాలైతే అనుకోవచ్చు. అది సరేగానీ—ఒరే పట్టాభీ! మొన్న రాజమండ్రి నుంచి సుబ్బరామయ్యగారనీ—పెద్ద ఉద్యోగస్థుడట! — కారేసుకొచ్చాడు—నీకు పిల్లనిస్తానంటూ. పి. యూ. సి. ప్యాసయిందిట! చక్కదనాల చుక్కట! పైగా వీణ కూడా నేర్చుకుందిట. ఇవన్నీ అలా వుంచి పదివేలిస్తాడట కట్నం! ఎలాగూ రానే వచ్చావు - మరో రెండురోజులు శలవు పెంచేసెయి. పిల్లను చూసి రావచ్చును!' అంటూ సమాధానంకోసం ఎదురు చూడకుండా తన పనిలో మునిగిపోయిన అమ్మ వైపు చూస్తుండిపోయాను. ఆశ్చర్యం— విభ్రాంతి—చిరాకు నన్ను చుట్టుకుపోయినయి. నమ్మలేకా—నమ్మకుండా వుండలేకా పోతున్నాను.

'సత్యను...నాకిస్తాననీ...అయితే సత్యకు నాపై వుండేది ఆరాధనా? నన్ను ప్రేమిస్తున్నదా? ఆమె ఉత్తరాల్లో అక్కడక్కడా తొంగిచూసే భావా లివేనా? అందుకే శంకరం అలా అన్నాడా? భగవాన్...ఏమిటిది? నన్నెక్కడికి లాక్కుపోతున్నావు? దీని పర్యవసానమేమౌతుంది? వున్న రెండు రోజులూ అన్యమనస్కంగానే గడిచిపోయినయి. మరో రెండురోజులు వుండమని అమ్మ గొడవ పెట్టింది. కానీ ఇప్పుడు వీలవదనీ నచ్చచెప్పి తిరుగుముఖం పట్టాను. నాలో ఏదో చెప్పలేని- నీరసం!

'తనకు నిజంగా మామయ్య అడిగిన విషయం—అప్పుడే తెలిసివుంటే ఏం చేసి వుండేవాడు? సత్యను...చేసుకుని వుండేవాడా?' ఈ ప్రశ్న తెగటం లేదు.

తర్వాత ఎప్పుడైనా—సత్య, నేను గడిపిన రోజుల్ని గుర్తుకు తెచ్చుకున్నప్పుడు మామూలుదృష్టితో చూడలేకపోయాను. అప్పటి సత్య స్నేహంలో — మాటల్లో — చూపుల్లో—నవ్వుల్లో ఏవో అర్థాలు కనిపించసాగాయి. సత్య రాసిన ఉత్తరాలు తిరిగి చదువుకుంటే—ఏవేవో కొత్త భావాలు గోచరించసాగాయి. 'ఏమిటిది? నేను చూసే దృష్టిలో వుందా ఆ మార్పు? లేక ఆమె మనోభావాలేనా? నేను...నేను సత్యను సరిగ్గా అర్థం చేసుకోలేదా?' ఒక్కసారి సత్యతో మనసువిప్పి మాట్లాడాలనిపించింది. కానీ అదెలా? ఆమెకు నాకు మధ్య శంకరం పెట్టనిగోడలా వున్నాడు. శంకరం విషయంలో ఏవో సలహాలివ్వబోయి— సత్య దృష్టిలో చులకనైపోయానేమో కూడా. అంతవరకూ సత్యపై వుండే తిరస్కారం కరిగిపోసాగింది. పైపెచ్చు సానుభూతితో ఆమె మనస్తత్వాన్ని—ఆలోచనల్ని—అర్థం చేసుకోవాలనిపించింది. సత్యను చూసి చాలా రోజులైంది. ఆమెకేదైనా సాయం చేయగలిగితే? అసలు సహకారం ఏ రూపంలో ఇవ్వాలి? ఆమెకు ఉద్యోగం ఇప్పించే ం పతి నాకు లేదు నిజానికి మామయ్య వ్యాపారంలో బాగానే సంపాదించాడు. సత్యకు డబ్బు ఇబ్బంది ఎప్పుడూ లేదు. కానీ ఆమె తన ఆత్మగౌరవాన్ని నిలుపుకోవాలనుకుంటే —ఒకరిమీద ఆధారపడి వుండకూడదు. సత్య బైపు పరీక్షలు కొన్ని ప్యాసయితే— ఎక్కడైనా ఉద్యోగంకోసం ప్రయత్నించవచ్చు. వున్న వూళ్లో మామయ్య ఒప్పుకోడు. ఇకపోతే ఇక్కడికి వచ్చి...! నేనొంటరిగా వున్నాను. బ్రహ్మచారిగాడిని. ఒక రూము తీసుకొని కాలక్షేపం చేస్తున్నాను. ఇక్కడికి సత్యను పిలిపిస్తే— ఇబ్బందిమాట అటువుంచి—నలుగురూ కథలల్లేయగలరు! నన్ను గురించి—ఆమెను గురించి—హేళనలు — విసుర్లు ఆఫీసులో భరిస్తూ కూర్చోవాలి. అంత నిబ్బరం నాకుందా? ఆలోచనల్లో వున్నంత సౌలభ్యం —ఆచరణలో ఎంత కష్టసాధ్యమో అర్థమైంది.

నాన్న—మామయ్యకు తరచుగా గుండె నొప్పి వస్తోందని — మంచంలో నుండి లేవటంలేదని జాబు వ్రాశారు. చాలారోజులైంది వాళ్లను చూసి. ఈ మధ్యలో

ఉత్తరాలు కూడా లేవు. ఇప్పుడీ ఉత్తరం చూడగానే మనసు నిలువలేదు. వెంటనే బయల్దేరాను

మామయ్య మంచంపక్కన సీత వదిన కూర్చుని విసురుతోంది నెమ్మదిగా. మంచానికి అంటుకుపోయిన మామయ్యని చూస్తుంటే కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినయి

'ఎలావుంది మామయ్యకు?' అడిగాను మెల్లిగా.

సీత వదిన నిట్టూర్చింది.

'ఇప్పుడే కాస్త నిద్రపట్టింది!' అన్నది.

స్నానంచేసిన తర్వాత స్థిమితంగా కూర్చుని— 'సత్య ఏదీ?' అంటూ ప్రశ్నించాను.

సీత వదిన మొహం చిట్లించుకుంది.

'పేడమీదే వున్నది! నాన్న దాన్ని గురించిన దిగులుతోనే కుమిలిపోతున్నాడు. ఎంతమంది చెప్పినా — అది తన మొండి పట్టు విడువదు! ఇక్కడ ఇలా అందరి చేతా నాలుగుమాటలూ అనిపించుకోటం దానికేం సుఖమో నా కర్థం కావటం లేదు.'

నాకు మౌనమే శరణ్యమయింది.

'ఒరే పట్టాభీ! నువ్వైనా చెప్పు! నే నేదైనా నెమ్మదిగా చెప్పబోతే పాతకాలపు దాన్ననీ చాదస్తం అనీ తీసి పారేస్తుంది. ఆడదానికి మొగుడిని మించిన పెన్నిధి

తిరిగిరాని వసంతం

ఏముంటుందిరా? పసుపు-కుంకుమల కంటే వేరే సౌభాగ్య మేముంది? ఎలాంటివాడైనా కానీ - భర్త నీడలో వున్న ఆడదానికి ఎంత గౌరవం వుంటుంది! ఎంత సానుభూతి వుంటుంది!! అది పోగొట్టుకుంటే ఎవరికి నష్టం? మాట్లాడవేం? నే చెప్పేది సబబుగా లేదా?'

సీత వదిన ఉద్వేగంతో నిలదీసింది.

ఏం మాట్లాడను? సీత — సత్యవతులు రెండు విభిన్న సంస్కృతీ స్రవంతు లని పించింది. సీతవదిన పూర్వాచార — సంప్రదాయ సిద్ధాంతాల ప్రతీక అయితే — సత్యవతి 'నాకూ కోరికలు— ఆశలు వున్నాయి. ప్రేమ — అనురాగం— ఆదరణ- గౌరవం ఇవ్వటమే కాదు — పుచ్చుకొనే అధికారం కూడా వున్నది. ఆడది బానిస కాదు—కోరికల శిఖరం' అని నొక్కి చెప్పే నేటి- ఆత్మ విశ్వాసంతో తలెత్తి బ్రతికే ధీరమహిళ. ఎవరి నమ్మకాలు వాళ్లవి! ఎవరి విశ్వాసాలు వాళ్లవి. ఖండించటానికి నేనెవర్ని? ఆఫ్టరాల్ మగాణ్ణి!

'అవునురా! నా పిచ్చిగానీ — నువ్వేం చెప్తావు? పద! ఎప్పుడనగా తినొచ్చావో— భోజనం చేద్దువుగానీ...' అంటూ లేచింది సీతవదిన. ఆవిడ పిల్లలు వంటింట్లో గోల పెడుతున్నారు అన్నాలకోసం. వెళ్లి మందలించింది. 'తాతయ్య లేస్తాడ్రా!' అంటూ—వంటావిడ సుబ్బమ్మగారు — కంచాలు సిద్ధం చేస్తోంది. నాకు ఆకలిగా లేదు. నిర్మలమైన తటాకంలో బెడ్డ విసిరినప్పటి కల్లోలం!

అత్తయ్య పోయినతర్వాత చాలారోజులు దిగులుపడిపోయిన మామయ్య — ఇద్దరు కూతుళ్ళనూ చూసుకుని ఆ దుఃఖాన్ని దిగమింగాడు. వాళ్ళ భవిష్యత్‌కోసం — సుఖం కోసం బ్రతుకుతూ జీవితాన్నీడుస్తున్నాడు. ఇప్పుడీ తుఫాను. సత్యవతి మేరుపర్వతమంత సమస్యతో కళ్ళముందు నిలిచేసరికి— ఆయన తట్టుకోలేకపోయాడు. మానసికంగా కృంగిపోయి ఇలా మంచం పట్టివుంటాడు. ఇదంతా సత్య వల్లనే కదా! అనిపించింది. మామయ్యదగ్గరకెళ్లి విసురుతూ కూర్చున్నాను చాలాసేపు. మధ్యలో సీత వదిన భోజనానికి రమ్మన్నా వినిపించుకోలేదు. మామయ్యకు మెలకువ వచ్చినట్లుంది — మూలగడం మొదలెట్టాడు. కళ్లకు చెయ్యి అడ్డంపెట్టుకుని చూస్తూ 'ఎవరూ?' అన్నాడు.

'నేనే మామయ్యా!'

'పట్టాభీ?'

'ఊఁ!' లేచి ఆయన ప్రక్కలో కూర్చున్నాను.

'బొత్తిగా ఇలా అయిపోయావేమిటి మామయ్యా?' అన్నా మెల్లిగా.

'ఇంక నేను బ్రతకనురా! నా పని అయిపోయింది!' ఆయన కళ్లల్లో తడి కనిపించింది.


'ఛ! వూరుకో మామయ్యా! అవేం మాటలు?'

'కాదురా పట్టాభీ! నిజమే చెప్తున్నాను.' అంటూ నా చేతులు రెండూ తన చేతిలోకి తీసుకున్నాడు.

'సత్య గురించే నా దిగులు!' కంపించింది గొంతు.

'ఎందుకు మామయ్యా దిగులు? దిగులుపడితే సమస్య తీరిపోతుందా? పెద్దవాడివి...అన్నీ తెలిసినవాడివి...మనస్సు దిక్కపట్టుకోవాలిగానీ...'

నిట్టూర్చాడు, 'నీకు తెలియదురా పట్టాభీ! అది ఎంతటి రంపపుకోతో. దాని జీవితమంతా అలా మోడుగానే మిగిలిపోతు... దనుకుంటే...' రుద్ధమైంది గొంతు.



'ఏదో చిన్నతనం! ఎప్పటికైనా సత్య మనసు మారుతుంది. శంకరం దగ్గర కెళ్తుంది. దీన్ని గురించి ఇంత కుమిలి పోవటం ఎందుకు? ఏం ఫర్వాలేదు అనే ధైర్యంతో తానక బ్రతకాలిగానీ......!'

'అయ్యో! నీకెలా చెప్పేదిరా? శంకరం మరో వివాహం చేసుకున్నాడు.'

అదిరిపడి మామయ్య కళ్ళల్లోకి చూశాను. లోతుకుపోయి—జీవం ఆరిపోయినట్లున్న ఆ గాజు కళ్ళలో నీరు ఉబుకుతోంది.

'అదెలా?' అన్నా అయోమయంగా చూస్తూ.

'సత్యే అనుమతి పత్రం రాసిచ్చింది. చేజేతులా తనమెడకు తానే ఉరిత్రాడు బిగించుకుందిరా! ఈ మొండిఘటానికి ఏం పూనిందో నా కర్థం కావటంలేదు.'

నాకు నోటమాట రాలేదు. మామయ్యకెలా ధైర్యం చెప్పాలోకూడా తెలియటంలేదు. వెర్రివాడిలా ఆయనవంక చూస్తుండిపోయాను. 'సత్య ఇంత పని చేసిందా? అయితే శంకరం పెళ్ళి చేసుకున్నాడా? అవును మరి! ఎంతకాలమని ఎదురు చూస్తాడు? మగాడెలాంటి వాడయినా ఈ రోజుల్లో పెళ్ళికావట మెంతసేపు? ఇక సత్య జీవితం...?'

'ఒరే పట్టాభీ! నాకోమాట ఇవ్వగలవా?' దీనంగా చూశాడు మామయ్య.

ఏమిటన్నట్లు చూశాను.

'మూర్ఖపు పట్టుదలతో—తన జీవితాన్నలా తగలబెట్టుకుంది. ఇప్పుడు తెలియదు తనకు జరిగిన నష్టం! తెలిసిన తర్వాత ఏమీ ప్రయోజనం వుండదు. ఆడపిల్ల! ఈ సంఘంలో ఒంటరిగ ఎలా బ్రతుకుతుందిరా?' ఆగాడు. కొద్దిగ ఆయాసం మొదలు పెట్టింది. సీతవదిన ఎప్పొచ్చిందో... 'ఎక్కువగా మాట్లాడకు నాన్నా! చూశావా? మళ్ళీ ఆయాసం వస్తోంది? పట్టాభితో తర్వాత మాట్లాడొచ్చులే. కళ్ళుమూసుకు పడుకో!' అన్నది మందలింపుగా.

'వన్నిప్పుడు ఆపకు సీతా! ఆపినాన్నేదో చెప్పబోతుంటే మాట్లాడవద్దన్నాను! పాపిష్టిదాన్ని!' అని తర్వాత జుట్టుపీక్కున్నా ఫలితం వుండదు!'

సీత అవాక్కురాలై తండ్రివంక

చూస్తూండిపోయింది.

'పట్టాభీ! నాకు మగ పిల్లలు లేని కొరతను — నిన్ను చూసి తీర్చుకున్నాను. నువ్వుకూడా కన్న కొడుక్కన్న మిన్నగా అభిమానిస్తూ వచ్చావు. ఇది ఏ జన్మలోనో నేను చేసుకున్న పుణ్యంరా! మీ అమ్మ ఒప్పుకోలేదుగానీ — ఒప్పుకొనివుంటే మీ ఇద్దరికీ పెళ్లి చేయాలనే తలపు నాకు చిన్నప్పటినుంచీ వున్నది.— సరే దైవలిఖితం ఇలా వున్నది! సత్యవతంటే నీకు చిన్నప్పటి నుంచీ మమకారం! ఆ ఆశతోనే అడుగుతున్నాను. అది ఏ అఘాయిత్యం చేసుకోకుండా చూడాలి!'

'సత్యను గురించి నీకేం బెంగ అక్కర్లేదు మామయ్యా! తను చాలా పట్టుదలగలది. అనుకున్నది సాధించి తీరుతుంది. తన జీవితాన్ని తానే చక్కదిద్దుకోగలదు. అదలా వుంచి మేమంతా వుండగా సత్యకేంలోటు? నువ్వు మనశ్శాంతిగా పడుకో. అన్నీ చక్కబడతాయి.' నాకుతోచిన నాలుగు ముక్కలూ సానునయంగా పలికి అక్కడినుంచి లేచి— వరండాలోకొచ్చాను. ఆరుబైట మంచాల మీద సీతవదిన పిల్లలు నిద్రపోతున్నారు. చంటిదాన్ని కాబోలు వుయ్యాల్లోవేసి వూపుతోంది సీత.

'అత్తయ్యకూ—మావయ్యకూ ఉత్తరం రాయరా పట్టాభీ! నాన్న పరిస్థితిచూస్తే ఇలావుంది— సత్యపరిస్థితిచూస్తే అలావుంది! నా కేమిటో కాళ్లూ చేతులూ ఆడటం లేదు!' అన్నది నావైపు చూస్తూ.

'ఏమన్నాడు డాక్టరు?'

'ఏమంటాడు? మనశ్శాంతిగా వుండాలిట! అప్పుడే మందులు పట్టిస్తాయంటాడు. అదే నాన్నకు లేదు. ఎంత చెప్పినా వినిపించుకోడు. పలుకరించిన ప్రతివారితోనూ—సత్యగోడు చెప్పుకొస్తాడు. చూస్తుంటే నాన్నకు పిచ్చి ఎక్కుతుందేమో అని భయంకూడా వేస్తోంది. ఒకనిషి చూస్తే మంచానికలా అతుక్కుపోయాడు. మందులిస్తే సరిగ్గా మింగడు. నాకేమిటో ఆయన పరిస్థితి భయంగా వుంది!'

నా కడుపులో దేవినట్లయింది.

'బాబ్బాబూ! నీకు పుణ్యముంటుంది! ఆ చేత్తో మా ఆయనక్కూడా ఓ కార్డుముక్క గిలికిపడేయి. ఈ పిల్లలతో చస్తు

తిరిగిరాని వసంతం

న్నాను ఒక్కదాన్నీ! కొంచెంసేపు నాన్న దగ్గర కూర్చుందామన్నా పిలువపడనీయటం లేదు పాడు పిల్లలు!'

'అలాగే రాస్తాలే!' అన్నాను.

సుబ్బమ్మగారు 'వడ్డించమంటారా?' అంటూ వచ్చింది.

'అందరి భోజనాలూ అయినయి. నువ్వొక్కడివే వున్నావు తినేసిరా పట్టాభీ!' అంటోన్న సీత వదినకేసి చూస్తూ— 'సత్య తిన్నదా?' అడిగాను.

'సరిపోయింది! ఆవిడ కెప్పుడాకలేస్తే అప్పుడే వచ్చి తింటుంది! పిలిస్తే ఓపట్టాన రానూ రాదు! పొద్దున్నెప్పుడో నాలుగు మెతుకులు కతికింది. ఇప్పుడు ఘంట పదవుతోందా? వచ్చి తినాలని తెలియొద్దూ? చిన్నపిల్లల్లాగ ఏకరువు సాగతీస్తారు? బొత్తిగా కొరకరాని కొయ్య అయింది!' అన్నది విదిలింపుగా.

సత్యపై అపరిమితమైన జాలి వేసింది.

'నాకూ — సత్యకూ వడ్డించండి!' అంటూ సుబ్బమ్మగారితో చెప్పి మేడ మెట్లవైపు దారితీశాను.

డాబామీద వెల్లకిలా పడుకుని వుంది సత్యవతి.

'నిద్రపోతున్నావా?' అన్నా దగ్గరగా వెళ్లి.

'లేదు బావా! కూర్చో.' అంటూ తనూ లేచి కూర్చుంది.

నక్షత్రాల కాంతిలో సత్య ముఖం స్పష్టాస్పష్టంగా అవుపిస్తోంది.

'నేను విన్నది నిజమేనా?' అన్నా నెమ్మదిగా.

'నిజమే!' అని నవ్వింది. అంత చీకటిలో—నిశ్శబ్దంలో సత్య నవ్వు వింతగా ధ్వనించింది.

'ఎందుకలా చేశావు?'

'ముందిది చెప్పు! నేనంటే నీకెందుకింత శ్రద్ధ?'

'ఇదేం ప్రశ్న?'

'నీకు అర్థంలేనిదై వుండొచ్చు!'

రెండు క్షణాలు ఆలోచించాను.

'నీకు తెలియదూ?'

'పర్వాలేదు. గడుసుతనం నేర్చావు! తెలిస్తే నిన్నెందుకు అడుగుతాను?'

'అసలు విషయాన్ని దాటేయకు!' అన్నా చిరాగ్గా.

'ఏది అసలు విషయం? అది నా స్వవిషయం!' అన్నది కరుగ్గా.

మౌనంగా చూస్తుండిపోయాను. 'ఈ సత్య నాకు దూరమైపోతోందా?'

సత్య రెండు చేతులమీదా వెనక్కి వాలి ఆకాశంలోకి చూస్తోంది.

నే లేచి పిట్టగోడ దగ్గరగా నడిచాను. చీకట్లో దూరంగా వున్న చెట్లు మరింత చీకటిని పులుముకున్నాయి. క్రిందనుంచి సీతవదిన పాడుతున్న జోలపాట తప్పించి ప్రకృతి అంతా నిశ్శబ్దంగా వున్నది. నా మనసులో అవమానం — ఆవేదన మంటలా జ్వలిస్తున్నాయి. వెనక్కి తిరిగి నిష్ఠూరంగా అన్నాను—

'నేను నీకు పరాయి వాడినయ్యానా సత్యా?'

'ఎంత చెప్పినా అర్థం చేసుకోనివాళ్లు—ఇంకేమవుతారు?'

ఎంత కఠినంగా మాట్లాడుతోంది! అయినా సత్యపై నాకు కోపం రావటం లేదు బాధ కలుగుతోంది.

'నువ్వెన్ని అన్నాసరే! మన ఇద్దరిమధ్యా వున్న అనుబంధం మాసిపోదు!'

'అనుబంధం! ఏమిటా అనుబంధం?' వెటకారంగా రెట్టించింది.

'ఇలా వెక్కిరించేవాళ్లకు ఏం చెప్తే అర్థమౌతుంది?'

'నువ్వు చెప్పేది నాకు తెలుసు! 'నువ్వు నీ మొగుడిదగ్గరకెళ్లు!' అనేగా?'

'ఆ అవకాశాన్ని చేజేతులా నీవే బుగ్గిపాలు చేశావు కదా?' నిట్టూర్చాను.

'అవును చేసుకున్నాను. నా జీవితాన్ని నాశనం చేసుకున్నాను. నా బ్రతుకుని బండలు చేసుకున్నాను. ఇప్పుడు ఏడుస్తున్నాను. ఏం? ఇప్పుడు నీకు తృప్తిగా వుందా? బాగా సంతోషం వేస్తోందా? సంతోషించండి.... బాగా సంతోషించండి!' పెద్దగా అంటూ హిస్టీరియా రోగిలా వెక్కివెక్కి ఏడ్వటం మొదలుపెట్టింది.

నేను కొయ్యబారిపోయాను. నాలోని సర్వశక్తులూ వుడిగిపోయినట్లయింది. జీవితంలో మొదటిసారిగా ఏడుస్తున్న సత్యను చూస్తుంటే మనసు ఆర్ద్రమయింది. ఏదో తప్పుచేసినవాడిలా సిగ్గువేసింది. ఏడుపు

ఉద్వేగం కొంచెం తగ్గినతర్వాత— ఆమెకు దగ్గరగా వెళ్ళి కూర్చుంటూ—

'ఏమిటీ పిచ్చి? ఇప్పుడేమయిందని? పోనీ— నేనా ప్రస్తావనే ఎత్తను ఇంక. ఊరుకో సత్యా! నువ్విలా ఏడుస్తుంటే నాకు సంతోషమా? ఎంత దారుణంగా అంటున్నావు!' అన్నా —' ఓదార్పుగా భుజం మీద చేయివేసి.

'ఏమనిష్టైనా కావాలని తన సుఖాల్ని కాల్చదోసుకోడు· నామంచీ— చెడూ నాకు తెలియదా? ఎందుకిలా నన్ను వేలెత్తి చూపిస్తూ కుళ్ళబొడుస్తారు? చూస్తున్నావుగా. ప్రతివాళ్ళూ నాన్నను పరామర్శించే వంకతో రావటం — నన్నుచూసి హేళనగా — వెక్కిరింతగా మాటిపోటీగా అంటూ ఓ వింతమృగాన్ని చూసినట్లు చూడటం! ఏం చేశాను? నేను చేసిన తప్పేమిటి? పతివ్రత అనే ముసుగు కప్పుకుని— అసహ్యాన్ని మింగి— ఇష్టంలేని మొగుడితో కాపురం చేయటం లేదనేగా వీళ్ళ దుగ్ధ? నేను కాపురంచేస్తే వీళ్ళకెందుకు — చెయ్యకపోతే వీళ్ళకెందుకు? అసహ్యాన్ని — అయిష్టతను మింగటం నాకు చేతకాదు... అతి తల్లి అయినానసరే! సోదరుడైనాసరే— మొగుడైనాసరే! ఎవరిపైనైనా అయిష్టతను ప్రకటించే అధికారం నాకు లేదా? ఇష్టంలేని కూరనే ఎవరూ తినరే! అలాంటిది నేనేదో పాపి చెప్పే చేతల్లో పురిటోలిస్తున్నట్లు ఎందుకో తిరస్కారం?'

మధ్యమధ్య ఆగుతూ— కళ్ళు తుడుచుకుంటూ— రుద్ధకంఠంతో అంటున్న సత్యవతి మాటలోని— నిజాయితీకి చలించిపోయాను. ఆమె మనసు చాలా గాయపడి వుంటుంది. అప్రయత్నంగా ఆమె తలపై చేయివేసి నిమిరాను— అనునయంగా.

తటుక్కున నాచేయి — తన చేతిలోకి తీసుకుంటూ—

'బావా! ఇది చెప్పు! ఈ చేయి ఇలాగే స్థిరంగా అందిస్తూ— జీవితాంతం నాకు తోడుగా వుంటావని! ఇంక నేని ప్రపంచంతో దేనికీ భయపడను!' ఆవేశంగా అన్నది.

'సత్యా! నీకేం మతిపోయిందా?' విస్మయపాటుతో పొలికేకింది గొంతు.

'కాదు బావా! మతి వుండే అంటున్నాను. చిన్నప్పటినుంచీ — నేను అభిమానించిన— మనసుపడిన వాడిచేయి ఇది! వయసు వచ్చిన తర్వాత నీతోడే కావాలనుకున్నాను. నిన్నే పొందాలనుకున్నాను. నిన్ను వూహించుకునే కలలు కన్నాను...'

మధ్యలోనే కంగారుగా అన్నాను.

'ఆపు సత్యా! ఏమిటీ ధోరణి?'

నవ్వింది.

'నాకేం పిచ్చి యెక్కలేదులే బావా! ఈరోజా— ఈ చీకట్లో— ఈ వంటరితనంలో— ఈ విషాదంలో నన్ను మనసు విప్పి చెప్పనీయి. ఎన్నోసార్లు నీ అంతట నీవే తెలుసుకుంటావని ఎదురు చూశాను. కానీ— నీ హృదయంలో నాకు వున్న స్థానం వేరని ఆలస్యంగా తెలుసుకున్నాను. ఆ నిస్పృహలో ఎవరైతేనేం? అనుకుని— ఇంకరాన్ని పెళ్ళాడాను. అతను — నన్ను అనురాగంతో చూసుకునివుంటే — నా కథ వేరుగా వుండి వుండేది' నిట్టూర్చింది.

'ఇవన్నీ నాకెప్పుడూ చెప్పలేదేం?'

'అనేకసార్లు నా మనసు నీకు తెలియబరిచాను. నువ్వు గ్రహించలేదు. పోనీలే బావా! ఇప్పుడు చెప్తున్నాగా. నన్ను నువ్వు ప్రేమించక్కర్లేదు. నేనంటే నీకు 'ఇష్టం' వున్నది కదూ? ఆ 'ఇష్టం' చాలదూ — సుఖంగా జీవించటానికి?'

గుండెజారను చిల్చుకుని లోపలి మెత్తమైన పొరలను సూటిగా తాకిన ఆ ప్రశ్నములుకులా నన్ను బాధించసాగింది. సత్యను వివాహం చేసుకోవాలనే ఆరాటం నాకు లేదు. పెళ్ళి అనగానే— మధురమైన ఊహలతో— వొళ్ళు తేలిపోవటం లేదు. సత్యంటె నా కిష్టమే. కానీ 'పెళ్ళి' అనగానే— నీరు కారిపోతోందా ఇష్టం!

'సత్యా! ఓ పక్కన మామయ్యికలా వుంటే — ఇప్పుడా ఈ విషయాలు మాట్లాడుకునేది? తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం! పద. భోజనంచేసి వద్దాం!' అన్నాను— ప్రసంగాన్ని మారుస్తూ— చెయ్యి విడిపించుకుని.


'నా కాకలిలేదు— నువ్వెళ్ళి తినేసేయి!' అన్నది నిట్టూరుస్తూ.

'ఎవరిమీదో అలిగి— అన్నం మానేస్తావా?'

'ఆకలేస్తే నేనే వచ్చి తింటాను. అలగటం లేదు!'

'అయితే నీమీదొట్టు! నువ్వు తినకపోతే నేనూ తినను!'

'పిచ్చిబావా! ఒట్టువేసినంత మాత్రాన ఇష్టంలేని పనులు చేయగలమా? పోనీ నేనూ ఓపని చేస్తాను. నువ్వు నన్ను



తిరిగిరాని వసంతం

పెళ్లాడకపోతే- నేను చచ్చినంత ఒట్టు! ఊఁ? మరి నన్ను పెళ్లి చేసుకుంటావా?' నవ్వింది.

'అబ్బ! నిన్ను వాదనలో వీవరూ గెలువలేరు. ఆ విషయాన్ని నేనాలోచించి చెప్తానన్నాగ! సాయంత్రం లా నీకు మేలే చేస్తాను ఇంక లేచి రా!' లేచి నిలబడి—సత్య చేయందుకుని—పైకి లేపబోయాను. తన రెండు చేతులూ కలిపి నాచేయి పట్టుకుని — తనవైపు గుంజింది. అనుకోని ఈ హఠాత్పరిణామానికి ముందుకు తూలి—సత్య ప్రక్కన కూలబడిపోయాను. చటుక్కున నావైపు తిరిగి నన్నల్లుకుపోయిందామె! నా చెంపలమీద ఆమె వెచ్చని వూర్పులు.

'బావా! బావా!! నా బాధ నీకెలా చెప్తే అర్థమౌతుంది? నా వేదన నీ కేవిధంగా బోధపరచను? నా హృదయం ఇంతకంటే ఇంకా ఎలా విశదపరచను? నాలోని ప్రతి రక్తబిందువూ—అణువణువూ నిన్నే జపిస్తున్నాయంటే నమ్ముతావా? ఏం చెప్పి నిన్ను నావాడిని చేసుకోను? ఎలా నమ్మించి నిన్ను దక్కించుకోను? అయ్యో బావా! నన్ను నమ్మలేవా?' మెల్లిగా — వేదనగా అంటూ తన మెత్తని పెదిమల్ని—నాచెంప కాన్చింది. జరిగేది కలో—యదార్థమో—అర్థం కానంతగా నిర్ఘాంతపడి కూర్చుండిపోయాను.

'చిన్నప్పుడు నీ దెంత మెత్తని మనసు! ఇప్పుడిలా కఠినుడివై పోయావేం?'

నాలో ఏదో కలవరం! రెండుచేతులతో సత్యను చుట్టేసి—గాఢంగా హృదయానికి హత్తుకోవాలనే బలమైన కోరిక కలిగింది. కాని ఆపని చేయలేకపోయాను. ఒకరికోసం మరొకరం పుట్టామన్నంత గాఢమైన నమ్మకాని కల్గిస్తోన్న ఆక్షణం చాలా విలువైందనిపిస్తోంది.

'పట్టాభీ!' క్రిందనుంచి సీతవదిన పిలుపు.

ఉలిక్కిపడి లేచాను

ఆ చీకట్లో — నేనూ సత్య కొంత సన్నిహితంగా మెలిగామన్న నిజం నన్ను సిగ్గుతో చితికిపోయేలా చేస్తోంది.

'వెళ్లు బావా! భోజనం చేసేయి. పొద్దుపోయింది!' అన్నది సత్య నిర్వికారంగా.

'నువ్వు రావన్నమాట!'

'చెప్పానుగా! నా కాకలి లేదని!'

'అదే ఎందుకు లేదు?'

'కొన్ని ప్రశ్నలకు — సమాధానాలుండవు!'

'ప్లీజ్ సత్యా! ఈ వితండవాదన మానేసేయి. నాపై నీకేమాత్రం గౌరవం వున్నా......'

'పిరికివాళ్లను చూస్తే గౌరవంకాదు—జాలివేస్తుంది.'

చురుక్కున నాటిందీ సమాధానం; కోపంతో మండిపోయాను.

'ఛీ! నీలాంటి మొండిదానితో నాకేమిటి!' చివాలున వెనక్కి తిరిగి క్రిందకు వచ్చేశాను.

'సత్య వస్తోందా?' అడిగింది సీతవదిన.

'రాదుట!' అన్నా పొడిగా.

'నాకు ముందే తెలుసు!' అంటూ నవ్వింది.

ఆ నవ్వులో ఏవో అర్థాలు వినిపించి మొహం ముడుచుకుని వంటింట్లోకి నడిచాను.

భోజనం అయిన తర్వాత-మావయ్యకు కొంచెంసేపు కాళ్లువొత్తుతూ ఆకబురూ—ఈకబురూ చెప్తూ కూర్చున్నాను. ఆయన కోసం తెచ్చిన ఆపిల్‌పండ్లు ముక్కలుగా కోసి — తినిపించాను. ఆయన నిద్రపోయాక — నాకోసం వేసిన పక్కమీదకు చేరి పడుకొన్నానన్నమాటేగాని—నిద్ర పట్టటంలేదు. ఆకాశంలో దట్టంగా అల్లుకున్న చుక్కలకేసి చూస్తూ చాలా సేపు గడిపాను. ఆలోచనల్లో ఎప్పటికో నిద్రపట్టింది.

'పట్టాభీ! పట్టాభీ!!' అంటూ ఎవరో నన్ను పట్టి కుదుపుతోంటే గభాలన కళ్లువిప్పి లేచి కూర్చున్నాను. కొద్ది—కొద్దిగా వెలుగునస్తోంది.

సీతవదిన కంగారుగా—'నాన్న పలకటం లేదు—నాకేదో భయంగా వుంది—డాక్టర్‌ను పిలుచుకురా!' అంటోంది—వొణికిపోతూ.

నాకు మతిపోయినట్లయింది. గబగబా లేచి షర్టువేసుకుని వీధిలోకి పరిగెత్తాను

డాక్టర్ చెయ్యిపట్టిచూసి వదిలేస్తూ—'పోయి చాలాసేపయింది' అన్నాడు—మెడికల్ చెస్ట్ తీసుకుని లేచాడు.

(ముగింపు వైవారం)


అందమైన అతివకు
అపూర్వమైన క్రొత్త రకపు సబ్బు
LUX
LUX SUPREME
లక్స్ సుప్రీమ్
బ్యూటీ క్రీమ్ కూడ కలిగినది
లక్స్ సుప్రీమ్ మీ ముఖ చర్మము పట్టువలె మృదువుగా, అందముగా ఉండుటకు అపూర్వమైన క్రొత్త సబ్బు. దానిలో మాత్రమే బ్యూటీ క్రీమ్ కూడ ఉంది.
పుష్కలముగా వచ్చే దాని నురుగులో బ్యూటీ క్రీమ్ ఉన్న అనుభవము మీకు నిజంగా కలుగుతుంది.
లక్స్ సుప్రీమ్‌యొక్క నురుగు మీ ముఖమునకు మెరుగులు పెడుతూంటే, దాని క్రొత్త సువాసనతో మీరు పరవశించిపోతారు.
లక్స్ సుప్రీమ్‌తో మీ అందమునకు రాణింపు చేకూర్చుకోండి.
బ్యూటీ క్రీమ్‌గల ఏకైక సబ్బు యిదే.
బెంగుళూరు, హైదరాబాదు, సికిందరాబాదులలో లభిస్తోంది.
హిందూస్తాన్ లీవర్ లిమిటెడ్ వారి ఒక నాణ్యమైన తయారు.



జరిగిన కథ

రామ్మూర్తికి ఇద్దరు కొడుకులూ ఒకకూతురూ భార్య కాంతమ్మ రోగిష్టిది. కొడుకులిద్దరిపైనా ఎన్నో ఆశలు పెట్టుకుని— వాళ్ళకి ఏ లోపం జరక్కుండా పెంచి పెద్ద చేశాడు. కాని, కొడుకుల ప్రవర్తన అతను ఆశించినట్టు లేదు. పెద్దకొడుకు ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. దాని ఫలితంగా రామ్మూర్తి ఉద్యోగమే పోయింది. రెండవ కొడుకు చిట్‌ఫండ్ కంపెనీకి సంబంధించిన డబ్బు పట్టుకు పోయాడు. దానివల్ల రామ్మూర్తి జైలుకు పోవలసి వచ్చింది. రామ్మూర్తి దయాదాక్షిణ్యాలతో పెరిగిన రజనీకుమార్ ఆ కుటుంబాన్ని ఆదుకున్నాడు. రామ్మూర్తి యింటిని పాపయ్యపేర కొనేశాడు ప్రసాద్. రామ్మూర్తిని ఆ యిల్లు ఖాళీ చేసెయ్యమన్నారు. రజనీకుమార్‌ని వెతుక్కుంటూ రామ్మూర్తి, లక్ష్మి మద్రాసు వచ్చారు. రజనీకుమార్ కనిపించాడు. వాళ్ళని సురక్షితమైన ప్రవేశానికి చేర్చాడు. లక్ష్మి, సరళా ఇద్దరూ మంచి స్నేహితులైపోయారు.

27

ఒక సాయంత్రం రజనీకుమారు, సరళా, లక్ష్మి ముగ్గురూ కలిసి సినిమాకు వెళ్ళారు కాని టిక్కెట్లు దొరకలేదు. చినుకులు పడుతుండడంవలన బీచికి వెళ్ళడానికి వీలులేకపోయింది. అందుచేత ముగ్గురూ తిన్నగా యింటికే వచ్చేశారు.

'నాకు విసుగ్గా ఉంది. ఏం తోచడం లేదు' అంది సరళ మేడమీదకు రాగానే.

'అన్నయ్యా! నువ్వు అసలు నాతో చెప్పకుండానే అమ్మాయిగారిని పెళ్ళాడతానని మాట యిచ్చేశావన్న మాట' అన్నది లక్ష్మి వెంటనే.

తన పెళ్ళిమాట యెత్తగానే సరళకు విసుగంతా పోయింది. వాళ్ళ మాటలు ఆమె శ్రద్ధగా వింటున్నది.

'లేదు, లక్ష్మీ! అసలు యేం జరిగిందంటే, ఒకనాడు పొద్దున్నే వాళ్ళ నాన్నగారు నాతో 'రజనీకుమార్! మా అమ్మాయి సరళ ఉంది చూశావా? చదువుల్లో సరస్వతి, సుగుణాల కుప్ప అందంలో అప్సరస. అందుచేత మా అమ్మాయిని నువ్వు పెళ్ళాడు' అన్నారు.

అప్పుడు నేనేం అన్నానో తెలుసా? మీ అమ్మాయి అప్సరస అయినా సరే. అప్సరసకు అమ్మమ్మ అయినా సరే నేను యిప్పుడు పెళ్ళాడను. మా లక్ష్మి వచ్చి మీ అప్సరసను చూడాలి. మా లక్ష్మికి మీ అప్సరస నచ్చాలి. అప్పుడు మా లక్ష్మి 'అన్నయ్యా! యీ అప్సరసను పెళ్ళాడు' అనాలి. తరువాత నేను మీ అప్సరసను పెళ్ళాడాలి. అంతే అన్నాను' అన్నాడు రజనీకుమార్.

అతను ఆ మాటలు చెప్పిన ధోరణి చూడగానే లక్ష్మికీ, సరళకూ కూడా నవ్వు వచ్చింది.

'అయితే యిప్పుడు నేను అమ్మాయిగారిని పెళ్ళిచూపులు చూడాలన్న మాట' అన్నది లక్ష్మి.

'ఊఁ' అన్నాను రజనీకుమార్.

'అమ్మాయిగారూ! కాదు కాదు, యేమ్ పెళ్ళికూతురా! యిలాగ రా! అన్నది లక్ష్మి.

సరళ వెళ్ళలేదు. తనకు ఆ మాటలు యిష్టం లేనట్టుగా మూతి ముడుచుకుని కూర్చుంది.

'వెంటనే రావాలి' అంటూ లక్ష్మి సరళను తొందరచేసింది.

సరళ యిష్టం లేనట్టుగానే లక్ష్మి దగ్గరకు వచ్చింది.

'నడక ఫరవాలేదు' అంది లక్ష్మి.

'పెళ్ళికూతురును నిలబెట్టేశావేం లక్ష్మీ?' అన్నాడు రజనీకుమార్.

'చూశావా? పెళ్ళికూతురు అలిసిపోతుందేమోనని పెళ్ళికొడుకు అప్పుడే భయపడుతున్నాడు. ఇలాగ కూర్చో' అంది లక్ష్మి.

అక్కడఉన్న సోఫామీద కూర్చుంది సరళ.

'ఇలాగ చూడు' అని లక్ష్మి సరళ గడ్డం పట్టుకొని ఆమె ముఖంలోనికి చూసింది.

సరళకూడా లక్ష్మి ముఖంలోనికి చూసింది.

'మెల్ల లేదు' అన్నది లక్ష్మి.

'అమ్మాయ్! నీకు చదువు యెంతవరకూ వచ్చు?' అని అడిగింది లక్ష్మి కాలుమీద కాలువేసుకుని కూర్చుంటూ.

సరళ సిగ్గుపడుతున్నట్టుగా నటిస్తూ మెల్లగా 'బి.ఏ.' అన్నది.

'ఓస్. నీకు యిదికూడా తెలియదన్నమాట. పెళ్ళిచూపుల్లో చదువు గురించి అడిగితే, 'చాకలి పద్దులు వేయడంవచ్చు' అని చెప్పాలిగాని బి. ఏ. లు యం.ఏలు

చెప్పకూడదు: తెలిసిందా?' అని అడిగింది లక్ష్మి.

'తెలిసింది' అన్నట్లుగా సరళ తల తిప్పింది.

'అయితే అమ్మాయ్! నీకు చాకలి పద్దులు వేయడం వచ్చా' అని అడిగింది లక్ష్మి.

'వచ్చు; వచ్చు' అని సరళ అంటూ వెంటనే మళ్ళా 'రాదు, రాదు' అంది.

'సరే, అమ్మాయ్! ఒక పాట పాడు' అన్నది లక్ష్మి దర్జాగా వెనక్కు చేరబడి కూర్చుని.

'వద్దు లక్ష్మీ! సరళను పాడమనకు. సరళ పాడడం ప్రారంభించిందంటే, మనం వాళ్ల అమ్మాయిని కొడుతున్నామేమోనని వాళ్ల అమ్మగారూ, నాన్నగారూ పరుగెత్తుకుంటూ వస్తారు' అన్నాడు రజనీకుమార్.

అతని మాటలకు, సరళా, లక్ష్మీ మరొకసారి నవ్వారు.

'పాటల్లేకపోతే పెళ్లి చూపులు బాగుండవు' అన్నది లక్ష్మి ఆ విషయంలో తనకు యెంతో అనుభవం ఉన్నట్టు.

వస్తున్న నవ్వును సరళ బలవంతంమీద ఆపుకుంది.

'పోనీ, డాన్సు చెయ్యగలవా?' అని అడిగింది లక్ష్మి.

'చెయ్యలేను' అన్నట్లుగా సరళ తల అడ్డంగా తిప్పింది.

'పాటా, డాన్సూ యేమీ లేకపోతే యిక పెళ్లి చూపులు యేమిటి?' అని సరళను దబాయిస్తూ అడిగింది లక్ష్మి.

'ఏమిటే, పిల్లలూ! పెళ్లి చూపులు అంటున్నారు?' అని అంటూ అన్నపూర్ణమ్మ అంతలో అక్కడకు వచ్చింది.

అన్నపూర్ణమ్మ మాట వినబడగానే, అందరూ నిశ్శబ్దం అయిపోయారు. రజనీ కుమార్ వెంటనే అక్కడ ఉన్న పుస్తకం తీసి, తదేక దీక్షగా చదవడం ప్రారంభించాడు.

'ముగ్గురూ, ఒక్కసారే మూగనోము పట్టారేం? మీరు యేంత యుక్తిమంతులో నాకు తెలియదు అనుకున్నారా?' అన్నది అన్నపూర్ణమ్మ నవ్వుతూ.

కాని ఒక్కరూ పెదవి కదల్చలేదు.

'అదిసరే కాని సరళా! యేదో టెలిగ్రాం వచ్చింది. దిగువకు వెళ్ళి తీసుకో' అంది అన్నపూర్ణమ్మ.

'ఇంతవరకూ లక్ష్మి తన ఆట పట్టించింది. ఇప్పుడు తిరిగి తనేం చెయ్యాలా?' అని ఆలోచిస్తూ, సరళ దిగువకువెళ్ళి, టెలిగ్రాం తీసుకొంది!

'వ్యాపారానికి సంబంధించిన టెలిగ్రాములన్నీ ఆఫీసుకే వస్తాయి. కాబట్టి యింటికి వచ్చిన యీ టెలిగ్రాం చింపి చదివింది.

'సరళను చూడ్డానికి పెళ్లివారు మర్నాడు పొద్దున్నే వస్తున్నారు' అని కాశీ విశ్వనాధానికి కృష్ణమూర్తి యిచ్చిన టెలిగ్రాం అది.

ఆ టెలిగ్రాం చూడగానే సరళకు మెరుపులాగ ఒక ఆలోచన వచ్చింది.



అంతలో కాశీ విశ్వనాథం 'ఏమిటమ్మా! అలాగ నిలబడ్డావు?' అని అంటూ లోపలకు వచ్చాడు.

సరళ యేమీ మాట్లాడకుండా ఆ ఉత్తరం తండ్రికి యిచ్చింది.

కాశీ విశ్వనాథం ఆ ఉత్తరం చదివి 'యీ ఉత్తరం నాకు యివ్వడం యెందుకు? రేపు ఉదయం ఆ పెళ్లివారికి యేం సమాధానం చెపుతావో, నువ్వే చెప్పు' అన్నాడు నవ్వుతూ.

'నాన్నగారూ' అంటూ సరళ తండ్రి చెవిలో మెల్లగా యేదో చెప్పింది.

సరళ చెప్పినమాట వినగానే, కాశీ విశ్వనాథం ముఖం వికసించింది.

'నువ్వు యెలాగా తెలివైనదానవమ్మా!' అంటూ కాశీ విశ్వనాథం సంతోషంగా సరళ చెవి పట్టుకోయాడు.

'ఉండండి, నాన్నగారూ! యిప్పుడే వస్తా' అంటూ సరళ మేడమీదకు పరుగెత్తింది.

సరళ వస్తూనే లక్ష్మి చెవి పట్టుకుని 'ఏమండి అమ్మాయిగారూ? యింతదాక యేమిటి సెలవిచ్చారు? పెళ్లి చూపుల్లో చాకలిపద్దు వెయ్యడం వచ్చునని చెప్పాలా? పాటల్లేకపోతే పెళ్లి చూపులు బాగుండవా? డాన్సు చెయ్యాలా? హరికథలూ, బుర్రకథలూ అక్కరలేదా?' అంటూ గబగబా అడిగింది.

సరళ గబుక్కున తిరిగి వచ్చి, యీ విధంగా ప్రశ్నలు వెయ్యడానికి కారణం యేమిటో లక్ష్మికీ, రజనీకుమారుకూ కూడా బోధపడలేదు.

'ఏమిటి వదినా? ఏమిటి వదినా?' అని అడిగింది లక్ష్మి తెల్లబోయి.

వెంటనే సరళ లక్ష్మి చెవి వదిలిపెట్టి 'నువ్వు నన్ను పెళ్లిచూపులు చూస్తావా? ఉండు, నీ పని రేపు చెప్తా' అంటూ వేలు చూపిస్తూ బెదిరించింది.

'ఏమిటే, వదినా! రేపు? ఏమిటే, వదినా! రేపు?' అని లక్ష్మి మళ్ళా అడిగింది.

'ఇంతలో నేను చెప్పడం యెందుకు? రేపు నీకే తెలుస్తుంది' అని సరళ లక్ష్మిని యింకా ఊరించింది.

'చెప్పు, వదినా! నిన్ను బతిమాలుకుంటాను, వదినా' అంటూ లక్ష్మి సరళ గడ్డం పట్టుకుంది.

అనగనగా...

'అలాగ రా! దారిలోకి. నిన్ను చూడ్డానికి రేపు పెళ్ళివారు వస్తున్నారు' అంది సరళ.

లక్ష్మి సిగ్గుపడుతూ 'ఫో, వదినా!' అంది.

'నిజంగానా, సరళా?' అని ప్రశ్నించాడు రజనీకుమార్ ఆశ్చర్యపోతూ.

కాశీ విశ్వనాథం అంతలో 'రజనీ!' అని పిలుస్తూ మేడమీదకు వచ్చాడు.

'ఇలాగ రా!' అంటూ కాశీ విశ్వనాథం రజనీకుమారును తీసుకొని రామ్మూర్తి వద్దకు వెళ్ళాడు.

కాశీ విశ్వనాథాన్ని చూడగానే రామ్మూర్తి 'బావగారూ!' అంటూ కుర్చీలో నుంచి లేవబోయాడు.

'బావగారూ! మీరు లేవడం యెందుకండీ?' అంటూ కాశీ విశ్వనాథం రామ్మూర్తి భుజాలు పట్టుకొని మళ్ళా కుర్చీలో కూర్చోబెట్టాడు.

'మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడ్డానికి వచ్చాను' అన్నాడు కాశీ విశ్వనాథం సోఫాలో కూర్చుంటూ.

'ఏమిటో చెప్పండి!' అన్నాడు రామ్మూర్తి అంతముఖ్యమైన విషయం యేమిటా?' అని ఆలోచిస్తూ.

'సరళకు మేం సంబంధాలు చూస్తున్నప్పుడు, నా స్నేహితుడు కృష్ణమూర్తి కొన్ని సంబంధాలను గురించి ఉత్తరాలు రాశాడు. ఒక సంబంధంవారు వచ్చి సరళను చూస్తామన్నారని కూడా అతను ఒక ఉత్తరంలో రాశాడు. నేనూ 'సరే' అని జవాబు రాశాను. తరువాత వారిదగ్గరనుండి యే కబురూ రాలేదు. ఈలోపున జరిగినదేమిటో మీకు తెలుసు. ఆకస్మికంగా యిప్పుడు కృష్ణమూర్తి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. 'ఆ పెళ్ళివారు రేపు ఉదయం సరళను చూడ్డానికి వస్తున్నారు' అని. ఆ ఉత్తరంలో ఉంది. 'రావద్దు' అని మనం తిరిగి ఉత్తరం యివ్వడానిక్కూడా వ్యవధి లేదు. 'ఏం చేద్దామా?' అని నేను అనుకొంటుండగా సరళ నాకో సలహా యిచ్చింది. ఆ వచ్చే పెళ్ళివారికి 'లక్ష్మిని చూపించం'డని ఆమె నాతో చెప్పింది. అలాగ చేస్తే బాగుంటుందని నేనుకూడా అనుకున్నాను. తరువాత మీ అభిప్రాయం తెలుసుకుందామని వచ్చాను' అన్నాడు కాశీవిశ్వనాథం.

రామ్మూర్తి దానికి సమాధానంగా వెంటనే 'బావగారూ! మీరు యేం చేసినా, లక్ష్మి శ్రేయస్సునుకోరే చేస్తారు కాని మరో విధంగా చెయ్యరు. అందుచేత మీరూ, రజనీ ఆలోచించి, యేవిధంగాచేస్తే బాగుంటుందని అనుకుంటే ఆవిధంగా చెయ్యండి. ప్రత్యేకంగా నాతో యేమీ చెప్పనవసరం లేదు' అంటూ ఆ బాధ్యతను పూర్తిగా కాశీవిశ్వనాథానికి, రజనీకుమారుకూ వదలివేశాడు.

'అయితే నీ అభిప్రాయం యేమిటి?' అన్నట్లుగా కాశీవిశ్వనాథం రజనీకుమారు ముఖంలోనికి చూశాడు.

రజనీకుమార్ వెంటనే 'మీ యిష్టమండి' అన్నాడు.

కాశీవిశ్వనాథం చేసిన యేర్పాటు అన్నపూర్ణమ్మకూడా నచ్చింది.

మర్నాడు ఉదయం లక్ష్మిని అలంకరిస్తూ, సరళ 'లక్ష్మీ! నువ్వు యిప్పుడు యెలాగ ఉన్నావో తెలుసా?' అడిగింది.

'ఏలాగ ఉన్నాను?'

'అచ్చంగా నువ్వు రాజకుమార్తెలాగ ఉన్నావు. నేనే మగవాణ్ణి అయ్యుంటే, ఏం చేసేవాణ్ణో తెలుసా? సప్తసముద్రాల అవతల ఉన్న మంత్రాల దీవిలోని పంచరంగుల చిలక కావాలని నువ్వు అన్నా, నేను సాధించి తెచ్చి నిన్ను పెళ్ళాడేసేవాణ్ణి.'

'ఫో, వదినా!' అంది లక్ష్మి సిగ్గుపడుతూ.

'అప్పుడే నువ్వు సిగ్గుపడితే యెలాగ? ఇప్పుడు పెళ్ళివారు నిన్ను చూడ్డానికి వస్తారు. వాళ్ళతో నువ్వు 'నాకు చాకలిపద్దు వేయడం వచ్చు'అని చెప్పాలి. పాటలు పాడాలి. డ్యాన్సు వెయ్యాలి ఇన్ని పనులు ఉన్నాయి కదా!' అంది సరళ, అంతకుముందు సాయంత్రం లక్ష్మి తనతో అన్న మాటలు తిరిగి అప్పచెబుతూ.

లక్ష్మి యింకా సిగ్గుపడి, మాట్లాడలేదు.

'లక్ష్మీ! నువ్వేమీ మొగమాటపడకు పాటలు గట్టిగా పాడు. నేను వీధి గుమ్మం దగ్గర మనిషిని కాపలా పెడతానులే'.

అన్నది సరళ.

'వీధి గుమ్మం దగ్గర కావలా యెందుకు, వదినా?' అని అడిగింది లక్ష్మి అమాయకంగా.

'ఎందుకేమిటి? నీ పాట విని, వాళ్ళు భయపడి పారిపోకుండాను.'

'వదినా! వీధి గుమ్మం దగ్గర యెవర్నీ కాపలా పెట్టకు. నువ్వే కొంచెం సేపు అక్కడ నిలబడు!' అన్నది లక్ష్మి.

'ఏం?' అని అడిగింది సరళ అమాయకంగా.

'నా పాట విని వాళ్ళు భయపడి, పారిపోదామనుకుంటారు కాని వీధి గుమ్మం వద్ద నిన్ను చూసి, జడుసుకొని లోపలే ఉండిపోతారు.'

'ఉండు, నీ పని' అంటూ సరళ గబుక్కున లక్ష్మి చెవు పట్టుకుంది.

వాళ్ళ మాటలకు కొంతసేపు వాళ్ళే నవ్వుకున్నారు.

కాశీ విశ్వనాథం యెక్కడకూ వెళ్ళకుండా యింటి దగ్గరే ఉండిపోయాడు.

రజనీకుమార్ రామ్మూర్తి దగ్గరకు వెళ్ళి 'బాబుగారూ! మీరు కూడా రగువకు రండి! వాళ్ళను చూద్దురుగాని' అన్నాడు.

'బాబూ! వాళ్ళను నేను చూడ్డం యెందుకు? మీరు చూడండి చాలు' అన్నాడు రామ్మూర్తి.

ఏ విషయానికైనా రామ్మూర్తి 'వద్దు' 'కాదు' అంటే, రజనీకుమారుగాని కాశీ విశ్వనాథంగాని ఆ విషయాన్ని అంతటితో వదిలేస్తారు. తాము యింకా దాన్నిగురించే మాట్లాడుతుంటే అతను బాధపడతాడేమోనని వారి భయం.

అందుచేత రజనీకుమార్ యింకేమీ మాట్లాడకుండా అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

పదిగంటలు కాగానే పెళ్ళి సంబంధం వారు కాశీ విశ్వనాథం యింటికి వచ్చారు. పెళ్ళికొడుకు శ్రీనివాసరావూ, అతని తండ్రి నీలకంఠం, నీలకంఠం తోడల్లుడు సత్యనారాయణా, వచ్చారు.

మామూలు కుశల ప్రశ్నలు అయిన తరువాత కాశీ విశ్వనాథం 'నీలకంఠంగారూ! ఒకసారి యిలా రండి!' అంటూ అతన్ని గదిలోనికి తీసుకొని వెళ్ళాడు.

'అమ్మాయిని గురించి మీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పవలసి ఉంది' అన్నాడు కాశీ విశ్వనాథం.

'ఉండండి. ముఖ్యమైన విషయం అయితే, మా తోడల్లుడు కూడా వినడం అవసరం. మేం ఏపని చేసినా అతని సలహా ప్రకారమే చేస్తాం. అతని సలహా లేకుండా ఏపనీ చేయం' అన్నాడు నీలకంఠం.

వెంటనే కాశీ విశ్వనాథం యివతలకు వచ్చి 'సత్యనారాయణగారూ! మీరూ రండి' అని పిలిచాడు.


సత్యనారాయణ కూడా ఆ గదిలోనికి వెళ్ళాడు.

'నీలకంఠంగారూ! ఒక విషయానికి నన్ను మీరు మన్నించాలి!' అంటూ కాశీ విశ్వనాథం చెప్పడం ప్రారంభించాడు.

'సుమారు నాలుగు మాసాల క్రిందట మీ సంబంధాన్ని గురించి కృష్ణమూర్తి నాకు ఉత్తరం రాశాడు. మీరు వచ్చి మా అమ్మాయిని చూస్తామన్నారనికూడా అతను ఆ ఉత్తరంలో రాశాడు. మిమ్మల్ని పంపించమని నేను జవాబుకూడా రాశాను. కాని దానితరువాత అతనివద్దనుంచిగాని మీ దగ్గరనుంచిగాని కాని యే వర్తమానమూ లేదు. ఈ లోపున మా అమ్మాయికి యింకో సంబంధం కుదిరింది.

మీరు మా అమ్మాయిని చూడ్డానికి యీ ఉదయం రాబోతున్నారని అతను యిచ్చిన టెలిగ్రాం మాకు నిన్న సాయంత్రమే అందింది. మీకు తిరిగి టెలిగ్రాం యివ్వడానిక్కూడా మాకు వ్యవధి లేక పోయింది. అందుకు మీరు మరోకవిధంగా భావించవద్దని కోరుతున్నాను.

మరొక విషయం యేమిటంటే, మాకు కాబోయే అల్లుడికి ఒక చెల్లెలు ఉంది. ఆ అమ్మాయికి యిప్పుడు సంబంధాలు చూస్తున్నాం. ఆ సంబంధంకూడా కుదిరితే, రెండు పెళ్ళిళ్ళూ ఒకేసారి చేద్దామనుకొంటున్నాం. కట్నాలూ, కానుకలూ మా అమ్మాయికి యేవిధంగా జరుగుతాయో, ఆ అమ్మాయికిక్కూడా అదే విధంగా జరుగుతాయి. ఆ అమ్మాయి



'జంట నెమళ్ళు'

(స్టిచ్ చిత్రం : శ్రీ కె. పార్థసారథి)

ప్రాచీన వైద్య పద్ధతులు

ఎలుక విషాన్ని హరించేవి

1. ఎలుక చెవి కూర చెట్టు సమూలాన్ని ముద్దగా నూరి— పూటకు సుమారు ఒక తులం మెత్తు ముద్దను ఉదయం, సాయంత్రం, రెండు పూటలా నాలుగైదు దినాలు తినట్టయితే ఎలుక విషం హరించబడుతుంది.

2. ఎర్రావడ చెట్టుయొక్క ఆకుల రసాన్ని పూటకు ఒక ఔన్సు చొప్పున ఉదయం, సాయంత్రం, నాలుగైదు దినాలు పుచ్చుకున్నట్లయితే ఎలుక విషం హరించబడుతుంది.

3. వేదలాసి కూరయొక్క సమూల కషాయాన్ని ఒక ఔన్సుచొప్పున మూడు పూటలా, వారందినాలు పుచ్చుకుంటే ఎలుక విషం హరించబడుతుంది.

4. పుష్పాంజన మనే రాయియొక్క భస్మాన్ని—రెండు గురివింద గింజల యెత్తు చొప్పున— ఉదయం, సాయంత్రం నాలుగైదు రోజుల పాటు పుచ్చుకుంటే ఎలుక విషం హరించబడుతుంది.

5. గొద్దు ఆగాకర ఆకురసాన్ని పూటకు ఒక ఔన్సు చొప్పున— సుమారు వారం దినాలు, ఉదయం, సాయంత్రం పుచ్చుకుంటే ఎలుక విషం హరించబడుతుంది.

తేనెటీగ, కందిరీగ, తుమ్మెద మొదలగు వాని విషహరములు

తేనెటీగ, మొదలగునవి కుట్టినప్పుడు— మన శరీరములో గ్రుచ్చుకొని వున్న విష పూరితమైన సూక్ష్మమైన ముల్లును ఏదైనా సాధనంతో జాగ్రత్తగా తీసెయ్యాలి. ఆ తరువాత..

1. కుప్పింట ఆకుగాని, వేరుగాని, మెత్తగా నూరి తేనెటీగ లేదా కందిరీగ కుట్టినచోట దట్టంగా పట్టించిన బాధ నివృత్తవుతుంది.

2. తగిరస ఆకుల (తంటెప్ప ఆకులు) ముద్దగా నూరి తేనెటీగలుకాని, కందిరీగలుగాని, కుట్టినచోట రుద్దినచో బాధ తగ్గుతుంది.

3. చాను దుంపల రసం, —పైన పూసిన —కందిరీగలు, తేనెటీగలు, మొదలగు వాని విషం హరించబడుతుంది.

4. సోపును పసుపు నీళ్లతో నూరి— రసంతీసి త్రాగిన, తుమ్మెద వాటువికారం పణుగుతుంది.

5. పొంతి గుండను అవు పెరుగులో కలుపుకొని త్రాగితే తుమ్మెదకాటు బాధ తగ్గుతుంది.

సేకరణ : ఆకుండి నారాయణమూర్తి

ప్రస్తుతం యిక్కడే ఉంది కాబట్టి మీరు ఆ అమ్మాయిని చూడమని కోరుతున్నాను. అమ్మాయి మీకు నచ్చితే, మిగిలిన విషయాలు తరువాత మనం మాట్లాడుకో వచ్చును' అంటూ కాశీ విశ్వనాథం తను చెప్పవలసిన విషయాల నన్నింటినీ పూస గుచ్చినట్లుగా చెప్పాను.

'ఇందులో మీరు చేసిన పొరబాటు యేముంది ? మీరు ఉన్న పరిస్థితిలో యెవరైనా, అంతే చేస్తారు' అన్నాడు నీలకంఠం.

'ఇంతదూరం వచ్చాం కదా ! ఆ అమ్మాయినే చూస్తాం' అందులో నష్టం యేముంది ? అన్నాడు సత్యనారాయణ.

తరువాత ముగ్గురూ కలిసి, బయటకు వచ్చి కూర్చున్నారు.

అనగనగా...

'పూర్ణా ! లక్ష్మిని తీసుకొనిరా!' అని కాశీ విశ్వనాథం అనగానే, అన్నపూర్ణమ్మ మేడమీదకు వెళ్లింది.

'అబ్బాయి ప్రస్తుతం యేం చేస్తున్నాడు?' అని అడిగాడు కాశీ విశ్వనాథం,

'యం యే. చదివిన తరువాత యింకా చదువుతానని మా శ్రీనివాసు పట్టు పట్టాడు. వాళ్ళ నాన్నగారుకూడా చదివిద్దామనే అనుకున్నారు కాని నేనే వద్దన్నాను. నాకు బట్టల వ్యాపారం ఉంది. ఆ వ్యాపారం నేనొక్కణ్ణే చూసుకోలేక పోతున్నాను. అందుచేత నాకు సహాయంగా ఉండమన్నాను. ఆ మాటమీద అబ్బాయి కొట్లో ఉంటున్నాడు. అందులో వాటా కూడా యిచ్చాను:

తను కాలేజీనుంచి వచ్చిన తరువాత కొత్తపాలెంలోని వాళ్ల యింటినికూడా పూర్తిగా మార్చి, అన్ని వసతులూ అమర్చుకున్నాడు. వాళ్ల ఊళ్లోనే ఉంటూ, రోజూ కొట్టు దగ్గరకు వస్తున్నాడు. ఈమధ్యనే తనకోసం ప్రత్యేకంగా కారు కూడా కొన్నాం. కారు చేతులో ఉంటే వాళ్ళ ఊరకూ, మా ఊరుకూ దూరం అరగంట' అని శ్రీనివాసరావుకు సంబంధించిన విషయాలన్నింటినీ చెప్పాడు సత్యనారాయణ.

అన్నపూర్ణమ్మ అంతలో లక్ష్మిని తీసుకొనివచ్చి అక్కడ సోఫాలో కూర్చో బెట్టింది. తరువాత రజనీకుమార్ వచ్చి యింకో సోఫాలో కూర్చున్నాడు.

లక్ష్మి సహజంగానే అందంగా ఉంటుంది. దానికితోడు అప్పుడు ఆమెను సరళ ప్రత్యేకంగా ముస్తాబు చేసింది. అందుచేత లక్ష్మి యింకా అందంగా కనిపించింది.

లక్ష్మిని చూడగానే శ్రీనివాసరావు ముఖం వికసించింది. 'లక్ష్మి అతనికి నచ్చింది' అనే విషయం అతని ముఖం చూస్తేనే యెవరికైనా తెలిసిపోతుంది. ఆ విషయాన్ని ప్రత్యేకంగా అన్నపూర్ణమ్మ గమనించింది.

నీలకంఠానికూడా లక్ష్మి నచ్చింది.

'ఈ అమ్మాయి తండ్రిగారి పేరు ఏమిటండీ?' అని కాశీవిశ్వనాథాన్ని వెంటనే అడిగాడు సత్యనారాయణ.

'రామ్మూర్తిగారు.'

'రామ్మూర్తిగారా? యిప్పుడు వారు యిక్కడ ఉన్నారా?' అని మరింత ఆతృతగా అడిగాడు సత్యనారాయణ.


'ఇక్కడే ఉన్నారు' అన్నాడు కాశీవిశ్వనాథం 'సత్యనారాయణ ఆతృతకు కారణం యేమిటా?' అని ఆలోచిస్తూ.

'వారిని ఒకసారి యిక్కడకు పిలిపిస్తారా?' అని అడిగాడు సత్యనారాయణ.

'తప్పకుండా' అంటూ కాశీవిశ్వనాథం రజనీకుమారువైపు చూశాడు.

రజనీకుమార్ వెంటనే మేడమీదకు వెళ్ళి, రామ్మూర్తిని చెయ్యిపట్టుకొని నడిపిస్తూ, తీసుకొని వస్తున్నాడు.

(ఇంకా ఉంది)




పూలలోగిలి ముళ్ళకౌగిలి

— దాశరథి

గడియారం కంటిలో
నడిరేయి ఫాల్గుణం ఆఖరురోజు, రెండుముళ్ళు
కౌగలించుకోగా జలదరిస్తుంది వళ్ళు
అయితే అంతటితో ఖతంకాలేదు
పాత వత్సరపు కడగళ్ళు
తొలినెల ప్రతిపత్తిధి ప్రభాతకిరణం తాళంచెవి నప్పుడు
నవ వత్సరసౌధ కవాటాన్ని తెరచినప్పుడు
చేతిలో వేపప్రసాదపు వెండిగిన్నెతో
జారిపోతున్న పట్టు పైటలోని మిసిమి వన్నెతో
ఉగయానిలానికి ఆడుతున్న అలకలతో
ఒయ్యారం ఒలకబోసే నడకలతో
ఉగాది తెలుగు జవ్వని వచ్చింది
తొలి చూపులోనే లోకానికి నచ్చింది
"ఆంధ్రజాతికి పట్టిన శని
ఈ యేడైనా వదిలి పోతుందని
నాకు యెంతో ఆశగా వున్నది"
అని ఈ ఉగాది అంటున్నది
హాయిలేని కోయిల పాట
పళ్ళు లేని మామిడితోట,
ప్రశాంతిలేని వసంత వనవాటి
బాధపడిపోతోంది తీక్ష్ణాతపం కోటి
తన సమస్యల్ని తాను పరిష్కరించుకుని
తన ఇంటిని తాను చక్కపెట్టుకుని
జాతి జీవిత సమరంలో గెలుస్తాడు
జయపతాకం ఎగరేస్తాడు తెలుగువాడు
కుళ్ళు రాజకీయాల ముళ్ళ కౌగిలి
సడలి, తెలుగుజాతి అవుతుంది పూలలోగిలి

(చిత్రం శ్రీ వె. బాలయ్య.)



ముక్కంటి సీమలో పెద్ద కాటకం వచ్చింది. క్షామ దేవత విలయతాండవంలో జన పదాలన్నీ అల్లల్లాడి పోయినవి. దప్పిక చల్లార్చుకోవడానికి చుక్క నీరు కూడా లభించని అసహాయ స్థితిలో కొంపాగోడూ వదిలి ఆ దేశం ఎల్లలు దాటిపోతున్న కూలీల గోడు అవర్ణనీయమై పోయింది.

రోజా పత్రికల్లో ఈ వార్తలే అచ్చు కావడం వల్లా మంత్రి వర్గం అత్యవసర సమావేశంలో కొన్ని ముఖ్య నిర్ణయాలను తీసుకొన్నది. మండలానికొక మంత్రి వెళ్ళి అప్పటికప్పుడే కరువు నివారణ కార్యక్రమాలను ప్రారంభించాలని ఎన్ని కోట్లనైనా వెచ్చించి ప్రజలను కాపాడి తీరాలని అమాత్యులందరూ కంకణం కట్టుకొన్నారు.

మత్స్యశాఖామాత్యులు రాజాసుందరప్రకాశ గోవర్ధన శతపధిగారు కనకాచలం జిల్లా పర్యటనకు బయలుదేరారు. మంత్రిగారి పర్యటన కార్యక్రమాన్నంతా స్థానిక పత్రికలు ప్రముఖంగానే ప్రచురించాలనుకొన్నందున ఆ జిల్లా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ అవసరమైన ముందు జాగ్రత్తలన్నీ తీసుకొన్నాడు. దినవార పత్రికల విలేఖరులనే కాక మాసపత్రికల విలేఖరులను కూడా పిలిపించి కనకాచలంలో ప్రెస్సు కాన్ఫరెన్సును యేర్పాటు చేశాడు.

ఆ రోజు కనకాచలం ట్రావెలర్సు బంగళాలో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో మత్స్యశాఖామాత్యులు రాజా సుందరప్రకాశ గోవర్ధన శతపధిగారనేక కొత్త విషయాలను వెల్లడించారు.

డైనమెట్ పత్రిక విలేఖరి అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ మత్స్యశాఖామాత్యులు యిలా అన్నారు.

'మనం సామ్యవాద యుగంలో ఉన్నాము. రుచిలో బేడిసెలే బాగుంటాయనీ బుడ్డపక్కెలు బాగుండవనీ భేదాలుంచుకోరాదు. మనకు కొరదైనా ఒకటే కొరమేనైనా ఒకటే. పూజేపను పెంచుతూ మావురాయిని మరచిపోరాదు. మన నేతల వలె పీతలను కూడా సంరక్షించుకోవాలి. జపానులో నేను గమనించాను. వాళ్ళు సీఫుడ్‌ను బాగా ఉపయోగించుకొంటారు. ఈ కరువులో ప్రతి చెరువులో జెల్లలనో ఇసుక దొందులనో పెంచుకోకుంటే దేశం దెబ్బతింటుంది.'

'మన చెరువుల్లో నీళ్ళుంటే గదా సార్?' మధ్యలో ప్రశ్నించాడు సౌదామిని విలేఖరి.

'డోన్ట్ డిస్టర్బ్ మి, దటీజ్ అనదర్ ప్రాబ్లం' అంటూ అమాత్యులు సిగరెట్ ముట్టించి—

'యుసీ ... ఈ నత్తలున్నాయే వీటిని పుష్కలంగా పెంచాలి. వాటిలో క్రొవ్వు పదార్థం యెక్కువ. ప్రతి గుంటలోనూ పెంచే వీలుంది. అన్నట్టు మరచాను. నేను ఇండోచైనా వెళ్ళినపుడు అక్కడొక మ్యూజియంలో నాయెత్తు తాబేలును చూశాను. కాదూ కూడదంటే కొంత మసాలా ఎక్కువవుతుంది. కాని అది బలేరుచిగా కూడా ఉంటుందని నా నాన్‌వెజిటేరియన్ ఫ్రెండొకాయన చెప్పాడు. అతడిపుడు చికాగోలో ఉన్నాడనుకోండి. ఇక్కడ చెరువు లెక్కవేగా?' ప్రశ్నించాడు గౌరవనీయులైన మత్స్యశాఖామాత్యులు.

అందరూ కాకున్నా ఇంచుమించు సగం మంది ఎక్కువనే చెప్పారు. కాని జాజిమల్లె పత్రిక కరస్పాండెంటు మాత్రం 'అర్ధం చెరువులకు పైగా కట్టలు తెగిపోయినవే' అన్నాడు.

'డజన్‌ట్ మేటర్. ఆ పని మనది కాదనుకోండి. ఇర్రిగేషన్ మినిస్టర్ చూస్తారు. మన చెరువుల్లోనే కాదు. ప్రతి బావిలోనూ చేపల్ని పెంచాలి. కరువులో చేపల్ని పెంచే కార్యక్రమం క్రింద కనీసం పదికోట్లరూపాయలనైనా ప్రత్యేకించమని నేను సి.యం. తో గట్టిగా చెప్పాను. కానీ మా ఫైనాన్స్ మినిస్టర్ ఒప్పుకొంటేగా. చివరికి యాభైలక్ష లిచ్చాడు. కడకు నేను మొండిగా పేచీ పెడితే రెండుకోట్లు చేపలపట్టే వలల్ని కొనడానికి అలాట్ చేశారు.'

'పెంచకనే పట్టే ప్రశ్న ఎక్కడుంటుందండీ?' చిన్నగా నసిగాడు సిగ్నల్ పత్రిక విలేఖరి.

'మీ కదే అర్థంకాదు. ఒక్కసారిగా వలల్నికొంటే పెంచే చేపల్నంతా పడుతూ ఉండవచ్చు. జాలర్లు వీకర్ సెక్షన్‌కు చెందిన వాళ్ళు. అసలు మైనారిటీ కమ్యూనిటీస్‌ను డెవలప్ చెయ్యడమే మన ధ్యేయం. సోషలిజం ముఖ్యసూత్రం ఒకటుంది. చిన్న చేపల్ని పెద్ద చేపలు మ్రింగివేసినట్లు మెజారిటీ కమ్యూనిటీస్ మైనారిటీ కమ్యూనిటీస్‌ను మ్రింగివేయడాన్ని చూస్తూ ఊరుకోరాదు. అందుకే మా డిపార్టుమెంటుకు ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్సులో 'పెద్ద చేపలు చిన్న చేపల్ని మ్రింగివెయ్యకుండా చూడాలి' అన్నాము. ఒకేసైజు చేపల్ని పెంచనున్నాము. బొంబడాయిలుండే బావిలో మావురాయిల్ని వదలేస్తే ఏమవుతాయి చెప్పండి? తాటాకు చేపల్ని పాము చేపల్ని పక్కల్లో విడిస్తే బతకవు!...అంటూ టైం చూచుకొని 'వేరిస్ అవర్ ఇన్‌స్పెక్టర్' అన్నారు అమాత్యులు.

ఏడుకొండలవాడికంటే వెడల్పైన నామం పెట్టుకొన్న బంట్రోతు వచ్చి 'వారు పరిగిలి గుట్టలో తమ రాకకు యేర్పాట్లు చెయ్యడానికి వెళ్లారు దేవరా' అన్నాడు.

పరిగిలగుట్ట అక్కడికి పాతికమైళ్ళుంది. కార్యక్రమం ప్రకారం చెన్నారాయుడి చెరువులో చేపల పెంపకం కేంద్రానికి మంత్రి ప్రారంభోత్సవం చేస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఉత్సవానికి కనకాచలం జిల్లాపరిషత్ అధ్యక్షులు మచ్చా జీవానందంగారు అధ్యక్షత వహిస్తారు. అదే సభలోనే బెస్తలకు కొత్తవలలు పంచబడుతాయి.

జిల్లా కలెక్టర్ కారు ముందు దారి తీసింది. వెనుక మత్స్యశాఖామాత్యుల కారు ఆవెనుక పబ్లిక్ రిలేషన్సు డిపార్టుమెంటువారి వ్యాను నిండుకూ పత్రికా విలేఖరులు, పరిగిలిగుట్ట సమితి అధ్యక్షుల జీపు ఇంకా యేవో కొన్ని వాహనాలు తుర్రుమంటూ దూసుకపోయాయి.

పరిగిలి గుట్టలో పెద్ద పందిరి వేశారు. భగభగమండే ఎండను లెక్కచెయ్యకుండా ఆ పరిసరాలనుండి పంచాయతీ సర్పంచులు, మునసబులు, కరణాలు, కాంట్రాక్టర్లు, సమితి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వందల సంఖ్యలో సమావేశమయ్యారు బాగా అలంకరించిన బండిపై పెద్ద గాజుతొట్లలో రకరకాల చేపలు విలాసంగా విహరిస్తున్నాయి. వాటిలో బంగారు వన్నెల మీనులూ కుచ్చుతోకల జలపుష్పాలు కూడా ఉన్నాయి.

మంత్రిగారు పరిగిలిగుట్టకు చేరేలోగా గంట మూడు దాటింది. అక్కడిను రాయడి చెరువు అరమైలు. ఆదారిపొడుగునా పెద్ద ఊరేగింపు. అమాత్యులను లారీపై అమర్చిన పూలపల్లకిలో కూర్చోబెట్టారు. ఆ పల్లకిని కూడా మత్స్యాకారంతో అతి రమణీయంగా పచ్చచామంతి పూలతోనే జోడించారు.

'కరువులో చేపల్ని విరివిగా పెంచండి'

'ఎండుచేపల తిండి గుండె బలాన్నిస్తుంది'

'పూజేవల్ని పెంచితే పుణ్యం వస్తుంది'

'తాబేళ్లను పెంచండి కుబేరులై పోండి'

'ఎండ్రకాయల కొవ్వులో ఎంతో బలముంది'

'అన్నిరకాల చేపల్ని పెంచడమే అసలైన సోషలిజం'

'కరువు బరువు తగ్గాలంటే కరవాళ్లను వాడండి'

'పప్పన్నం తినకండి. ఉప్పు చేపలు వాడండి'

ఇంకా రకరకాల నినాదాలు వ్రాయబడిన అట్టలతో కొమ్ములు, తుతార్లు, పిల్లనగ్రోవులు, జాగంటలు, జవనికలు, తుడుములు, పలకలు, డోళ్లు, మేళాలు, నాగస్వరాలు, కిలారినెట్లతో భూనభోంతరాళాలు దద్దరిల్లేటట్లు ఊరేగింపు ఆరంభమైంది.

మత్స్యశాఖామాత్యులు శ్రీ రాజాసుందర ప్రకాశగోవర్ధన శతపతిగారు కోరమీసాను మెలివేసుకొంటూ సుఖాశీనులైన దృశ్యం నయనానందకరమైనా ఎండధాటికి తట్టుకోలేక విలేఖరులందరూ ముందుగా చెన్నారాయడి చెరువు వేపు దారి తీశారు.

పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరు వారిని చెరువులో నున్న వేదిక వద్దకు తీసుకపోయి తలో కొబ్బరి బోండా ఇప్పించాడు. వారా ఎలనీటిని త్రాగి సిగరెట్లు కాల్చుకొంటూ వేదికకు దక్షిణంగా నున్న సిమెంటుతొట్టి దగ్గరకు వచ్చి నిలబడ్డారు. వందఅడుగుల పొడవు, నలభై అడుగుల వెడల్పున్న ఆ తొట్టిలో అర్ధానికి పైగా నీరున్నది. నుసలెచ్చిని ఆ నీటిని ఆ ఉదయమే తెచ్చిపోసినట్లు అతి ప్రయత్నం మీద కనుగొన్నారు. ఏడేండ్లక్రితం మొరవ సాగిన చెన్నారాయుడి చెరువులో మూడేళ్ళనుండి నీటిచుక్క లేదు. [illegible] చెరువు గర్భంలోనే జొన్నలు చల్లినా వాన బొట్టు లేక విత్తనాలు మాడిపోయాయట.

ఐనా మత్స్యశాఖామాత్యులు ఇటీవలనే అనేకదేశాలలో పర్యటించి వచ్చిన విశేషానుభవాలతో కరువులో చెరువుల్లో చేపల్ని పెంచే విస్తృతమైన పథకాన్ని చేపట్టారు. అతి సాహసోపేతము, పరిశోధనాత్మకమూ ఐన ఈ పథకంతో ముక్కంటి సీమ లెక్కలేనన్ని టన్నుల చేపల్ని ఉత్పత్తి చెయ్యగలదని వారి విశ్వాసం. ఈ దెబ్బతో ఇంటర్నేషనల్ మార్కెట్లు లభించినా ఆశ్చర్యంలేదు. విలేఖరులా విచిత్రమైన భోగట్టాలనంతా సేకరిస్తుంటే అప్పుడే జీపునుండి దిగిన ఫోటోగ్రాఫర్లు ఊరేగింపు దృశ్యాలను కెమెరాలలో సంక్షిప్తంగా దాచుకొంటున్నారు.

ఆకసమే చిల్లులుపడే అట్టహాసాలతో ఊరేగింపు చెన్నారాయడి చెరువులో ప్రవేశించింది.

బ్రహ్మాండమైన పందిరిలో అత్యంత శోభాయమానంగా అలంకరించబడిన వేదికపై అమాత్య శేఖరులు నాయకులు ఆశీనులైన వెనుక స్థానిక నియోజకవర్గం యం. యల్. ఏ. మైకుముందు నిలబడ్డారు. రెండున్నర మీటర్ల వ్యాసంకల వారి బొజ్జపై హాయిగా శయనించియుండిన వారి హస్తాలను అతి ప్రయత్నం మీద పైకెత్తి ఒక్క దండంపెట్టి సభాంగణము నుద్దేశించి వారిట్లా అన్నారు.

'నా రైతు సోదరులారా! కూలీ సోదరులారా! హరిజన సోదరులారా! ఈ దినం శుభదినం. ఎన్నో వ్యయప్రయాసలతో ఎంతో దూరంనుండి ఈ చండ్ర నిప్పులు కురిసే — బండలైనా చిట్లిపోయే యెండల్లో మన మంత్రి మనమధ్యకి వచ్చారంటే ఏమనాలి. ఇది ప్రజారాజ్యం. సోషలిజంలో ఇదే ఉంది. నా సేవ మీకు తెలిసిందే. గుండ్రాళ్ల పల్లె కుంటకట్టుకు మన్ను పోయించాను. పాపాద ఊరిబడిలో రెండో టీచర్ని వేశాను. నక్కావాళ్ల పల్లెలో మంచినీళ్ల బాయి తవ్వించాను. ఇప్పుడు వేళకాదు. ఇన్నో ఉన్నాయి. ముందు మంత్రిగారు మాట్లాడుతారు' అని అంటుండగానే

'సన్మాన పత్రాలు. సన్మాన పత్రాలు... సన్మానపత్రాలు' అంటూ కేకలేశారు జిల్లా పరిషత్ చేర్మన్ మచ్చా జీనానందం గారు.

ఎండమావుల్లో...

కోర్టులో విన్పించే నిశబ్దంవంటి ఆశేకతో సభలోనుండి పది మంది వేదికపైకి దుమికారు. వాటిలో ఒక్కటి మాత్రం చదివితే చాలన్నారు అమాత్యులు.

పరిగిలిగుట్ట హైస్కూల్ సీనియర్ తెలుగు పండిట్ హానరబల్ పొయెట్ సుగ్రీవాచార్యులుగారు గసపోసుకొంటూ మైక్ దగ్గరికి వచ్చి వణుకుతూ గొంతును సవరించుకొని పఠనానికి ఉపక్రమించారు. ఆయనా పంచాయతీ సమితికి ఆస్థాన కవి. గౌరవనీయులు ముక్కంటి సీమ మత్స్యశాఖామాత్యులు శ్రీ రాజా సుందరప్రకాశ గోవర్ధన శతపతిగారికి పరిగిలిగుట్ట పంచాయతీ సమితి సమర్పించిన సన్మానపత్రము.

అమాత్య సత్తమా!

అత్యంత పరాక్రమోపేతులై, అభిసిర భయంకరులై, అత్యధిక శౌర్య ధైర్య సాహసోపేతులై, అతల వితల సుతల తలాతల రసాతల పాతాళ లోక భయద వికటాట్టహాస వీరవిహారంతో అలనాటి భారత స్వాతంత్ర్య సంగ్రామ రంగమునందు దుమికి; విజయ దుందుభి మ్రోగించి స్వరాజ్యమును సాధించి...'

అనగానే సభాంగణంలో నున్న సౌదామిని కరస్పాండెంటు 'ఆనాడీయన వయస్సు ఐదారేండ్లుంటాయా' అని నసిగాడు కానీ వినరికి వినిపించలేదు.

'స్వరాజ్యమును సాధించి నేడు సామ్యవాదమును స్థాపించుటకు కంకణము దాల్చి మత్స్యశాఖామాత్యులగా మన ముక్కంటి సీమలోని ఒక్కొక్క చెరువులోనూ లెక్కలేనన్ని చేపలను పెంచి దశదిశలకూ పంచి కరువును నివారించి క్రొత్త చరిత్రను సృష్టించుటకు అవతారమెత్తిన మత్స్యావతారుడైన మీరాక మాకెందముల కానందదాయకమై నోటమాట రాక యున్నది.

మంత్రి శేఖరా!

మా చేదబావులలో చేపలు లేవు, నీరు లేకున్ననూ బ్రతికే చేపలను ప్రాజ్ఞులు పరిశోధించునట్లు ఉత్తరువులు దయచేయ ప్రార్థన.

మంత్రి పుంగవా!

మా వాగులలో అక్కడక్కడ మడుగులున్నవి. వాటిలో వదలుటకు తాబేళ్ళను నత్తలను సరఫరా చేస్తూ వాటిని భక్షించడానికి కొంగలను కాల్చడానికి తుపాకులతోపాటు లైసెన్సులు కూడా ఇచ్చునట్లు కలెక్టర్గారికి ఆర్డర్లు అనుగ్రహించమని మా విజ్ఞప్తి!

ప్రజల పాలిటి పెన్నిధీ!

మా చెరువులన్నీ ఎండిపోయి ఉన్నందున ప్రతి చెరువులోనూ సిమెంటు తొట్లు కట్టించి వాటినిండుగా నీటిని పోయించి చిన్న చేపలతోపాటు పెద్ద చేపలను కూడా తెప్పించి కొరదలు బ్రతకడానికి వీలుగా సిమెంటు తొట్లలో బోరింగులు త్రవ్వించమని అభ్యర్థన.

మేరునగధీరా! సాగరగంభీరా!

మా పెరళ్లలో నీటి తొట్లలోకూడా చేపల్ని పెంచడానికి అనువుగా వారానికొక కిలోవంతున ఉలవల్ని బెల్లాన్ని సరఫరా చేసి ఈ కరువులో ఆహారాలైన ఈ చేపలనంతా పట్టుకోడానికి ఇంటికొక వలను కూడా సరఫరాచేయాలని ప్రార్థన.

ఇంత శ్రమకోర్చి ప్రయాణంతో మా మీద అలరించిన మీకు దేవతలు నిండుగ, అల్లా, ఏసు ఆయురారోగ్య ఐశ్వర్య భోగభాగ్యములను ప్రసాదింతురుగాక!

ఇట్లు,
పంచాయతీ సమితి అధ్యక్షులు
మరియు సభ్యులు,

పరిగిలిగుట్ట
1—10—1972

చిరునవ్వు తొలకిస్తూ సగౌరవాభినందితంగా తల వాడిస్తున్న మంత్రిగారు పైకి లేవడంతో దాదాపు వంద పూలదండలు వారి మెడను అలంకరించాయి. పరిగిలిగుట్టంత పూలగుట్టను ప్రక్కకునెట్టి అమాత్యవర్యులు అత్యంత గంభీరస్వరంతో ఇలా అన్నారు.

సోదరులారా! అనడంతోనే కెమెరాలు క్లిక్కుమన్నాయి. కరస్పాండెంట్లందరూ కలాలు తీసుకొన్నారు. ప్రేక్షకుల చెవులు రిక్కపొడుచుకొన్నాయి.

'ముందుగా కావలసింది పని' అంటూ మంత్రి ఉన్నట్టుండి వేదిక దిగారు. వారి వెంట నాయకులూ నడిచారు. సిమెంటు తొట్టిలోనికి మంత్రిగారు గాజుతొట్టిలోని చేపల్ని వదిలారు. అప్పటికే సమాప

పాటిగా కాగిన ఆ వేడినీటిలో ప్రవేశించిన చేపపిల్లలు అల్లల్లాడుతుండగా అమాత్యులు వేదికవద్దకు వచ్చి ఉపన్యాసం ప్రారంభించారు.

ఇంగ్లాండు, స్కాట్లాండు ఐర్లాండు, పోలెండు, ఫిన్లాండ్, నార్వే, స్వీడన్, డెన్మార్క్ మొదలైన దేశాలలో తాను చూచిన చేపల్ని గురించి చెబుతూ ముక్కంటి సీమనంతా మత్స్య పరిశ్రమలోనింపి తన బాధ్యతను నెరవేర్చుకొంటానన్నారు. కరువులో చేపల్ని పెంచాలనీ, కరువు నివారణకి అదొక్కటే తరుణోపాయమనీ సెలవిస్తూ పరిగిరి గుట్టలోని బెస్తలకు వలలను బహూకరించారు. వలలతోపాటు సింగితాలు, కొడాలు, గాలాలనుకూడా విరివిగా పంచిపెట్టి చేపల్ని వలా పట్టాలోకూడా పట్టి చూపెట్టారు. ఆయాశాఖకు ఆధిపత్యం వహించే అమాత్యుడయాసనులను స్వయంగా చేసిచూపడం ఆదేశంలో అనుశ్రుతంగా వస్తున్న సాంప్రదాయం.

మంత్రిగారు తొట్టిలోకి వదలిన చేపలన్నీ నీటిపై తేలుతూ ఉన్నందున సింగితంతో దేవి దేవీ పైకి తీశారాయన. చేపలట్లా వెల్లకిలా పడిపోవడం ఎందుకని జాజిమల్లె పత్రిక కరస్పాండెంట్ అడుగబోతుండగా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ అతని వెనుకనుండి చొక్కా లాగడు! కరస్పాండెంటు మౌనంగా వ్యాన్ వైపు నడిచిపోయాడు.

మత్స్యశాఖామాత్యులు సరదాగా పట్టిన చేపల్ని ఆ జాలర్లకే యిచ్చి మళ్లీ వేదికపై ఆశీనులయ్యారు.

పంచాయతీసమితి అధ్యక్షుల కృతజ్ఞతతో సమావేశం ముగిసిపోయింది ఆ సమయానికి సరిగ్గా పొద్దుకూడాపోయింది

పరిగిరిగుట్టలో ఆ రాత్రి డిన్నరున్నట్లు విలేఖరులకు తెలిసింది. వెజిటేరియన్సుకు కూడా మత్స్యాల ఆకారంతో కజ్జికాయలు, రొయ్యల రూపాలతో బూంది, వడ్డించబడుతాయనీ ఆ రాత్రికేదో ఎంటర్‌టెయిన్‌మెంటు ఉంటుందనీ పౌరసంబంధ శాఖాధికారి సెలవివ్వడంతో విలేఖరులందరూ ఆలోచనలో పడ్డారు.

కరువులో విందులేమిటని నసిగాడు సౌదామిని విలేఖరి.

అసలు ఒక్కొక్కడుండవమ్మా మాకు ఆయన వుండే శుభ్యం అర్ధరాత్రైనా అంటూ అంగీకరిస్తున్నట్లు తల ఊపాడు జాజిమల్లె కరస్పాండెంటు.

అందరూ పంచాయతీ సమితి అధ్యక్షుల వారి కొత్త భవనంలో ప్రవేశించేలోగా హాలంతా విస్తళ్లు కన్పించాయి.

ఆ విందును, చిన్నారకాల పిండివంటలతో పంచభక్ష్య పరమాన్నాలతో వడ్డించిన ఆ విందును అరగించి తాంబూలాలను సేవిస్తూ అక్కడే అందిచ్చిన సిగరెట్లను కాలుస్తూ అప్పుడే ప్రారంభమైన వినోద కాలక్షేపంలో నిమగ్నులైన విలేఖర్లు కరువునే కాదు ఈ లోకాన్నే మరచి పోయారు.

మత్స్యశాఖామాత్యులు శ్రీ రాజా సుందరప్రకాశ గోవర్ధన శతపతిగారు మరునాటి కార్యక్రమాన్ని గురించి కలెక్టరుతో ముచ్చటిస్తూ సోఫాలో పడుకొన్నారు.

చేపల మంత్రి పర్యటనలో తొలిరోజు కరువు నివారణ కార్యక్రమం నిర్విఘ్నంగా జయప్రదంగా జరిగిపోయింది. ముక్కంటి సీమ సామ్యవాద ప్రభుత్వ జైత్ర రథం ప్రగతి పథంలో ఒక కిలోమీటర్ ముందుకు సాగింది. ●



వారఫలం

6-4-1973 శుక్రవారం మొదలు 12-4-1973 గురువారం వరకు

మేషం : భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. నూతన వ్యవహారాలు బాగుంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. సజ్జనసాంగత్యం లభిస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

వృషభం : వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. కోర్టు వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

మిధునం : లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

కర్కాటకం : వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో వృత్తివ్యాపారాలు తిరిగి అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. విలాస వస్తువులు కొంటారు.

సింహం : అన్ని వ్యవహారాల్లోనూ గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. మీ ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో చేతిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కన్య : వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

తుల : సహాయం చేస్తామన్న వారు సమయానికి తప్పుకోవచ్చును. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

వృశ్చికం : ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరగలదు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు బాగుంటాయి.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం చేస్తారు.

ధనుస్సు : వృత్తిలో పోటీదారి పోటీ పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీరు ప్రయోజనం లేని శ్రమకు గురికాగలరు.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. ప్రయాణాలు వాయిదా పడతాయి.

మకరం : వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. పోటీదారితో వాదప్రతివాదాలు తగవు. ఇతరుల నిమిత్తం మీరు శ్రమ పొందవలసి వస్తుంది. వారం ఆఖరులో రావలసిన డబ్బు సమయానికి అందుతుంది.

స్త్రీలకు — సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

కుంభం : సామాన్యమైన పనులకు కూడా మీరు ఎంతో కృషి చేయవలసి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. విద్యావైజ్ఞానిక రంగాలో మీ కృషి రాణిస్తుంది. వారం ఆఖరులో మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి.

స్త్రీలకు — బంధుమిత్రులను కల్సుకొంటారు. అలంకార వస్తువులు కొంటారు.


మీనం : మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలలో ఇబ్బందులు కలుగును. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

—మహేష్



Creative Unit-559-Tel.



డిటెక్టివ్ సీరియల్ యస్. ఝాన్సీ రాణీబాయి

జరిగిన కథ

హైదరాబాదు శారదా టాకీసులో 'దేశమంటే మట్టికాదోయ్' సినిమా ప్రారంభంనుంచి ఆడుతోంది. ఒకరోజున—ప్యాటినీ విడిచిపెట్టేక హాల్లో ఒకమనిషి మిగిలిపోయాడు. ప్రొప్రయిటరు వాడిని లావుఅతను నిద్రపోతున్నాడేమోనని లేపాడు. లేవలేదు. వీపులో పిడివరకు దిగబడిన కత్తివుంది. ఈ శవం సినిమాకు ఎలా వచ్చింది పోలీసు డిపార్టుమెంటుకు ఒక పెద్దసమస్య అయింది. ఇన్‌స్పెక్టరు శేఖరం రంగంలోకి దిగాడు. దేశంలోని విలువయిన శిల్పాలు చెక్కడాలు ఇతర దేశాలకు దొంగతనంగా ఎగుమతి అయిపోతున్నాయి. ఇందులో ఒక ముఠా ఉత్సాహంగా పనిచేస్తున్నట్టు కనిపెట్టాడు ఇన్‌స్పెక్టరు. అక్కడే ఒక ప్రసిద్ధ స్వాముల వారున్నారు. ఆయనకి పెద్ద ఆశ్రమం వుంది. అక్కడి శిలావిగ్రహాలగురించి ఆయనకి బాగా తెలుసు.

6

ఆమె దారివెంటగాక, తుప్పల చాటునుంచి ప్రయాణం సాగించింది. భవనానికి వెనుకవైపుగా వెళ్ళింది. ఎక్కడా మానవ సంచారంగాని, వెలుగుగాని కనిపించటం లేదు! ఆమె అలా, కొన్ని గదులు చూచుకొంటూ వెళ్ళింది. కొంతదూరం వెళ్ళిన తరువాత, ఒకగదిలోనుంచి సన్నని వెలుగు, కిటికీగుండా కనిపిస్తూవుంది. ఆమె పిల్లిలా, ఆ కిటికీ వద్దకువెళ్ళి చూచింది. అది, క్యాండిల్సు వెలిగించిన కాంతి మాత్రమే. ఆ గదిలో నాలుగు కుర్చీలు మాత్రం వున్నాయి. టేబులుమీద '696' సీసాలు, కొన్ని సోడాలు, కొన్ని బీరు సీసాలు, వెలుగుతున్న క్యాండిల్సు వున్నాయి.

ఆమె అలాగే అక్కడే ఒక పావుగంటవరకూ గడిపింది. గోడకు బల్లిలా ఆమె అతుక్కుపోయింది. దానికితోడు ఆమె ధరించిన దుస్తులు ముందుభాగం నల్లగాను, వెనుకభాగం తెల్లంగాను వున్నాయి. ఆ గదిలోకి తాను వెళ్ళితే, ఆ దీపకాంతిలో, అక్కడెవరన్నా పొంచివుంటే, వాళ్ళకు కనిపిస్తుంది. అందుకే ఆ గదిలోకి వెళ్ళకుండా ఇంకా కొంతముందుకు వెళ్ళింది. ఆ చీకట్లోనుంచి మాటలు మాత్రం వినిపిస్తున్నాయి.

'నీ బావమరిది, విన్ని విగ్రహాలు త్రవ్వి తీశాడు చెప్పు.'

'ఏమో నాకు తెలియదు'

'ఏయ్, ముసలాడా, మర్యాదగా చెప్పు, లేకపోతే, యమయాతన పడుతావ్.

'ఏడిశారు, నేను ఎవరనుకున్నార్రా.'

'ఆ తెలుసు. జమీ పోయి, విగ్రహాలు అమ్ముకొని బ్రతికే ఒక మాజీ జమీందారువని.'

'దొంగ వెధవల్లారా. మా భాషకూడా సరిగారాదు. అందులోనూ దొంగతనంగా నన్నెత్తుకొచ్చి బెదిరిస్తున్నారా, మావాడికి తెలిస్తే మిమ్మలను నిలువునా చీలుస్తాడు.'

'ముందు నీ గతి చూచుకోరా ముసలి పీనుగా. బారెడేసి మీసాలునువ్వు. సినిమాలో అయితే విలన్‌కు బాగా పనికివచ్చే వాడివిరా. అదిసరే, విషయం చెప్పు. లేదా ఈ రివాల్వరుతో ఇప్పుడే కాలుస్తా ఆ జాగ్రత్త.'

'వెధవ ప్రాణం. ఎప్పుడన్నా పొయ్యేదేరా. నేను అబద్ధం చెప్పనురా. వెధవాయిల్లారా, ఆ బొమ్మలు; మా స్వామి - తీసేది తెలియదు. అమ్మేది అంతకన్నా తెలియదు,'

'ఏయ్ విడిచేతులకు తాడుకట్టి ఆ కప్పీలకు వేలాడ దియ్యండి. ఏదో ముసలివాడు పాపం అనుకొంటుంటే మరీ ఇదయిపోతున్నాడు. ఆ త్రాడు పైకి లాగండి.'

ఆ మాట రావటం తడవుగా అతని రెండుచేతులు త్రాళ్ళకుకట్టి కప్పీమీద పైకి లాగారు. అసలే సత్యదేవరాయణంగారి వయస్సు డెబ్బై దాటింది. దాంతో పెద్ద శరీరం అలా పైకి లాగేసరికి ఆయన బరువుకు ఆయన రెండుచేతులు వూడిపోతున్నాయా అన్నంత బాధ కలిగింది. ఆ బాధ భరింపరానిదయిందల్లె వుంది. ఆయన గట్టిగా అరచి మూల్గటం మొదలు పెట్టారు.

'ఇప్పుడు చెప్పు విగ్రహాలు ఎక్కడ దాచాడో.'

'నాకు తెలియదు, నాకు తెలియదు.'

'ఓ అలాగా ఊ ఇంకా పైకి లాగండి.'

అంటూ వుండగానే త్రాడులాగిన బలానికి కప్పి గట్టిగా మూలిగింది. అంతే కప్పికి కట్టిన త్రాడుతెగి సత్యదేవరాయణంగారు అంత ఎత్తునుంచి క్రిందపడ్డారు. అసలే పెద్ద వయస్సు, పెద్ద శరీరం. ఆయన క్రిందపడంగానే దిమ్మరపోయారు.

'అరే, ముసలాడు చచ్చినట్లున్నాడు. చూడండి. విగ్రహాలు దొరక్కపోతే మానే, వీడితో పనివుంది. ఎందుకయినా మంచిది, కొంచెం నీళ్ళు ముఖాన చల్లండి.'

సత్యదేవరాయణంగారి ముఖాన చల్లని నీరు పన్నీటిజల్లులా పడింది. ఆయనగారు పాతిక సంవత్సరాల వయస్సులో వుండగా, తమ దివాణం ధనధాన్యాలతో తులతూగుతూ వుండేది. ఆ రోజుల్లో ఆయనగారికి వేసవి సాయంత్రం సమయాల్లో నిద్రనుంచి మేల్కొనటానికి అలా పన్నీరు చల్లేవారట. ఆయనకు ఇది కలా?, నిజమా? అని అనుమానం వేసింది. కాని, తనకు ఒక నిమిషంముందు ఏమి జరిగిందీ గుర్తుకొచ్చింది. ఆయన రెండుచేతులూ తాళ్ళతో గట్టిగా కట్టబడి వున్నాయి. తనమీద నీళ్ళు చల్లుతున్నవాడు, ఏమయినాడో తెలియదు. గది అంతా చీకటి. తన కాళ్ళవద్ద ఎవరో నిలుచున్నట్టుగా ఆయనకు అనుమానం

వేసింది. అరయుక్షా, ఆయన తక బలా న్నంతా కేంద్రీకరించి ఒకకాలు గట్టిగా విసిరాడు. తన కాలికి మానవాకారం మెత్తగా తగిలింది. ఆ మానవాకారానికి తగిలిన దూలంలాటి కాలిదెబ్బకు గాలిలో బంతిలా లేచి వెళ్ళి, ప్రక్కనున్న గోడకు కొట్టుకొన్నాడు. వాడు పెద్ద హారికేక పెట్టి అలానే పడిపోయాడు. అంతలో కేకలు బొబ్బలు. అదే అదునుగా చూచు కొని ఆయన పైకిలేచి చేతులకు కట్టిన త్రాళ్ళను, మదపుటేనుగ, తనకు కట్టిన గొలుసులను తెంపినట్లుగా తెంపేశాడు. ఇంతలో ఆయన్ని పట్టుకోవడానికి ఒక రిద్దరు ఆయనదగ్గరకు వచ్చారు. వాళ్ళను కోడిపిల్లల్లా పట్టుకొని గోడకు విసిరేశాడు. మళ్ళీ హాహాకారాలు. ఇంతలో.

'ఏయ్, ముసలిగాడిదా, కదిలావంటే కాలుస్తా, జాగ్రత్త. పిచ్చివేషాలు వేసింది చాలు. నీకు తెలియగలందులకు, ఇదిగో రివాల్వరు పేలుస్తున్నాను' అంటూ ఆ వ్యక్తి రివాల్వరు ప్రేల్చాడు. ఆ భవన మంతా ఆ శబ్దానికి మారుమ్రోగింది. ఇంతలో బయటవున్న ఆమె తన జేబులో నుంచి ట్రాన్స్‌మీటరుతీసి, మెల్లగా విష యాన్ని హైదరాబాదు పోలీసు హెడ్ క్వార్టర్సుకు తెలియపరచింది. సహాయం కావాలంటూ. వాళ్ళు ఏక్కడున్నది సాంకేతిక భాషలో చెప్పింది.

సత్యదేవరాయణంగారు చేసేదిలేక, తన రెండుచేతులు పైకెత్తి అలావే నిలు చున్నారు.

'పద.'

'ఏక్కడికి.'

'ముందు రూములోకి అక్కడ క్యాండిల్సు వెలుగుతున్నాయి. ఊ, పద మేము చెప్పినట్లుచెయ్యి. బ్రతికిపోతావు. లేదా' అంటూ వుండగానే సత్యదేవరాయణం గారిని ఆ గదిలోనుంచి, క్యాండిల్సు వెలుగు తున్న గదిలోకి తీసుకొనివచ్చారు. వాంగో చేతిలోని రివాల్వరు తళతళ లాడుతూ వుంది. ఆయన వెనకాలే ఇద్దరు పల్లె వాళ్ళు; నలుగురు మనదేశస్థులు వున్నారు.



అరుదులో ఒకడు - అచ్చొమ యున ఆం(ధుడులాగున్నాడు. అతడు అచ్చుతెలుగులో.

'మేం చెప్పినట్టు, ఆ బల్లమీద వున్న కాయితంలో (వాసి (పాణం కాపాడుకో. లేదా, అన్యాయంగా ఈ రివాల్వరుకు బలియిపోతావు.'

'ఏం, రాయాలి చెప్పండి'

'ఊ—మొదలెట్టు...నాకూ నా బావ మరిది స్వామికి, శారదా టాకీస్ మర్డర్ లోనూ, వామనరావు మర్డర్‌లోనూ ఏమీ ఇప్పిందలేదు. అలా ఏమి ఇవ్వని సర్కార మీ అమాకి (పభుత్వానికి తెలియజేస్తాము ఈ (వాశావా.'

'ఆ'

'ఏది ఇలా ఇవ్వు'

అంటూ వుత్తరం తీసుకొని లోలోపల చదువుకొని, పెద్దగా నవ్వాడు.

'హో చింత చచ్చినా, పులుసు మాత్రం చావలేదు. ఏనండయ్యా ఈ ఘనుడు ఏం (వాశాడో. 'శారదా టాకీస్‌లో మర్డర్, వామనరావు మర్డర్ చేసింది ఏవరో కాదు, జలాలుద్దీను భవనంలో దొంగవాడుగా వున్న నల్లజాతి ముఠా. మన దేశం ముఠాతో కలిసి కుట్ర పన్ని మన దేశం లోని వి(గహాలను అపహరించుతున్నారు. ఇట్లు, రాజా వసంత, వీర వెంకటవర (పసాద సత్యదేవరాయణం బహద్దూరు జమిందారు.'

సినిమాకువచ్చినశవం

'అబ్బా సంతకం చాలా పెద్దదే. మిస్టర్ మాంగో, చూస్తావేం కానియ్యి.'

మాంగో చేతిలోని, రివాల్వరు పైకి లేస్తూ వుంది. సత్యదేవరాయణం కళ్ళు మూసుకొని, తన ఇష్టదైవమైన సత్య నారాయణ స్వామిని (పార్థిస్తూ వున్నాడు. ఇంకొక్క సెకండు. రివాల్వరు (పేలింది సత్యదేవరాయణం నేలకొరిగి పోయాడు. కాని విచి(తం ఏమంటే, మాంగో చేతి లోని రివాల్వరు ఎగిరి అంతదూరాన్న పడి పోయింది. అతని నల్లటి చేతిలో నుండి ఎ(రని నెత్తురు కారుతూ వుండటం ఆ క్యాండిల్సు వెలుగులో స్పష్టంగా కని పిస్తూ వుంది. ఏం జరిగింది ఎవ్వరికీ తెలియలేదు. మళ్ళీ రివాల్వరు (పేలిన చప్పుడు. ఇంకా రెండు మూడుసార్లు రివా ల్వరు (పేలింది. ఆ గదిలోని క్యాండిల్సు ఆరిపోయాయి. ఆ చీకట్లో ఏమి జరిగిందో జరుగుతుందో ఎవ్వరికీ తెలియదు. ఇంతలో భవనం బయట తుపాకులు (పేల్చిన చప్పుడు. జీపుకార్లు, వ్యానులు వచ్చిన చప్పుడు. పోలీసుపార్టీ లోపలకు (పవేశిం చింది. టార్చిలైట్లు వెలిగాయి, ఆ భవ నంలో (పతి గదీ, వెతుకుతున్నారు పోలీ సులు. కాని ఎక్కడా ఒక్క పిట్టపురుగు కూడా కనిపించలేదు. అందరూ ఏమైనట్టు లేరుకు (టాన్స్ మిషను ద్వారా కబురంపిన వారు కూడా అక్కడ లేక పోవటం మరీ విచి(తంగా వుంది. పోలీసు అక్కడ కొంత మంది పోలీసువారిని కాపలా వుంచి, అంతా తిరిగి వెళ్ళిపోయారు.


* * *

విశాఖపట్నం వద్దవున్న కొండమీద, పది అడుగుల కంచు వి(గహం అక్కడ ఎంతో కాలం నుంచి వుంది. ఆ వి(గహం మీద సంస్కృత భాషలో చెక్కబడివున్న విషరాలు అందరికీ తెలుసు. కాని అంత లోతుగా సము(దంలో (తవ్వటానికి ఎలా సాధ్యం. అయిన దానికి ఎంత ఖర్చు ఎంత (పయాస. అది కూడా రోజూ ఉదయం, పది గంట లకన్నా ఎక్కువ సేపు పని చేయకూడదు. ఆ వి(గహం వెనుక భాగం కొండ నిట్ట నిలువుగా వుంది. ఆ లోయలో పచ్చిక బయళ్ళు తప్ప ఇంకేమీ లేవు. ఏ కొత్త మొఖం అక్కడ కనిపించినా అక్కడ మేకలు, గొ(రెలు మేపుకొనేవారు వాళ్ళను వింత గాను, అనుమానంగానూ చూస్తారు. అక్కడ ఇద్దరు వ్యక్తులు ఉపయోగించే అటు ఇటు పచార్లు చేస్తున్నారు

'బాస్, ఇది మనవల్ల అయ్యే పనేనం టారా, అంతలోతు సము(దములో (తవ్వి లోపలకు వెళ్ళగలమా.'

'ఎందుకు వెళ్ళలేము మనిషి (పయత్నం చేసి చం(దలోకం కూడా చేరగలుగు తున్నాడు. చేరటమే కాదు రోజా సికా రుకు కూడా ఇక వెళ్ళాడు. ఇంకా ఏద యినా తను తలపెట్టిన కార్యం చెయ్యగలుగుతున్నాడు, ఇది ఒక లెక్కా, ఈ వి(గహాన్ని గురించి వివరాలన్నీ స్వామీజీ అందరికి చెప్పేడట. అందుకే కొందరన్నా వచ్చి ఇక్కడ (తవ్వ కానికి (పయత్నం తప్పక చేస్తారని నా అనుమానం. వాళ్ళు చేసినపనిని చూచి, మనంకూడా మన కర్తవ్యాన్ని ఆలోచిద్దాం. ఈసారి మన (పయత్నంలో నెగ్గామా, మనం ఈ వృత్తి మానేసి మహారాజుల్లా (బతుకుదాం. ఏదన్నా వ్యాపారం' పెట్టు కుందాం. మరీ పెద్ద ఛాన్సు వగిలిందంటే, ఒక ఫ్యాక్టరియో, మిల్లో కట్టేద్దాం. అప్పుడు నువ్వు మేనేజ , నేను (పొపయిటరు. ఏమంటావు ఎలా వుంది అయిడియా.'

'అయిడియాకేం బాస్ చాలా చక్కగా వుంది.'



'మనంపోయి, దూరాన వున్న ఆ బండ ప్రక్కగా కూర్చుందాం. ఆయిస్ బ్యాగులో డ్రింకులు వగైరా వున్నయికదా?'

'డ్రింకులేమిటి బాస్ తిండికూడా. కావలసినవన్నీ వున్నయి. దాంతోపాటు......'

'దాంతోపాటు......'

'రివాల్వర్లు, బైనాకులరు, తూటాలు అన్నీ వున్నాయి.'

'అవి మామూలేగా, వద. ఆ బండ ప్రక్కన కూర్చుందాం. ఇలా రెండు మూడు రోజులు కాపలా వేశామా వాళ్ళు ఇక్కడకు తప్పక వస్తారు. ప్రయత్నంచేస్తారు. వాళ్ల ప్రయత్నం ఫలించగానే మనం, ప్రయత్న ఫలాన్ని గ్రద్దలు తన్నుక పోయినట్లు తన్నుకపోవాలి. ఏం, ఎలావుంది నా ఆలోచన.'

'బాస్, మనం ఏదీ నేరుగా చేయటం లేదుగా. పెద్దపులి, తన ఆహారంకోసం కష్టపడి, వేటాడి చంపిన జంతువును, తాను తినగా మిగిలిన దానిని, ఎక్కడన్నా దాస్తుంది. ఆ దాచినదాన్ని నక్కలు, దొంగతనంగా తింటాయి. అలాగే రాబందులు, గ్రద్దలూనూ, ఎవరో చంపిన జంతువు యొక్క అవశేషాలనో, లేక చచ్చినదానినో తింటాయి...'

'షటప్, వోరెక్కువయింది నీకు. నాకు నీతులు చెప్పటానికి ప్రయత్నిస్తున్నావా, ఎరుగుదువుగా మన తడాఖా. ఏ నిమిషాన్నయినా కాల్చిపారేస్తా. జాగ్రత్త.'

విశాఖపట్నం బీచి పన్నెండుగంటలవేళ అంత రష్ గాలేదు దూరాన కొండమీద అక్కడక్కడ మేకలు, గొర్రెలు మేస్తున్నాయి. సముద్రంలో దూరాన్న నల్లటి నలుసుల్లా కనిపిస్తున్నాయి. బెస్తవారు

సినిమాకు వచ్చిన శవం

చేపలు పట్టడానికి వెళ్ళిన చిన్న చిన్న పడవలు. సముద్రంగాలి జోరుగావీస్తుంది. ఎండ తీవ్రంగా వుంది. కాని ఎండ తీవ్రతను ఈ గాలి, నిప్పులమీదపోసిన నీళ్ళులా చల్లబరుస్తూ వుంది. బండప్రక్కగావున్న కొద్ది నీడలో బాస్ బండకానుకొని, సిగరెట్టు వెలిగించి, గట్టిగా దమ్ములాగుతున్నాడు.

'బాస్'

'ఏమిటి, కిషోర్.'

'మొన్న మనం హైదరాబాదులో అమ్మిన విగ్రహాలకు ఎంత సొమ్ము వచ్చిందంటారు'

'విగ్రహాలు' అంటూ తలవూపుతున్నాడు బాస్. ఆ సముద్రం గాలికి అతనికి నిద్ర ముంచుకొస్తుంది.

'అవే బాస్. మనం కాంచన నగరం కోటలో, ఆ నల్లవాళ్ళను కాల్చి, ఆ విగ్రహాలను హైదరాబాదులో తెల్ల దొరలకు అమ్మలేదూ వాటి సంగతే...'

'అవి రెండు లక్షలేగా......అవి...అవి ఇప్పుడెందుకు నాకు నిద్రవస్తుంది. ఎవరన్నా వస్తే, వారి చర్యలను. బైనాకులర్సు ఉపయోగించి కనుక్కో. ఎప్పుడు అవసరమైతే నన్ను లేపు.'

అంటూ నిద్రాదేవి వొడిలో జారిపొయ్యాడు.

కిషోర్‌కు ఆలోచనలు ముసురుతున్నాయి. పైన ఎండతీవ్రత అలాగే వుంది. గాలి చల్లగా వుంది. బాస్‌వంక చూచాడు. బాస్ నల్లకళ్ళద్దాల్లోనుంచి అతడు సరిగా నిద్రిస్తున్నది లేనిది తెలియటంలేదు. అతడు అలాగే సముద్రంవైపే చూస్తున్నాడు. అలలు బాగా పైకిలేచి పడుతున్నాయి. ఒడ్డు చేరేసరికి, ఆ అల ఆకారమే మారిపోతూ వుంది. కిషోర్ ఆలోచనలు కూడా అలాగే వున్నాయి. అలా కొంతసేపు చూచి అతడు ఒక నిర్ణయానికి వచ్చాడు.

'బాస్'

'ఊ'

'మీరు సంపాదించేదాంట్లో నాకు కష్టంలో తప్ప, సుఖంలో వాటా ఇవ్వడమే లేదు. కష్టానికితగ్గ ఫలితం నాకు ఇవ్వకపోయినా, అందులో నూరోవంతయినా ఇవ్వండి. ఇప్పటికి నాకు తెలిసి పది లక్షలయినా సంపాదించారు, కనీసం ఒకసారికి, ముఫ్ఫైమందినన్నా చంపివుంటాము. ఇంక ఈ నిధి దొరికితే, నేను మేనేజరు. మీరు ప్రొప్రయిటరు. ఎంత అన్యాయంసార్. నాకుకూడా తగినవాటా ఇవ్వాలి. ఏ మంటారు బాస్.'

'ఊ' బాస్‌కు ఇవేమి చెవికి ఎక్కటం లేదు. అతడు ఎండలో కలత నిద్ర పోతున్నాడు.

'చెప్పరేం బాస్'

బాస్‌కు అప్పుడు మెలుకువ వచ్చింది.

'ఏంటిరా నీ వాగుడు, నోరుమూసుకొని చెప్పినపని చెయ్యి. లేదా తన్నులు తింటావు. అంత ఇదిగా వుంటే కొంచెం మందేసుకో ఏదీ నాకు కూడా నో గ్లాసులో ఇవ్వు.'

కిషోర్ మాట్లాడకుండా, విస్కీయో, బ్రాందియో, బీరో గ్లాసులో నింపి ఇచ్చాడు. అతని ఆలోచనలు అక్కడ లేవు. తాను బాస్‌కు ఏమిస్తున్నది అతని ఆలోచనలోనే లేదు, కిషోర్ అందించిన గ్లాసులో ఏమున్నదో కూడా చూసుకోకుండా ఒక్కసారిగా నోరుతెరచి గ్లాసులోని ద్రవం అంతా నోట్లో పోసుకొని, గ్లాసు తిరిగి కిషోర్‌కు అందించాడు. కిషోర్ తిరిగి గ్లాసు నింపి ఇచ్చాడు. ఈసారి కూడా బాస్ దాన్ని పీల్చి పారేశాడు. మూడవసారి గ్లాసు అందించబోయాడు కిషోర్. బాస్ మంచి నిద్ర మత్తులో కలిసిన నిషాలో పడి వున్నాడు. కిషోర్ మెదడులో ఆలోచన మెరిసింది. అతని ముఖం ప్రశాంతమయింది. బైనాకులరు తీసి చుట్టూ చూశాడు. తనకు దగ్గరలో మానవమాత్రుడు లేడు. ఆ విగ్రహం మాత్రం విసుగు, విరామం లేకుండా తన చూపుడు వ్రేలును సముద్రం వైపు చూపుతూనే వుంది. కిషోర్‌కు ఎందుకో ధైర్యం వచ్చింది. సంచిలో నుండి రివాల్వరు తూటాలు తీశాడు. రివాల్వరు నింపుకున్నాడు. తాను ఒక్క నిమిషం తరువాత బాస్ అయిపోతాడు. బాస్‌కున్న డబ్బు, బంగారం అంతా తనదే. బాస్ తలకు రివాల్వరు గురి పెట్టాడు. అతని తల రివాల్వరుకు ఒక మీటరు కన్నా ఎక్కువ దూరం లేదు. రివాల్వరు ఢాం, ఢాం అని రెండుసార్లు ప్రేలింది. బాస్ కిక్కురుమనకుండా అలానే పడి వున్నాడు. కాని బాస్ తల మాత్రం, కుండ బద్దలు కొట్టినట్లు పగిలిపోయింది. ఆ చెదరిన అవశేషాలు చూడటానికి చాలా వికృతంగా వున్నాయి. కిషోర్ కూడా, ఆ దృశ్యాన్ని చూడలేక పోయాడు. వెంటనే సంచి భుజానికి తగించుకొని, ఆ కొండలకు అడ్డంగా నడవడం మొదలుపెట్టాడు. అతడు ఒక అరకిలో మీటరు అలా నడిచాడో లేదో.

'ఏయ్, ఆగు అడుగు ముందుకు వేశావా కాలుస్తా' ఆ మాటలు వచ్చిన వైపు చూస్తూనే కిషోర్ రివాల్వరు గురిపెట్టి కాల్చాడు. రెండవ వైపు నుంచి సమాధానం లేదు. కిషోర్ అక్కడ నుంచి పరుగెత్తడం మొదలెట్టాడు. మళ్ళీ కొంతదూరం వెళ్ళేసరికి తిరిగి అదే శబ్దం.

'ఆగు, ఎక్కడికి పోతావ్, నీ రివాల్వరు నన్నేమి చేయలేదు.'

కిషోర్ తిరిగి ఆ శబ్దం వచ్చినవైపు గుండ్లవర్షం కురిపించాడు. కాని ప్రయోజనం లేకపోయింది. కిషోర్ తన భుజాన వున్న సంచిలోనుంచి తూటాలు తీయబోయేటి

వెన్ పొంగల్

కావలసినవస్తువులు	కొలతలు (8 మందికి)
బియ్యం.	—450 గ్రా.
పెసరపప్పు	—225 గ్రా.
జీడిపప్పు	—30 గ్రా.
మిరియాలు	—10 గ్రా.
అల్లం	—10 గ్రా.
నెయ్యి	—115 గ్రా.
ఉప్పు	—కావలసినంత.
నీళ్ళు,	—లీటరు.
జీలకర్ర	—3 గ్రా.

పద్ధతి:— నెయ్యికాచి, జీడిపప్పు దోరగా వేయించి తీయాలి. మిరియాలు జీలకర్ర వేయించాలి. పప్పువేసి కొద్దిగా వేయించి తీయాలి, నీళ్ళుకాచి. కడిగిన బియ్యం అందులో వేయాలి. వేయించిన పప్పువేయాలి. సగం ఉడికాక, జీడిపప్పు మిగిలిన నెయ్యి అందులో వెయ్యాలి. కొబ్బరికాయ పచ్చడితో వడ్డించాలి. ఇది తమిళుల స్పెషల్.

కారట్ హల్వా

కావలసినవి.	కొలతలు (4గురికి)
కారట్‌లు	—220 గ్రా.
పంచదార	—115 గ్రా.
పాలు.	—120 మి. లీ.
నెయ్యి	—55 గ్రా.
ఎండుద్రాక్ష జీడిపప్పు.	—20 గ్రా.
ఏలకులు	—కొద్దిగా.

కేరట్‌దుంపలు తొక్కలుతీసి, కడిగి తరగాలి. ఇది పాలలోవేసి ఉడకబెట్టాలి. పాలు ఆవిరి అయిపోగానే నెయ్యిపోసి, ఉడక నివ్వాలి. పంచదార, పళ్ళు, ఏలకులు వెయ్యాలి.

—కూ. రా.

ప్రయత్నించాడు. తీసిన తూటాలతో ఒక్కటిమాత్రం రివాల్వరులో నింపగలిగాడు. ఆ రివాల్వరును ఎవరో ఒక తన్ను తన్నారు. రివాల్వరు దూరంగా పడిపోయింది.

కాని ఆలస్యం జరిగిపోయింది. రివాల్వరు ప్రేలింది. ఎవరిని ఎవరు కాల్చారో అర్థం కాలేదు, ఒక్కనిమిషం తరువాత కిషోర్ రక్తపుమడుగులోపడి కొట్టుకుంటున్నాడు.

రివాల్వరును తన్నిన వ్యక్తి అతనివద్దకు పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ఏదనా ప్రథమ చికిత్సగాని, ఉపచారంగాని చేద్దామని చూస్తున్నాడు. కిషోర్ అంత బాధలో

కూడా నెమ్మదిగా కళ్ళెత్తి ఆ వచ్చిన వ్యక్తిని చూచాడు.

'మీరా స్వామిజీ వింత ఆశ్చర్యం. మీరు కూడా దొంగలు, హంతకులేనా.'

అతడు అలా అంటుంటే స్వామిజీ, అతడి గాయాన్ని చూడసాగాడు గుండు, అతని గుండె ప్రక్కగా దూసుకొనిపోయింది. చాలా ప్రమాదం.

'ఎందుకలా కాల్చుకున్నావు'

'నేనా స్వామి. నేను కాదు, నా పాపం అలా నన్ను కాల్చింది. ఆ రివాల్వరులో ఒకేఒకతోట పెట్టగలిగాను. దాంతో ఇక ఆలస్యం చేయటానికి వీలులేక రివాల్వరును మీకు గురిచూచాను. కాని మీరు కొట్టిన దెబ్బకు, రివాల్వరు గురి తప్పటమేగాక పేలిపోయింది. ఆ గుండు నన్ను బలి గొంది. ఇంక వింతోకాలం పట్టదు. ఇది నాకు తగిన శాస్తే. ఆ పాడుముండా కొడుకు బాస్‌కు సహాయం చెయ్యటంలో ఎన్ని విగ్రహాలు దొంగిలించి అమ్మివేశామో. ఎన్ని హత్యలు చేశామో. ఆఖరుకు అమాయకుడైన వామనరావును కూడా వెనుకనుంచి కాల్చి చంపాను. ఆపాపం వూరికే పోతుందా.'

స్వామీజీ అతన్ని మాట్లాడవద్దని సైగ చేసి, అతని కమండలంలో వున్న నీళ్ళు అతని గొంతులో పోశాడు అతడు ఏదో గొణుగుతున్నాడు. స్వామీజీ అతన్ని ఏదో అడుగుతున్నాడు అతడు నెమ్మదిగా సమాధానం చెప్తున్నాడు. ఆ భాష వారిద్దరికే అర్థం కావంసిందేగాని, ఇతరులు దగ్గరగా వున్నా వినిపించేటట్లు లేదు అలా కొంత సేపయిన తరువాత కిషోర్ దేహం చల్లబడిపోయింది. మాటా పలుకూ ఆగిపోయాయి. స్వామీజీ పెద్దగా ఈల వేశారు ఎక్కడనుంచి వచ్చారో నలుగురు సాధువులు పరుగెత్తుకుంటూ వచ్చారు.

'ఈతని మృతదేహాన్ని, ఎవరి సహాయానన్నా. పోలీసుస్టేషనుకు చేర్చండి. దాంతో పాటు ఈ ఉత్తరం కూడా వుంటే, పోలీసు వారికి విషయాలు తెలుస్తవి.'

అంటూ తన జోబిలోనుంచి ఒక తెల్ల కాగితాల ప్యాడుతీసి దానిపైన చకచకా నాలుగు పంక్తుల వ్రాసి—వారికిచ్చేసి తాను ఎటో వెళ్ళిపోయాడు.

(ఇంకా వుంది)

కలిని నశింపజేసే విధానం



బులుసు వేంకటరమణయ్య — ధర్మపథం

'కలి' అని ఉచ్చరించేసరికి 'కలి పురుషుడు' స్ఫురణకు వస్తాడు. ఈ పదానికి కలియుగమనీ, కలహమనీ కూడా అర్థాలున్నవి. ఈ మూడు అర్థాలకీ కొంత సంబంధం ఉన్నది.

'కలి' చెడ్డనే తెలియజేస్తుంది. కలియుగం పాపభూయిష్ఠమనీ, చెడుపునే చేకూరుస్తుందనీ అందరూ అనుకుంటారు. అయితే 'కలి'తో సంబంధం లేకుండా న్యాయంగా ప్రవర్తిస్తే దాన్ని తప్పుకొనవచ్చును. దుర్బలహృదయంగల మానవమాత్రులకు 'కలి'ని తప్పించుకోవడం సులభం కాదు.

అయినా ఒక సులభమార్గం ఉన్నది—

'కర్కోటకస్య నాగస్య
దమయంత్యా నలస్య చ,
ఋతుపర్ణస్య రాజర్షేః
కీర్తనం కలినాశనమ్.'

నాగులలో ఉత్తముడైన కర్కోటకుని, దమయంతీదేవిని, నలమహారాజును, రాజర్షి అయిన ఋతుపర్ణుని స్మరించినట్లయితే కలి నశిస్తుందని దీని అర్థం. అంటే— ఉత్తములైన వారిని స్మరిస్తే వారి ఉత్తమగుణాలు తలపునకు వస్తాయి కాబట్టి, ఆ విధంగానే ప్రవర్తించాలనే సంకల్పం కలుగుతుంది కాని, మనస్సు చెడు విషయాలపై ప్రవర్తించదని అభిప్రాయం. ఈ అభిప్రాయాన్నే గ్రహించాలి: తప్ప పేరును స్మరించినంతమాత్రాన కలి నశిస్తుందని అనుకోరాదు.

కర్కోటకుడు నాగులలో ఉత్తముడు. అతడు నలమహారాజును కాటువేసి వికార రూపాన్ని కల్పించాడు. అవసరమైనప్పుడు నిజరూపం కలిగేటట్లు అనుగ్రహించాడు. వికార రూపాన్ని పొందకపోతే నలుడు ఋతుపర్ణునిదగ్గర సేవకుడుగా చేరడం సాధ్యం కాదు. నిజరూపంతో చేరితే వంశానికే అప్రతిష్ఠ.

కర్కోటకుడు తల్లి ఆజ్ఞను నెరవేర్చి, ఉచ్చైఃశ్రవం తోకను చుట్టుకొని తన మాతృభక్తిని వెల్లడించాడు కూడా.

దమయంతి ఉత్తమ పతివ్రత. అడవుల పాలైన భర్తతో కష్టాలు పడడానికే నిశ్చయించిందిగాని, పుట్టింట్లో ఉండడానికి సమ్మతించలేదు. చేదిరాజాంతఃపురంలో సైరంధ్రిగా ఉన్నదే గాని, తన సంగతి చెప్పుకోలేదు.

నలుడున్నూ అజ్ఞాతంగా ఉండడానికే నిశ్చయించుకొన్నాడు. సహనానికి పెట్టినది పేరు. తన భార్య స్వయంవరానికి వెళుతున్న రాజునకు తాను రథం నడిపి తీసుకు రావడమే అతని సహనానికి దృష్టాంతం.

ఋతుపర్ణుడు మహాప్రతిభాశాలి. నలుడు వికృతాకారంతో తన్ను సేవించడం ఆయన గ్రహించాడు. నల, దమయంతుల పునస్సమాగమమే ఆయన కోరినది. లేకపోతే— అట్టిరాజు— జీవద్భర్తృకయొక్క ద్వితీయ స్వయంవరానికి తగుమనని వస్తాడా? తనతో నలుణ్ణి తీసుకు వస్తాడా?

ఇట్టి ఉత్తములు కాబట్టే వారి కీర్తనమువల్ల కలి నశిస్తుందని చెప్పడం జరిగింది.

మహిళలు విద్యను విద్యకోసమే నేర్వాలి

ఒక విషయాన్ని విజ్ఞానదాయకంగా చెప్పడం వేరు. దానిపట్ల మన నమ్మకాల కనుకూలంగా యెదుటివార్ని మార్చడానికి చెప్పడం వేరు. డా. చిరంజీవినీ కుమారిగారు 'సుఖమయ కుటుంబ...' (2–2–73) వ్యాసంలో రెండవ రకానికి చెందిన శైలి వాడటం శోచనీయం. ఏదో పేరా చదువుతే సోవియట్ మహిళల ప్రగతిని ప్రస్తావించడంకంటె సోవియట్ మార్క్సిజాన్ని ప్రస్తుతించే పరోక్ష లక్ష్యం ప్రస్ఫుటవౌతుంది.

సమిష్టివాదం స్వీకరించటాని కనుకూల మానసిక వ్యవస్థ మంచినేర్పుతో మన నాయకులు యిండ్యాస్ చేశారు. మనకా అభ్యుదయం త్వరలోనే జరుగనుంది. ఫలితం ప్రజాక్షేమమో పదవీక్షేమమో యిప్పట్లో చెప్పడం కష్టం. కాని పీడిత ప్రజల హక్కుల్ని ప్రకటించే నెపంతో పాలకులు నియంతలుగా మారే ప్రమాదం వుంది. ఇలాంటి విధానాన్ని విద్యావంతులు సమర్థిస్తారని అనుకోలేదు.

తినడానికి జనం తక్కువ, పండించే మరలెక్కువ, అందుకు తగ్గ సమిష్టి క్షేత్రాలుండికూడా యేభై యేళ్లలో రష్యాలాంటి సోషలిస్టుదేశాలు తిండిగింజల కొరత తీర్చుకోలేక పోయిందంటే అదెలాంటి ప్రగతో నా కర్థం కావటంలేదు!

మహిళల శక్తిని వుపయోగించుకోవడం జరగాలని రష్యాలాంటి సోషలిస్టుదేశాలు శాసిస్తాయేమో! కాని బుద్ధి స్వతంత్రం వున్న దేశాల్లో మహిళలు తమ శక్తి సామర్థ్యాలను అన్ని రంగాల్లో ప్రదర్శించటానిక్కావలసిన అవకాశం స్వేచ్ఛవున్నాయి. మహిళలు మానసిక విముక్తి (అందుక్కావలసిన నైతికశక్తికూడా) పొందిన రష్యాలాంటి దేశాల్లో పిచ్చాసుపత్రులు, జైళ్లు, స్ట్రీకెట్ పోలీసు దళాలెందుకుండాలి? ఇటీవల జగమెరిగిన వొక నర్తకి వొక కవయిత్రి మరి కొందరలాంటి మహిళలు రష్యావదలి స్వతంత్రంగల దేశాల్లో తలదాచుకోడాని కెందుకు పోవాలి? అలాంటి మహిళల సృజనాత్మక శక్తులెందుకు నిర్లక్ష్యం చేస్తోందాదేశం? అంచేత మహిళల వుద్యమాదులకు కారణం ఆ దేశాల్లో వారి శక్తులుపయోగింపబడక పోవడమని అలా లేనిదేశాల్లో మహిళల శక్తులుపయోగించ బడతున్నాయని అనడం తెల్లని వన్నీ పాలు నల్లని వన్నీనీరు అన్న పిడివాదం లాంటిది. తృప్తి పశులక్షణం, అసంతృప్తి మనిషి లక్షణం. ఈ లక్షణం బుద్ధి స్వతంత్రం వున్న దేశాల్లో వుద్యమాదుల రూపం ధరిస్తే రష్యాలాంటి దేశాల్లో ప్రాణ సంకటమైన పలాయనాదుల రూపం ధరిస్తోంది.

మనిషి, మనిషి సాధించిన ప్రగతిలో మహత్తరమైన మహిళల శక్తి కనబడుతుంది. ఆ శక్తికి రాజ్యాలేలడం రాకెట్లు నడపడం మాత్రమే సరిహద్దులు కావు. కర్మక్షేత్రంలో దిన దినానికి దిగజారిపోతున్న విద్యయొక్క విలువను పునరుద్ధరించే పనికి కావలసిన సమయ సహనాలిప్పుడు మహిళల్లోనే వున్నాయి. మహిళలు విద్యను విద్యకోసమే నేర్వాలి. అలాంటివార్ని అమ్మగా పొందే అదృష్టం ప్రతి పాపకు ప్రతి బాబుకు కలగాలి. బడిలో నేర్పని పాఠాలు అమ్మవొడిలో నేర్వాలి. ప్రతి యిల్లు విశ్వవిద్యాలయంగా మారాలి. అప్పుడు ప్రగతి మరింత వెతుక్కుంటూ వస్తుంది. పాపకుపట్టే పాల కృతిమం చేసుకోవచ్చు. అది మహిళల ఇష్టం. కాని అమ్మ అనురాగాన్నిమాత్రం కృత్రిమం చేయమనకండి. కిరాయి కొచ్చే తల్లులకోసం పిల్లల్నికనే యంత్రాలుగా మారిపోవద్దు. అది ప్రగతిలో మనిషికి సంక్రమించిన దుర్గతే అవుతుంది.

కామంలో పుట్టింది సంఘం. క్షమ దమాదులు క్రోధాదులు దానికి దివారాత్రుల్లాంటివి. వీటి మధ్య వివేకమనే కక్షలో సంఘాన్ని వుంచి గిరగిరా తిప్పేది మనసు. మనసు బూజుపట్టకుండా మేధావులందిచ్చే ఆకురాళ్లవంటి భావాలతో మెరుగు పెడుతుండాలి. ఈ మెరుగే సంస్కృతి. అందరి హృదయాల్లో మెరిసే సంస్కృతి ఏకమై జాతీయశీలం అఖండజ్యోతిగ ప్రజ్వలిస్తుంది. ఆ వెలుగులో సువిశాలం అనంతం అయిన ప్రగతిపథంలో నిర్భయంగా ప్రయాణం చేస్తుంది సంఘం. అలా ప్రయాణం చేయటానికి రాజకీయ విధానాలు శకటాల్లాంటివి. ఏదో వొక లోపం యిబ్బంది వుండటంవల్ల యింతవరకే వొక్క రాజకీయ శకటం కూడా సర్వశ్రేష్ఠమైనదిగా పరిగణింపబడలేదు. అలాంటి వాటిలో రష్యా తయారుచేసిన సమిష్టివాద శకటం వొకటి. అధునాతనమైందే కాని బుద్ధి స్వతంత్రం అన్న కిటికీలు లేకుండా పార్సెల్‌బండిలా ప్రయాణాని కిబ్బందిగా వుంటుంది. ఆ వొక్క యిబ్బంది తొలగిస్తే సమిష్టివాదం సర్వశ్రేష్ఠమైన రాజకీయ శకటంగా రూపొందుతుందనడంలో సందేహం లేదు.

'ధన్యురాల్ని! మనిషిగా పుట్టాను. నా పేరు స్వేచ్ఛ. నా ఆయుర్దాయం నూరేళ్లు. నూరేళ్లలో నూరు వసంతాలు చూట్టానికి నాకో చిన్న నందనవనం చాలు; మొక్కమోడులేని పెద్ద పచ్చిక బీడు కాదు. తినేది సంగటే కావచ్చు. షడ్రసోపేతమే కావచ్చు. కట్టేది చింకిపాతే కావచ్చు చీనాంబరమే కావచ్చు. వుండేది పూరిల్లే కావచ్చు భూరిభవనమే కావచ్చు. అవి నేనీ ప్రపంచంలో సంపాదించుకున్నవి. అవసరమైతే తోటివారిలో పంచుకుంటాను. దోచుకుంటే వూరుకుంటాను. కాని అమ్మ కడుపులో బ్రహ్మ నాకిచ్చిన ఆయువులో ప్రతిలిప్త వుపయోగించే అధికారం స్వేచ్ఛగా అనుభవించే హక్కుల్ని దోచుకుంది ఎవరైనా ప్రయత్నిస్తే మాత్రం ప్రాణాలు పోయేంతవరకు ప్రతిఘటిస్తాను' అంటుంది స్వేచ్ఛాదేవి— నా ఆరాధ్యదైవం.

—ఆర్.యస్.యన్. పట్నాయక్



వంతెన

ఉషారాణి భాటియా

పార్వతి లోపలికి వస్తూనే హాలులో పెద్ద సంచలనం కలిగింది. వెయ్యి కళ్ళు తనమీద ఫోకస్ అయినట్లయి తడబడింది పార్వతి. కొందరు మెడలు అతి ప్రయత్నంమీద తిప్పి, సూటిగా పార్వతిని చూస్తున్నారు. కొందరు చూసీచూడనట్లు ముఖాలు పక్కకి తిప్పుకుని, మళ్లీ ఆమె వైపే తిరుగుతున్నారు. కొందరి కనుబొమలు అనుమానంతో ముడిపడ్డాయి. కొందరి కనుబొమలు ఆశ్చర్యంతో పైపైకి వెళుతున్నాయి.

ఆ పెద్ద హాలునిండా చాలామంది పేరంటాళ్లే వున్నారు. నడుములు ఒంగి కూర్చోలేక ఆపసోపాలు పడుతున్న మున అమ్మ దగ్గిరనుంచి తల్లి ఒళ్లో కేరుమంటున్న పసిపాపవరకూ ఎందరో. ఎదురుగావున్న చిన్న వేదికమీద ఒకమ్మాయి వీణ వాయిస్తోంది. ఆ అమ్మాయి గొడవ ఎవరికీ పట్టినట్లు లేదు. పేరంటాళ్ళు తమలో తాము ఖబుర్లాడుకుంటున్నారు. నవ్వుకుంటున్నారు. గట్టిగానే ఛలోక్తులాడుకుంటున్నారు.

పాదం మోపేందుకు చోటులేని ఆ పేరంటాళ్ల మధ్యకి అడుగుపెట్టింది పార్వతి. మల్లెపూలుచుట్టిన పెద్ద ముడి, నారింజరంగు తెల్ల పట్టుచీర, మెళ్లో ముత్యాల దండ, చేతికి వాచీ — ముప్ఫయో పడిలో అడుగుపెడుతున్న పార్వతి వయసుకి మించిన అలంకరణ ఏమీ చేసుకోలేదు. కానీ అధునాతనంగా మటుకు వుంది. ఇటు కొంగులాగారెవరో. అటు కుచ్చెళ్ళు పట్టుకు గుంజారెవరో. తన పాత స్నేహితురాళ్ళ కోసరం అప్పుల కోసరం వెతుకుతున్న పార్వతి కళ్ళు సంబరంతో అల్లల్లాడుతున్నాయి.

'అదిగో సంకజం! అరె! అటు ఉంది మహాలక్ష్మి. సుందరమ్మగారదిగో అమ్మాల! ఆ నీలం పట్టుచీరలో వున్నదే సుగుణ.'

పార్వతి కళ్ళు ఎంత తొందరగా నాలుగు పక్కలా చూస్తున్నాయో, హృదయం అంతవేగంగా గంతులు వేస్తోంది.

'ఇటుకేసి కూడా ఓసారి చూడవమ్మా! మెడ నొప్పెట్టదులే!' అంటూ చెయ్యిలాగి కూర్చోబెట్టింది చిన్ననాటి నెచ్చెలి సుగుణ. పార్వతి ధబేల్న కింద కూలబడి, చీర నలగకుండా రెండువైపులా పోగుచేసుకు కూర్చుంది. తల మీదుగా ఫాను లేదేమో చెమటలు కారి పోతున్నాయి. పర్సులోంచి రుమాలు తీసి నుదురు తుడుచుకుంది. దూరదూరంగా వున్న స్నేహితుల్ని, పరిచయస్థుల్ని చూసి నవ్వుతూ చెయ్యి వూపింది.

'ఏమమ్మోయ్. బొంబాయి వెళ్లాక కొంత నల్లబడనట్లున్నావే?'

ఓ ముసలమ్మ ఒంగి పార్వతి ముఖంలోకి చూసింది. 'నేనేమైనా అందాల పోటీకి వెళ్ళాలా?' అనడుగుదా మనుకుంది పార్వతి. కానీ చిరునవ్వే సమాధానంగా వూరుకుంది!

'ఇంకా వుద్యోగం చేస్తున్నావా? ప్రమోషనేమయినా వచ్చిందా?'

సినిమాతారతో కూడుకున్న ఆ ముఖం వైపు ఇబ్బందిగా చూసింది పార్వతి. తను వుద్యోగం చేస్తోందన్న తృప్తి, ఆత్మ విశ్వాసం ఎవరో తుడిచేసినట్లయింది ఆ ఒక్కమాటలో.

'ఆ! ఏదో గవర్నమెంటు వుద్యోగం. అంత త్వరగా పైకిపోవటం కుదరదే' అంటూ తప్పుచేసిన దానల్లే ముఖం పెట్టింది పార్వతి.

'పోనీ ఏదైనా ప్రయివేటు కంపెనీలో ప్రయత్నించక పోయావా? బొంబాయిలో చాలామందే చేస్తున్నారటగా?'

దూరంగా కూర్చున్న సుందరమ్మ లేస్తూ దగ్గిరికే వచ్చింది. తన సంపాదన లేకుంటే ఇల్లంతా పస్తుండేట్లు, ఆ మాటలు వింటుంటే చిరాకేసింది పార్వతికి.

'ఇంతకీ కొడుకు పట్టాలకలవయా పుట్టే!' చిన్న తనంలో తనతో ఆడిపాడి, ప్రాణమిచ్చిన సుగుణ కళ్లల్లో ఏం చూసి ఉలిక్కిపడింది పార్వతి.

'ఇంట్లో ఎవరు? అత్తగారేనా? పిల్లవాడిని చూసుకునే దావిడేనా?'

తన చేతులు పట్టుకుని ఆప్యాయంగా దగ్గిరికి తీసుకోవలసిన లత దూరంనుంచే గంభీరంగా అడుగుతున్న ఆ ప్రశ్నకి విస్తుపోతూ చూసింది పార్వతి.

'బొంబాయి ప్యాషన్లు బాగా ఒంటపట్టినట్లున్నాయే? ఈ పర్సు అక్కడిదేనా?'

తన చేతిలోని పర్సు చాలా కులాగ్గా లాగి అటూ ఇటూ చూస్తున్న అరవింద, ఈమధ్య స్టేట్సుకూడా వెళ్లివచ్చిందేమో! ఈ పర్సులో ఏ క్రొత్త ప్రపంచం కనపడుతోంది చెప్మా? అని విస్తుపోయింది పార్వతి.

'మొన్న స్కూలు వార్షిక పత్రిక దేంట్లోనో పేరు చూశాను బొంబాయి తెలుగువాళ్ల కార్యక్రమాల్లో బాగానే పాల్గొంటున్నట్లున్నావ్? ఉద్యోగం, సంసారం ఈ గొడవలో నీటికి తీరుబడి చేసుకుంటున్న నిన్ను మెచ్చుకోవాలి సుమా?'

వీపుమీద బలంగా చెయ్యి పడటంతో వెనక్కి తిరిగింది పార్వతి. కామాక్షమ్మ మాట ఎవరూ మెచ్చుకోలుగా వినటం లేదు. పైపెచ్చు,

'ఏ పత్రికలో? ఏప్పుడేమిటి?' అంటూ ఒకర్ని వొకరు పట్టుకుని ఆత్రంగా అడుగుతున్నారు— అదేదో వీక్షన్ ఫలితాల్లాగ.

'ఆ అదృష్టం అందరికీ వుండద్దు అండీ! మా అలివేలు చూడండి! ఢిల్లీ వెళ్లిన సంవత్సరం పాటు అందరూ దాని చుట్టూతా తిరిగారు ప్రతి దానికీ. ఆ చలికి పడక జబ్బుచేసి, వుద్యోగం రాజీనామా యిచ్చి తిరిగి వచ్చేసింది. అటు అల్లుడికా ట్రాన్సఫరు దొరకటం లేదు. ఇటు పిల్లల చదువా పాడయి పూరుకుంది.'

అందరూ ఆ గొంతు వచ్చిన వైపు తిరిగి శ్రద్ధగా తలలు వూగిస్తున్నారు.

* * *

పెళ్లయిన సంవత్సరానికే తండ్రికి కలకత్తా బదిలీ అవటంతో, పుట్టి పెరిగిన హైదరాబాదుకి రావటం మళ్ళీ పడలేదు పార్వతికి. అయిదేళ్ళకి యిలా రావటం; వస్తూనే శ్రావణ మంగళవారం నోముల కంటూ పేరంటానికి పరుగెత్తటం జరిగింది. తన కళ్ళల్లోకి ఆపేక్షగా చూసే చూపులు, స్పర్శ, చలోక్తులు, హాయి; జ్ఞాపకాలు—దూది పింజల్లా ఎగిరిపోయి; ఆ స్థానంలో తన వంక కొత్తగా, పరిశీలనగా, విమర్శనాత్మకంగా చూస్తున్న పరిసరాల్ని బాధతో చూస్తోంది పార్వతి.

వాళ్లకిప్పుడు కావలసింది పార్వతి కాదు. పార్వతి మొగుడి జీతం. కారు మోడల్, టెలిఫోను సౌకర్యం. అత్తగారి ఆదరణ అంచనా. పిల్లవాడి తెలివితేటల కొలతలు. తన చేతినున్న గాజుల బరువు. నెక్లెసు వయస్సు. పార్వతి పార్వతిగా ఎవరికీ అక్కరలేదు. తనని ఒక వ్యక్తిగా, స్నేహితురాలిగా, చిరివయస్సు రాలిగా ఎవరూ జ్ఞాపకం పెట్టుకోలేదు. ప్చ్! పార్వతి గుండెల్లో ఏదో బలంగా గుచ్చుకున్నట్లయింది.

* * *

అమె తాంబూలం పుచ్చుకుని లేచే టప్పటికి దీపాలు పెట్టారు. కొబ్బరికాయ, అరటిపళ్ళు, శనగలు ఒకచేతో, మరో చేతో చీరకుచ్చెళ్లు పైకిపట్టుకుంటున్న పార్వతికి గడపదగ్గిర ఆ ఇంటి ఇల్లాలి గొంతు వెనకగా వినిపించింది.

'రేపెప్పుడైనా తీరుబడిగా రావమ్మా! కబుర్లు చెప్పుకుందాం; ముందుగా టెలిఫోనుచేసి మరీ రా'

'అలాగేనండీ'

పార్వతి వెనక్కి తిరిగయినా చూడకుండా ముందుకడుగు వేసింది. కాలినడకన ఇంటిముఖం పట్టింది. తలవొంచుకు నడుస్తున్న పార్వతి ముఖాన్ని నిరాశ, దిగులు ఆవరించాయి అడుగులు బరువుగా పడుతున్నాయి. హృదయం రాయిలా అచేతనంగా వుంది. ఆమెకా అనుభవం అదో కొత్త రకమైనది. జీవితంలో ఎదురు చూడనిది.

'పార్వతమ్మా! ఓ పార్వతమ్మా!'

తనని కాదేమో అనుకుంటూనే తలెత్తింది పార్వతి.

రెండడుగుల దూరంలో నిలుచునుంది ఓ ఆడమనిషి. ఆ చిరుచీకట్లో కాస్త పరిశీలనగా చూస్తేగాని గుర్తురాలేదు.

'ఏం బాగున్నావా?'

ఓక్షణం ఆగి ప్రశ్నించింది పార్వతి.

'అదేంటమ్మా! గుర్తులేనా? అంత దూరంనుంచి చూసి పరుగెత్తుకొచ్చాను.'

తాయారమ్మ వగరుస్తోంది.

'ఎంత మారిపోయారమ్మా! ఇక్కడున్నరూపేలేదు,'

పార్వతి భుజంమీద చెయ్యిపడింది. ఆ చెయ్యి తడిగా, చల్లగావుంది. దగ్గిరగా వచ్చిన చీర ముతకకంపు కొడుతోంది. తాయారమ్మపళ్లు తాంబూలంతో గార పట్టి, ఆ చీకట్లో మరింత నల్లగా వున్నాయి. పార్వతి కొంగుతీసుకుని ముక్కుకి అడ్డం పెట్టుకుంటూ ఒక్కడుగు వెనక్కి వేసింది. అసలే మనసు గజిబిజిగావుందేమో, మహ విసుగొచ్చేసింది.

ఇంతలో తాయారమ్మ చేతిలోని పాల గిన్నె కింద పెట్టి, రెండుచేతులతో పార్వతిని కౌగలించుకుంది. ఎదురుచూడని ఈ స్వాగతానికి పార్వతి అదిరిపడింది. మెల్లిగా ఆ పట్టునుండి విడిపించుకుంది. రోడ్డుమీద ఎవరైనా చూస్తున్నారేమోనని పిగ్గుగా చుట్టూ కలియజూసింది.

తాయారమ్మ ఈసారి పార్వతి రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుంది. పార్వతి తెల్లబోతూ ఆమె వంకచూసింది. వీధి దీపం వెలుతురులో స్పష్టంగా కనపడుతున్నాయి తాయారమ్మ కళ్లల్లో మెరుస్తున్న నీళ్లు. అవి ఆ పేదరాలి

కళ్లల్లో పొంగి, ఆగకుండా చెంపలమీదుగా కిందికి జారుతున్నాయి. తాయారమ్మకి తెలీదు—వాటిని తుడిచేసుకోవాలని. తను పట్టుకున్న చేతులకి పౌడరు, సెంటువున్నాయని. తను కావలించుకున్న ఈ స్త్రీ హృదయంలో నిప్పులు చెరుగుతున్నాయని.

'అమ్మా వాళ్లంతా బాగున్నారా? ఎన్నాళ్లో అయినట్లుంది చూసి. పోనీలే నిన్ను చూశా. నా కళ్లు చల్లగున్నాయి. ఆ రోజులేమో, ఆ యిల్లేమో — మళ్లీ

వంతెన

చూడలేదు...అట్లా...వస్తానమ్మా.'

చీకట్లో కలిసిపోతున్న ఆ పాలమనిషి ఒంక అలా చూస్తూండిపోయింది పార్వతి.

* * *

తను ఎవరికీ పార్వతిగా ఇక అక్కర లేదు, ఎంతో దూరమయిపోయింది అని వాపోతున్న తనకి ఇంత దగ్గిరగా అనిపిస్తోందేం ఈ తాయారమ్మ? ఎందుచేత? తనకి ఈమెకీ మధ్య లోతైన సముద్రం ప్రవహించటంలేదా? అందులో — హోదా, తారతమ్యాలు, పోటీభయం, అనుమానం, వోర్వలేని తనం — అనే సుడిగుండాలు లేకపోవటం చేతనా? ఈ సముద్రాన్ని దాటేందుకు ఒక వంతెన కావాలా? ఆత్మసంస్కారమనే ఈ వంతెన తాయారమ్మ దాటగలిగిందా? ప్రస్తుతపు మన సమాజంలో ఈ సుడిగుండాలు, సముద్రాలు తప్పవా? తాయారమ్మ వీటిని ఎలా జయించింది? ఏమో! నవ్వు శక్యం కాకుండా వుంది! కేవలం ఒక పాలమనిషి పలకరించినంతమాత్రాన మురిసిపోయేటంత దిగజారిపోయిందా తను? ఛీ! ఛీ! తన కివాళ ఏమయింది?

* * *

మనసు దిటవుచేసుకుంటూ ఇంట్లో అడుగు పెట్టింది పార్వతి.

'ఏమే! అందర్నీ చూసివచ్చావా? కడుపు నిండిపోయిందా?'


పిన్నిమాట వినిపించుకోకుండా లోపలికి వెళ్లింది. తల ముడివిప్పుకుంటున్న పార్వతికి వంటింట్లో మాటలు వినపడుతున్నాయి.

'ఇవాళ బజార్లో లక్ష్మి కనపడింది. అదే! పూర్వం మనింట్లో పాలుపోసే తాయారమ్మ ఒదిన. రెండునెలలయిందిట తాయారమ్మ మొగుడుపోయి, పాల వ్యాపారం పడిపోయి పిల్లలతో నానా అవస్థ పడుతోందిట.'

'ఆ పోనిద్దురూ పిన్నిగారూ! వీళ్ల కష్టాలు, సమస్యలు అలా ఒకటి కాక పోతే ఒకటి పుట్టుకొస్తూనే వుంటాయి. ఏముంది! మీరు వూళ్లో దిగారని తెలిసి లక్ష్మి ఈ మాటలు మోసుకొచ్చింది. రేపొద్దున్నే తయారవుతుంది. ఏ వైనా నాలుగు డబ్బు లివ్వమని.'

పార్వతి స్థాణువులా నిలబడిపోయింది. ఆమె కళ్లముందు ఇప్పుడు తాయారమ్మ రూపం, ఆమె కళ్లల్లో ప్రవహించిన నీళ్లు లేవు తన ప్రవర్తన, తనలో రేగిన ఆలోచనలకి విడియం విచారం లేవు.

మానవత్వంమీద అపారమైన నమ్మకం, ఆశ ఆమె హృదయంలో మెదులుతున్నాయి. ఆ ఆశ్చర్యంనుంచే ఆనందం వెల్లివిరిసి ముఖం విప్పారింది. ●



Interpub/GSC/5/72R Tel

ప్రశ్నలు

...కె. రామలక్ష్మి...

జి. ఎస్. ఆర్, గుంటూరు.

ముల్కీ గొడవలపై శ్రీ శేషశివగారడిగిన ప్రశ్నకు నేను సమైక్యవాదినని సమాధానం యిచ్చారు. మీ అభిప్రాయాన్ని నిస్సంకోచంగా ప్రకటించినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. కాని పరిస్థితులను అవగాహన చేసుకోకుండా మీరు మీ అభిప్రాయాన్ని మార్చుకోలేనందుకు చింతిస్తున్నాను.

పరిస్థితులు అవగాహన చేసుకోక కాదు. పరిస్థితుల కనుగుణంగా ఉద్యమాన్ని వక్రమార్గాన్ని పట్టినందుకు చింతించాలి. ముల్కీ రూల్సు రూపుమాపేందుకు ఉద్యమం లేవదీసి దాన్నొక విజయవంతమైన ముగింపుకు తేకుండా యీ ఉద్యమంలో నమ్మకం ఎలా కుదురుతుంది. తీరా రాష్ట్రం వచ్చాక— ఆ యా ప్రాంతాలకి— రాష్ట్రంలోనే మినహాయింపులు, అవకాశవకాశలు—పట్టింపులు జెపరింపులు వుండవని ఏమిటి గ్యారంటీ? ముందు రాజధానికోసం దెబ్బలాడుకుంటారు. తరువాత అధికారంకోసం....యిక అది అంతే....మళ్లీ సామాన్యుని జీవితం గొర్రెతోకలా అంతే. లేకుంటే యీ నాయకులు ధైర్యంగా రిఫరెండమ్ ఎందుకు కోరరు? ఎన్నికలు ఎందుకు కోరరు? జేరం చెంచడానికి కుదరదనేగా?

జె. టి. ఎన్, తెనాలి.

నేను మీ యింటికి అతిథిగా వస్తే?

యు ఆర్ వెల్‌కమ్. దో యు ఆర్ లేట్!

పి. ఎమ్, తంగుడుబిల్లి.

ప్రస్తుత పరిస్థితులలో హింసా ప్రేమా ఏది జయిస్తుంది?

ప్రస్తుతానికి హింస, శాశ్వతంగా జయం కావాలంటే ప్రేమ.

మనసు—కోతి సామ్య భేధాలు వివరిస్తారా?

ప్రత్యేకించి వివరించుట కేముంది—మనసే కోతి అయినప్పుడు!

కుమార్ జీ, విశాఖపట్నం.

మా మద్రాసు రేడియోలో తెలుగు వారికి అంతే అన్నారు. మద్రాసువాళ్లు తెలుగువాళ్లని తమతో సమానంగా చూస్తారన్నారు. మీరు అవకాశవాదులా?

మీరు అపార్థం చేసుకున్నారు గురూ. మద్రాసు జోనల్ స్టేషన్. అన్ని భాషలకీ ప్రాధాన్యం ఇవ్వాలి. కాని ఏం లాభం? యిక్కడవున్న తెలుగువాళ్లకే గట్టిగా అడిగే శ్రద్ధలేదు. నో మున్నూయి నిమిషాలు రోజా కిస్తే చాలా! యిక్కడ దరిదాపు ఆరు లక్షల జనాభా వున్న భాషకి? అధికారంలోవున్న వాళ్ల భావాలని మిగిలిన జనాన్ని—జోడించకండి. తెలుగువాళ్లు దోపిడిగాళ్లు అనుకోరు వీరు.

కె. పి. ఆర్, గుంటూరు.

అక్కయ్యా, భోజనం దొరకగానే భోజనప్రియుడు ఏమనుకుంటాడు?

'ఈరోజా కింకేం జరిగినా ఫరవాలేదు. నా భోజనం అయింది!' అనుకుంటాడేమో తమ్ముడు.

డి. జె. ఎమ్, గుంటకల్లు.

సంసారం సుఖంగా సాగాలంటే డబ్బు వుంటే చాలా?

చాలదు. మగవాడికి తెలివి, ఆడదానికి అణకువ, ఓర్పు కూడా కావాలి.

జి. ఎస్. ఎమ్, సాంబల్‌పూరు.

మీరు ప్రముఖ జర్నలిస్టు ఎలా అయ్యారు?

ఏముందీ? గుడ్డివాళ్ల రాజ్యంలో ఒంటికన్ను వున్నవాడే రాజు! అలాగ్గానే.

ఎమ్. బి. ఎమ్, విజయవాడ.

అందరిచేతా గౌరవింపబడాలంటే ఏం చెయ్యాలి కె. రా గారూ?

ఏం చెయ్యక్కరలేదు మురళీ, ఉన్న వూళ్లో నీ పేరూ, పై వూళ్లో నువ్వు వేసుకునే బట్టలూ నీకు గౌరవాన్ని తెస్తాయి!

ఎ. ఎస్. ఎస్, కొర్రపాడు.

ఈ కాలంలో మంచివాడు చాలారోజులు బ్రతుకుతాడా? చెడ్డవాడా?

ఎవరెన్ని రోజులు బ్రతికారన్నదికాదు ముఖ్యం. ఎవరెలా బ్రతికారన్నది.

కె. ఎస్. ఎన్. ఇల్లెందు.

ప్రేమలోవున్న సుఖం త్యాగంలో లేదు కారణం?

ప్రేమ పొందడం, త్యాగం యివ్వడం. పొందడంలో ఉన్న సుఖం యివ్వడంలో ఎప్పుడూ వుండదు కదా!

ఎమ్. ఎన్, మాసాపేట (కడప)

మీరు నవలలు ఎందుకు రాయడంలేదు? తీరిక లేకనా?

కాదు, ఓపికలేక!

జి. ఎమ్. ఎన్, పెనుమంద్ర.

కాలం మారింది. కాలం మారింది అంటారే—అదే పగలు అదే రాత్రి—ఎంత కాలమైనా అంతేకదా?

రాత్రి—పగలూ మారిందని అండంలేదుకదా చిట్టితల్లీ—కాలం మారిందంటున్నారుగాని కాలం పరిస్థితులకి సింబల్.

ఐ. టి. ఆర్, కావాలి.

ఒకే కథను రెండు వేర్వేరు పత్రికలకి పంపించవచ్చా?

కూడదు. అది సభ్యతకాదు. ఒక కథ ఒక పత్రికకు పంపించి—వారి సమాధానం చూసుకునే—యింకోదానికి పంపాలి.

వి, ఆర్. ఆర్. కాకినాడ.

అంతా సారా తాగుతారు. సారాలో ఏముంది?

సారాలో సత్యం వుంది తమ్ముడూ!

మంచిభార్య లక్షణం ఏమిటి?

వినలేదా—మంచి గుర్రం జంకదు. మంచి భార్య సణగదు!

మనిషి బాగుపడాలంటే?

పరిశ్రమించడం అనేది కుడి చెయ్యిగా, పొదుపు చెయ్యడం అనేది ఎడమ చేయిగా బ్రతకాలి.

మీరు రాజకీయవాదుల ఉపన్యాసాలూ, బహిరంగసభలూ చూస్తారా?

నక్కల ఉద్బోధనలు వినడానికి వెళ్లేటంత వెర్రి బాగుల బాతునటోయ్ నేను? హాయిగా పత్రికల్లో చదువుకుంటాను!

ఎలాటి స్త్రీని పెళ్లాడితే హాయి?

గొర్రెలాంటి దాన్ని పెళ్లాడేకంటే—గోలచేసే దాన్నే పెళ్లాడు. కొంచెం జీవం వుంటుంది—సంసారంలో.

ఏమ్. ఎ. వి, టాటానగరు:

కొందరమ్మాయిలు మగవాళ్లను చూసి సిగ్గుపడి వెళ్లిపోడానికి కారణం ఏమిటి? సిగ్గా? అందంగా వున్నారనా?

, రెండూ కాదు. అనవ్యాకాగా కామెంట్ చేస్తా రని!

వి. ఎస్, పాలకొలు.

నాలెడ్జిలేని మీ జవాబులతో ప్రతికవారు ఒక పేజీ వృధా పరుస్తున్నారు. మీరు తప్పుకొని మాకు తలనొప్పిని తగ్గించండి.

అరె. తలనొప్పికి మందుందికాని నాలెడ్జి లేకపో డానికేదైనా పాలకొల్లులో మందుందటోయ్ అయ్యా ఎన్నంసెట్టి?!

ఒక వారం విపరీతం ఫాలాక్షుడు

ఆసియా జనాభా!

ప్రపంచ జనాభా 370.8 కోట్లయితే, అందులో 210.4 కోట్లు జనాభా ఒక్క ఆసియాలోనే వున్నారట. అనగా ప్రపంచ జనాభాలో సగం కన్నా ఎక్కువ మన ఆసియా ఖండంలోనే వున్నారట — వుండరూ మరి! అయ్యా సెన్సెస్‌గారూ ఇండియాలో జనాభా ఎంతండి? తమకు పిల్లలెందర్సార్!

ముష్టివాళ్ళ లెక్కలు

1971 వ సంవత్సరపు లెక్కల ప్రకారం మన దేశపు భూదేవి మీద ఏడు లక్షల నలభైనాలుగువేల



అయిదొందలమంది ముష్టివారు తమ వ్యాపారాన్ని చేసుకుంటున్నట్టు, చూసుకుంటున్నట్టు తేలిందట — వాళ్ళపనే బావుందొకక్క గరీబ్‌హటావో....

కడుపునెప్పి భరించలేక ఆత్మహత్య

మైసూరురాష్ట్రం కొండనహళ్ళి అనే వూరిలో మునిసామాచారి భార్య సరోజమ్మ తన కడుపునొప్పి అనేక వైద్యాలకు లొంగనందువల్ల ఆ కడుపునొప్పితో జీవించలేక, జీవించివుండగా దాన్ని ఒదుల్చుకోలేక, చివరికి తెగించి నూతిలో దూకి, ఆత్మహత్య చేసుకుందట — సేవాక్స్ సైన్స్ దామిట్!

చావులోని మర్మం!

బెంగళూరు మార్గపాళ్ళికి చెందిన 30 ఏళ్ళ గవురమ్మ పొరపాటున కాలుజారి నూతిలో పడి, చనిపోయిందట. ఆమెకయిన వారామె శవాన్ని సశాస్త్రీయంగా వల్లకాడులో పాతిపెట్టారట. కానీ, యీమె చావులో మర్మం వుందని పోలీసులకో ఆకాశవాణి (లేక అశరీరవాణి) తెలియజేసిందట. ఆరకంగా గవురమ్మ చనిపోయిన విషయం తమకు తెలియజేయక పోవడాన్ని నేరంగా బనాయించి, పోలీసులు వల్లకాడులోంచి ఆమె శవాన్ని త్రవ్వి బయటకు తీసి, ఒవురింగాసుపత్రికి పరిశోధనార్థం పంపారట — పోలీసులకోపం వస్తే నేరుగా యమలోకం వెళ్లే చనిపోయినవారిని పట్టుకు చక్కా రాగలరండి! డోన్ట్ ప్లే విద్దమ్!

భార్యని కొడవలితో నరికిన భర్త

దేవరసం పట్టి గ్రామవాసి 50 ఏళ్ళ చిత్తన్ అనే ఆయనకు తన భార్య కాళియమ్మ ప్రవర్తనమీద అనుమానం పుట్టి, పోలేక, అది నమ్మకమై కూర్చుందట. ఈ సందర్భంగ వారిద్దరూ చాలాసార్లు తీవ్రముగా, తీవ్రతరంగా కూడా పోట్లాడుకున్నారట. అయినా యీ విషయం పరిష్కారం జరగనందువల్ల చిత్తన్ తన భార్యను కొడవలితో నరికి చంపేశాడట. నవంబరు 13వ తేదీన జరిగిన యీ హత్యను కోర్టులో విచారించి, చిత్తన్‌కు యావజ్జీవ శిక్ష విధించారట — వోస్సింతేనా! కొన్నికొన్ని నేరాలకెంతెంత శిక్షలయినా బుల్లిబుల్లిగానే అగుపిస్తాయి మేష్టారూ! హవునా!!

రెండు రైళ్లు-వంద గొర్రెలు-ఒక కాపరి

మెల్‌కళత్తూర్ అనేవూరు ప్రాంతంలో 40 ఏళ్ళ గోవిందనో నూటనలభై గొర్రెలను మేపుకుని, సాయంత్రంవేళ వాటిని వూళ్ళోకి మళ్ళిస్తున్నాడట. అప్పుడు ఆ గొర్రెలు రైలుపట్టాల మీదకు వెళ్ళాయట. అదే సమయంలో మద్రాసు నుంచి వస్తున్న కేరళా ఎక్స్‌ప్రెస్, మద్రాసు వెళ్తున్న బృందావన్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు రెండూ ఆ పట్టాల మీద విసురుగా పోడంవల్ల వాటిచక్రాలక్రింద సుమారు నూరుకుపైగా గొర్రెలు, కాపరికూడా పడి, తుండు తుండులై చనిపోయారట. నాలుగురైలుపట్టాలూ చాలా మేర రక్తమయమై, మాంసంతో, ఎముకలతో భయంకరంగా ఉండాయిందట.

కడుపునెప్పి — అవివాహితుని ఆత్మహత్య

సోమాస్పాడి గ్రామవాసి 20 ఏళ్ళ రామస్వామి అనే అవివాహితుడు తన కడుపునొప్పి భరించలేక, దానితో బ్రతకలేక, దాన్ని ఒదుల్చుకోలేక, ఫాలిటాల్ అనే విషం త్రాగి బ్రతుకును ఈసేసుకున్నాడట.

ఆత్మహత్యకి పురికొల్పిన దీర్ఘవ్యాధి!


కూనూరులో 30 ఏళ్ళ శాంత అనే ఆమె నిద్రమాత్రలు మ్రింగి, ఆత్మహత్య చేసుకుందట. ఈమె హోటలుగదిలో వుంటూ ఒక ప్రయివేటు కంపెనీలో పని చేస్తూండేదట. తనకు ఒక దీర్ఘవ్యాధి వున్నదనీ, దాన్ని భరించేశక్తి, వోపికా తనకు లేనందువల్ల జీవితం మీద ఆసక్తి తగ్గి, క్షీణించిపోయిందని, తత్ఫలితమే ఆత్మహత్య అనీ వో వుత్తరంలో వివరించి వుంచిందట — పోలీసార్లక్కి.

ప్రశాంతత?

ప్రత్యేక రాష్ట్రోద్యమకారులు కొంతమంది ఏలూరుకు, పెదఅవుటుపల్లి స్టేషనుల మధ్య వార్తలను మోసుకుపోయే తీగెలను, తంత్రులను పీకిపాకం పెట్టారట. గూడూరు విభాగంలో వుద్యమకారులు పట్టాలమీద కూర్చున్న కారణంగా కొన్ని రైళ్ళు నిలిపివేయవలసి వచ్చిందట— హైదరాబాదు : విజయవాడ — మద్రాసుల మధ్య ఎక్స్‌ప్రెస్ రైళ్ళను మళ్ళీ ప్రారంభించనున్నట్టు, ఆంధ్రలో పరిస్థితులు చాలా ప్రశాంతంగా వుండడం దీనికి కారణమని రైల్వే శాఖ అన్నదట.

సైకిల్‌పై లంఘించిన లారీ!

వో రాత్రిపూట ఆర్కోణం నుంచి పెరుముచ్చి సైకిలుమీద వెళ్తున్న 16 ఏళ్ళ సుబ్రమణ్యం, 12 ఏళ్ళ మణి అనే యిద్దరు హరిజన బాలుర మీద వో లారీ లంఘించిన ఫలితంగా సుబ్రమణ్యం అదే ప్రదేశంలో రక్తపుమడుగులో విలవిలతన్నుకుని, చనిపోయాడట. మణి మాత్రం విపరీతమైన గాయాలతో ఆర్కోణం ప్రభుత్వ ఆసుపత్రిలో వూగిసలాడుతున్నాడట— ప్రభుత్వ ఆసుపత్రిలోనే— బాబోయ్!



విలువైన ఆస్తి!

సిడ్నీలోని వో నైట్‌క్లబ్‌నర్తకి 21ఏళ్ళ సూసూ వోడియా తన పిరుదులను లక్ష ఆస్ట్రేలియన్ డాలర్లకు భీమా చేసిందట— అదేమంటే, 'అవే నాకు అత్యంత విలువైన ఆస్తిపాస్తులు. కనుకనే వాటికి గాయాలు లాటివి కలుగుతాయేమోనన్న భయంతో వాటి నుంచి రక్షణకోసం భీమా చేశాన్న' ఫోమ్మందట— యస్సార్! హిందూదేశంలో యీ రకం యిన్సూరెన్సు వుందా! వున్నచో!!

మూయనంటే మోయడమే!

కేరళరాష్ట్రంలో జరిగిన బంద్ సందర్భంలో కొడుముడి అనే వూరిలో వో టీ షాపు తెరచి వుందట. బంద్ నిర్వహిస్తున్న వారాషాపు యజమానిని షాపు మూయమని అడిగితే ఆతను మూయనన్నాడట. దాంతో వారాతన్ని చట్నీనపొడిచి, చంపేశారట — హవురా! మూయనన్నంత మాత్రాన మోయడమే! వరల్డ్ జ్లొక్లట్!

రైల్వేశాఖ నష్టం

ముల్కీ, ప్రత్యేకఆంధ్ర, ప్రత్యేక తెలంగాణా వుద్యమాల ఫలితంగా రైల్వేశాఖకు 20 కోట్లునష్టం వచ్చిందని రైల్వేశాఖామంత్రి యల్యైన్. మిశ్రా అన్నారట.

సూర్యాపేట విషాదాంతం

సూర్యాపేటలోని ప్రజల్లో కొందరు మోజుపడి త్రాగిన సారాలో విషపదార్థం వంటిది కలసి వుండ నందువల్ల మూకుమ్మడిగా త్రాగిన వారిలో చాలా మంది మరణించారట. ఇంకా చాలామంది పరిస్థితి విషమంగా వుందట. మృతులసంఖ్య 73కు పెరిగిందని అధికారవార్తే అంటే....!

బొంబాయికి 'బ్లాక్ డిసెంబర్ హెచ్చరిక'

మన దేశంలో బందీలుగా వున్న 90 వేల మంది పాకిస్తాన్ యుద్ధ ఖైదీలను వెంటనే విడుదల చేయని పక్షంలో బొంబాయి మంచినీటి రిజర్వాయువులలో విషం కలిపితీరుతామని కొత్తగా ఏర్పడిన 'బ్లాక్ డిశంబర్' సంస్థ నగరాన్ని హెచ్చరించిందట — ఇదెక్కడి ప్రాలుద్ధఖర్మండి మెప్పారూ మనకు!

ఉరిపోసుకున్న యువకుడు?

కావేరీపాకానికి చెందిన తిరుప్పార్‌కడల్ గ్రామంలోని వో చింతచెట్టుకు 25 ఏళ్ళ యువకుని శవం వ్రేలాడుతూ ఎవరి కంటనో బడితే, ఆవ్యక్తి వెళ్ళి పోలీసుకు తెలియజేస్తే, వాళ్ళొచ్చి విచారించారట. చెట్టుకు కట్టిన త్రాడులో ఆ యువకుని తల వ్రేలాడుతూండడం వల్ల బహుశా ఆత్మహత్య అయ్యుండుండాలని నిర్ణయించుకున్నారట పోలీసువారు. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? ఎందుకు ఎప్పుడు యిలా చేసుకున్నాడు అన్న విషయాలింకా తెలలేదట! ●

'హీరోల పట్టింపులేదు' రోజా రమణి



'భక్త ప్రహ్లాద' చిత్రంలో తన నటనతో ప్రేక్షకుల హృదయాలకు ఆహ్లాదాన్ని కల్గించిన రోజారమణి 'చంబరతి' మళయాళం చిత్రం ద్వారా కథానాయిక అయింది. పసిప్రాయంలో తొలి చిత్రంలోనే ఎంత పేరు సంపాదించిందో, నాయికగా కూడా బాగా చక్కగా నటించి మెప్పించింది. ప్రస్తుతం అదే చిత్రాన్ని తెలుగులో రోజారమణితోనే గౌరీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్నారు. ఒకనాటి ప్రహ్లాదుడు ఈనాటికి ఏం సాధించాడు ఇకముందు ఏం సాధించదలచాడో తెల్సుకుందామని పరామర్శించాను.

ప్ర : శారద, షీలా లాంటి అనుభవజ్ఞులుండగా, ఫిలింఫేర్ అవార్డు మీకే రావడానికి కారణం. అలాంటి అవార్డు వస్తుందని ముందుగా వూహించారా?

జ : ఆయా సంవత్సరాలలో విడుదలైన చిత్రాలను, అందులో నటించిన నటీనటులను దృష్టిలో పెట్టుకొని, అవార్డు ఇవ్వడం అనేది జరుగుతుంటుంది. శారద, షీలాగార్లకు ఇదివరకే ఎన్నోసార్లు లోగడ వచ్చాయి అవార్డులు. ఈ సంవత్సరం 'పునర్జన్మ' చిత్రానికి అందులో నటించిన జయభారతికి అవార్డు వస్తుందని వూహించాను గాని, నాకొస్తుందని అనుకోలేదు. కాని నిర్మాతలు, దర్శకులు అనుకొన్నారట. అందరి ఆదరాభిమానాల వల్లనే నాకు ఫిలింఫేర్ అవార్డు రావడం జరిగింది. కుమారి సుయంతర్వాత నాకొచ్చిన అవార్డులలో రెండవది. చిన్నతనంలో ఎవి మీద వచ్చాయి.

మేకప్ లేదు...

ప్ర : 'చంబరతి' తెలుగులో హిట్ అవుతుందంటారా? మళయాళంలో లాగే షూటింగ్ చేయడం జరిగిందా?

జ : హిట్ అవుతుందనే అనుకొంటున్నాను. పాటలు బాగున్నాయి. చిత్రీకరణ బాగుంది. మళయాళంలో లాగే మేకప్ లేకుండా అవుట్‌డోర్‌లోనే తీయడం జరిగింది. కాని ఒక్క డ్రీమ్ సాంగ్ మాత్రం మేకప్‌తో తీశారు.

ప్ర : మళయాళంలో మీ తదుపరి చిత్రం 'ఛాయం' ఫెయిల్ అవడాన్కి కారణం?

జ : కథాగమనంలో టెంపో లేకపోవడం; చిత్రమంతా వ్యభిచారం అనే పదం చుట్టూ రన్ కావడమే ఫెయిల్ అవడాన్కి కారణాలు.

ప్ర : తెలుగు, తమిళం తారలుమాత్రం అటు తెలుగులో, తమిళంలో, హిందీలో కూడా నటిస్తున్నారు. కాని హిందీ తారలెవరు అలా చేయకపోవడంపై మీ అభిప్రాయం?

జ : కొంతకాలం తెలుగు, తమిళ దేశాలు కల్సివుండడం; విడిపోయినప్పటికీ ప్రక్క ప్రక్క రాష్ట్రాలు కావడం; సినిమాలన్ని (దక్షిణభారత) మద్రాసులోనే నిర్మించబడడం మూలంగా ఒక భాష వారికి మరొక భాష నేర్చుకొని, ఆ భాషా చిత్రాల్లో నటించే అవకాశం కల్గుతుంది. కాని హిందీవారికి అటు తెలుగు, ఇటు తమిళం వారితో అంతగా టచ్ లేనందున వారు తమ భాషలోనే ఎక్కువగా నటించడం జరుగుతుంది.

చిదంబర రహస్యం

ప్ర : తెలుగు చిత్రాల్లో తమిళంవాళ్ళని, తమిళచిత్రాల్లో తెలుగువార్ని ఎన్నుకోవడంలో గల రహస్యం ఏమిటి?

జ : తెలుగులో ఓ చిత్రం హిట్ అయితే, ఆ చిత్రాన్ని గూర్చి తమిళంలో, తమిళంలో ఓ చిత్రం హిట్ అయితే ఆ చిత్రాన్ని గూర్చి తెలుగులో పత్రికలు [illegible] ద్వారా ఫలానా తమిళ చిత్రం లేక తెలుగు చిత్రంలో నటించిన తారలు తెలుగు లేక తమిళంలో బుక్ చేస్తే ఎలా చేస్తారో అన్న వుద్దేశ్యంతోనూ, సినిమాల్లో నటించి అనుభవం సంపాదించిన తారలైతే సులువుగా నటించగలరన్న నమ్మకంతోను ఆ భాషవార్ని ఈ భాషలోకి, ఈ భాషవార్ని ఆ భాషలోకి తీసుకోవడం జరుగుతుంటుంది.

ప్ర : వాణిశ్రీ, జమున, శారద నటించిన చిత్రాలను చూచినపుడు వారిలా నటించాలన్న కోరిక మీలో కల్గుతుందా?

జ : అవసరం అనుకొన్న దగ్గర గొప్పవారి అడుగుజాడలను అనుకరించడంలో తప్పులేదు. కాని మక్కీకి మక్కీగా కాపీ కొట్టకుండా సాధ్యమైనంతవరకు స్వయం ప్రతిభను చూపెట్టడాన్కి ప్రయత్నించడం మంచిది అని నా భావన. వాణిశ్రీ, జమున, శారదగార్లను గూర్చి చెప్పేంతటి పెద్దదాన్ని నేనింకా కాలేదు.

ప్ర : ఇంతవరకు నటరత్న రామారావుగారితో నటించకపోవడాన్కి ప్రబలమైన కారణాలేమైనా వున్నాయా?

జ : నటించే అవకాశాలు వచ్చినప్పటికీ చిన్నప్పటి అగ్రిమెంటుకు బద్ధమైయున్న

కారణంగా నటిరత్నగారితో కల్సి నటించ లేకపోయాను. కాని ఎప్పటికైనా నటించ గలనన్న ఆత్మవిశ్వాసం నాకుంది.

ఆనందపరచిన వార్త!

ప్ర: నటసామ్రాట్టు నిష్క్రమించడం లేదన్న విషయంపై మీ అభిప్రాయం?

జ: ఆ వార్త నన్నెంతో ఆనందపర చింది. పాతికేళ్ళ పదికాలాలపాటు పరిశ్ర మలో వుండి, రానున్న క్రొత్తవారికి, ఇప్ప డిప్పుడే పైకొస్తున్నవారికి ఆదర్శవంతులై, తెలుగు చలనచిత్ర పరిశ్రమ పురోభివృద్ధికి కృషి చెయ్యగలరని ఆశిస్తున్నాను. మన కున్న రెండు కన్నులలో ఒకటి కనపడక పోతే మనమెంత బాధపడతామో, అలాగే నటసామ్రాట్టు నాగేశ్వరరావుగారు నిష్క్ర మిస్తే అంతే బాధపడాల్సి వుంటుంది.

స్విమ్మింగ్ డ్రెస్ యిప్పుడే కాదు

ప్ర: హీరోల పట్టింపు గాని, వస్త్ర ధారణలో పట్టింపు గాని వుందా?

జ: హీరోల పట్టింపు మాత్రం లేదు. వస్త్రధారణలో స్విమ్మింగ్‌లాంటి డ్రెస్ వేయడాన్కి ప్రస్తుతానికి అంగీకరించడం లేదు. ఇంకాస్త వయసొచ్చాక అలాంటి గెటప్స్‌లో అగుపించడం మంచిదని నా అభి ప్రాయం.

ప్ర: ఏం సాధించాలనుకొంటున్నారు? దానికి అవసరమైన ప్రయత్నాలేమైనా చేస్తున్నారా?

జ: ముమ్ముందు విభిన్న చిత్రాల్లో విభిన్న పాత్రల్లో నటించి, ప్రేక్షకుల, పరిశ్రమలవాసుల ఆశీస్సును, ఆదరాభి మానాలను సాధించతలచాను. అందుకే భరతనాట్యం, కథక్ లాంటి నృత్యాలను నేర్చుకొంటున్నాను. స్విమ్మింగ్ గూడా అడప దడప ప్రాక్టీసు చేస్తున్నాను.

ప్ర: ప్రస్తుతం ఎన్ని చిత్రాల్లో నటి స్తున్నారు?

జ: తెలుగులో విజయభట్ వార్ల చిత్రంలో అక్కినేనిగారితో (కూతురు లాంటి పాత్ర), తెలుగు, తమిళం చంబల్ లోయలో మరో చిత్రంలోను నటి రతీ చిత్రాల్లో, 'బుల్లెమ్మ—బుల్లోడు' స్తున్నాను. హిందీ, గుజ్జీ తమిళం, తెలుగు, మళ

— ఇంటర్వ్యూ: శ్రీనివాస్ ●

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఉత్తమ నటుడు | ఉత్తమ నటి | ఉత్తమ సహాయనటుడు



అక్కినేని నాగేశ్వరరావు



వాణిశ్రీ



శోభన్ బాబు

ఉత్తమ చిత్రం - పండంటికాపురం, ఉత్తమ దర్శకుడు - పి. సి. రెడ్డి, ఉత్తమ నటుడు - అక్కినేని నాగేశ్వరరావు, ఉత్తమ నటి - వాణిశ్రీ, ఉత్తమ సహాయ నటుడు - శోభన్ బాబు, ఉత్తమ సహాయనటి - చంద్రకళ, ఉత్తమ హాస్య నటుడు - రాజబాబు, ఉత్తమ సంగీత దర్శకుడు - కె. వి. మహాదేవన్.


అందరికీ మా అభినందనలు !

సినిమా బాలట్‌లో ఉత్సాహంతో పాల్గొని దానిని జయప్రదం చేసిన ఆంధ్రసచిత్రవారపత్రిక పాఠకులందరికి మా కృతజ్ఞతలు.

కొన్ని నెలలుగా ఆంధ్రదేశంలో నెలకొనిఉన్న అనిశ్చిత పరిస్థితులవల్ల ఈ ఏడాది అనుకున్నంత ఎక్కువమంది ఈ బాలట్‌లో పాల్గొనలేక పోయారనిపిస్తుంది. బాలట్ పత్రాలు కూడా అనుకున్నదానికంటే తక్కువగానే మా కార్యాలయానికి అందాయి.

1972 సినిమా బాలట్ ఫలితాలు ఈ క్రిందయిస్తున్నాము. ఉత్తములుగా ఎన్నికైన వారితోపాటు వారి తర్వాతి రెండు స్థానాలలో వచ్చిన వారి పేర్లు కూడా వరుసగా యిస్తున్నాము. గత సంవత్సరం సినిమా బాలట్ ఫలితాలకు ఈ సంవత్సరం ఫలితాలకి తేడా ఉత్తమ దర్శకుడు విషయంలోనే కన్పిసున్నది. మిగిలినవారంతా ఉత్తములుగా తమ తమ స్థానాల్ని నిలబెట్టుకున్నారు.

ఉత్తమ దర్శకుడు



పి. సి. రెడ్డి

'72 సినిమా బాలట్ ఫలితాలు!

ఉత్తమ సహాయ నటి



చంద్రకళ

ఉత్తమ హాస్యనటుడు



రాజ్‌బాబు

ఉత్తమ సంగీత దర్శకుడు



కె. వి. మహాదేవన్

ఉత్తమ చిత్రం ★ పండంటి కాపురం

ఉత్తమచిత్రంగా 'పండంటి కాపురం' చిత్రం ఎన్నికైంది. రెండవ స్థానంలో 'బడిపంతులు', మూడవదిగా 'విచిత్రబంధం' చిత్రాలు వచ్చాయి.

ఉత్తమ దర్శకుడుగా పి. సి. రెడ్డి ఎన్నికైనారు. రెండవస్థానంలో లక్ష్మీదీపక్ మూడవస్థానంలో వి. మధుసూదనరావు వచ్చారు.

ఉత్తమ నటుడిగా అక్కినేని నాగేశ్వరరావు విజయాన్ని సాధిస్తే తర్వాతి రెండుస్థానాలలో వరుసగా శోభన్‌బాబు, రామారావు వచ్చారు.

ఉత్తమ నటిగా వాణిశ్రీ ఎన్నికైతే, రెండవ, మూడవ స్థానాలని వరుసగా జమున, శారద అలంకరించారు.

ఉత్తమ సహాయ నటుడిగా శోభన్‌బాబు ఎన్నికైనారు. ఆ తర్వాతి స్థానాలలో వరుసగా చంద్రమోహన్, కృష్ణంరాజు వచ్చారు.

ఉత్తమ సహాయనటి స్థానాన్ని చంద్రకళ పొందితే, రెండవ, మూడవ వారుగా రమాప్రభ, జయంతి వచ్చారు.

ఉత్తమ హాస్యనటుడిగా రాజ్‌బాబు ఎన్నికైనాడు. అల్లు రామలింగయ్య, పద్మనాభం వరుసగా రెండవ, మూడవ స్థానాలని ఆక్రమించారు.

ఉత్తమ సంగీత దర్శకుడిగా కె. వి మహాదేవన్ ఎన్నికైతే, ఆ తర్వాతి రెండు స్థానాలలో వరుసగా ఎస్. పి. కోదండపాణి, సత్యం వచ్చారు.

బంగారుబాబు

'లోకోభిన్నరుచి.' లోకంలో రకరకాల వ్యక్తులున్నారు. ఒక్కొక్క వ్యక్తి ఒక్కొరకమైన రుచికి అలవాటు పడి యుండడం సర్వసాధారణం. రకరకాల వ్యక్తులను; వారి మనోభావాలను దృష్టిలో పెట్టుకుని; అందరికీ ప్రీతిపాత్రమైన, ఉత్తమోత్తమైన విధంగా చిత్రాన్ని నిర్మించడంలో జగపతి సంస్థకు ఆదినుండే అలవాటు. నాటి 'అన్నపూర్ణ' చిత్రంనుండి మొన్నటి 'దసరాబుల్లోడు' చిత్రంవరకు ఆ సంస్థనుండి వెలువడ్డ అన్ని చిత్రాలు ఒక్కొక్కమెట్టుగా ఘనవిజయాన్ని సాధించాయన్న విషయం అందరికీ తెలిసిందే.

అన్ని చిత్రాలను నయనానందకరముగ నిర్మించిన జగపతి సంస్థాధినేత వి. బి. రాజేంద్రప్రసాద్ ఇక 'బంగారుబాబు' చిత్రాన్ని ఇంకెంత రమణీయంగా చిత్రించి వుంటారో వూహించుకోవచ్చు. ఆత్రేయ మాటలు అడుగడుగునా ఆత్రుతను కల్గించగా, మహాదేవన్ సంగీతం ఎక్కడెక్కడికో తీసుకెళ్ళగా, వెంకటరత్నం ఛాయాగ్రహణం కన్నులపండుగ కాగా, కృష్ణారావు కళ, సంజీవి కూర్పు చిత్రానికి క్రొత్త అందాన్ని చేకూర్చాయి.

సినిమా

చిత్రనాయకుడిగా నటసామ్రాట్ నాగేశ్వరరావు తనకు తనే సాటి అని నిరూపించారు. నాయికగా వాణిశ్రీ నిండుగా నటించింది. భారీయెత్తున పూర్తి రంగుల్లో నిర్మింపబడ్డ 'బంగారుబాబు' చిత్రంలో జగ్గయ్య, యస్. వి. రంగారావు, నాగభూషణం, రాజబాబు, గుమ్మడి, సాక్షి రంగారావు, జయంతి, రమాప్రభ, యస్. వరలక్ష్మి, సూర్యకాంతం ముఖ్యపాత్రధారులు.

హెలికాప్టర్ ఫయిటు, శివాజీ, రాజేష్ ఖన్నా, శోభన్, కృష్ణలు ఒకే చిత్రంలో కన్పించడం; పాటల చిత్రీకరణలో ఓ ప్రత్యేకమైన ఒరవడి వుండడం ఈ చిత్రంలోని కొన్ని ప్రత్యేకతలు. రాజేంద్రప్రసాద్ దర్శకత్వం మరోసారి 'భేష్' అనిపించుకొనే విధంగా అమరింది. 'చెంగావిచీర', 'శ్రీరామచంద్ర', 'నారాయణా', 'ఏడడుగుల సంబంధం' 'కన్నయ్యలాంటి అన్నయ్య' మున్నగు పాటలు బహుళ ప్రజాదరణ పొందడం తథ్యం.

పెద్ద మార్పు!

అంజలీ పిక్చర్స్ కంపెనీవారు పంచరంగుల్లో నిర్మించిన 'భక్తతుకారాం' చిత్రం.

ఈ చిత్రం చూశాము; ఈమధ్య కల్పగం థియేటర్లో. అదేరోజున నాగేశ్వరరావు, అన్నపూర్ణమ్మగార్లు కూడా వీక్షించారు.

చిత్రం మొదటిషాటునుండి చివరిషాటు వరకు చింతమధురంగా తీసారీ చిత్రాన్ని. ఇదొక పంచరంగుల చిత్రం అవుతుంది. పదేపదే చూడాలనిపిస్తుంది.

అలా అనిపించడానికి కారణం లేకపోలేదు.

'తుకారాం' పాత్రలో వింత పరిపక్వతను ప్రదర్శించారు, అక్కినేని. అలనాటి 'విప్రనారాయణ' కన్నా మిన్నగా ఉందాయన పాత్రపోషణ. వింతయినా అనుభవజ్ఞుడు గదా! ఆయనకిది పెద్దమార్పు. అనేక సాంఘికాల తర్వాత ఈచిత్రం ఆయన అభిమానులకు పెద్ద రిలీఫ్ నిస్తుంది.

'సువర్ణసుందరి' వింత 'తుకారాం' ముందు అన్న అభిప్రాయాన్ని కలిగిస్తుంది; ఆదినారాయణరావు వినిపించిన సంగీతం. ప్రతిపాట హిట్‌గాక తప్పదు. ఆయన ఈ చిత్రానికి జీవం అనక తప్పదు.

దర్శకుడు వి. మధుసూదనరావేమిటి? భక్తి చిత్రానికి సారథ్యం వహించడం ఏమిటి? అన్న సంశయం ఎవరికైనా వుంటే, వాళ్ళు అబ్బే, ఎంత పొరపడ్డాము అని అనక తప్పదు, ఈ చిత్రం చూసిన తర్వాత.

ఆయనే వెయ్యాలి ...

ఛత్రపతి శివాజీ పాత్రను శివాజీగణేశన్ ధరించబట్టే, దానికి నిండుదనం వచ్చింది. అక్కినేనితో పోటీగా నిలబడింది, ఆయన నటన.

వేటూరికి నాయకుని ప్రశంస

'భక్తతుకారాం' చిత్రానికి వేటూరి ప్రాణం పోశాడు, కమ్మకమ్మని మాటలతో,



'ఒక నారి వంద తుపాకుల'లో త్యాగరాజు జి, రత్న

'బోల్తాకొట్టించబోయి బోల్తాపడ్డాను'

చంద్రకళ



'మధురాతి మధురం విద్యార్థి జీవితం. చిరునవ్వులతో, చిలిపి చేష్టలతో చలాకీగా గడచిపోతుంది ఆ జీవితం. ఆ దశలోని అనుభవాలు మరచిపోలేని మధుర స్మృతులుగా నిల్చిపోతాయి మెదడులో' అంటూ తాను విద్యార్థినిగా వున్నప్పుడు చేసిన తమాషా పనులను గూర్చి హుషారుగా చెప్పింది 'స్త్రీ' నాయిక చంద్రకళ.

'అవి నేను సెకండ్‌ఫారమ్ చదువుకొనే రోజులు. చిన్నప్పటినుండి ఎదుటివారిని తమాషా పట్టించడం అంటే బలే సరదా నాకు. కాని ఒక్కోసారి వార్ని బోల్తా కొట్టించపోయి నేనే బోల్తా పడుతుంటాను. అదే జరిగింది ఒకనాడు. మా పాఠశాల వెనుక భాగంలో ఓ పెద్ద మామిడిచెట్టు వుండేది. పిల్లలందరము ఆ చెట్టు చుట్టూ తిరుగుతూ, ఆటపాటలతో వినోదంగా కాలాన్ని గడిపేవాళ్ళం. ఆ చెట్టుపై ఓ దయ్యముందన్న ప్రతీతి వుండేది. కాస్త చీకటి పడితే చాలు, ఆ చెట్టు ఛాయలకు వెళ్ళడానికే భయపడేవారు.

అదృశ్యం!

'ఆరోజు మా పాఠశాలలో ఆటల దినం. అంతా ముగిసేసరికి మసక చీకటి ఆవరించసాగింది. ఒక్కొక్కరుగా ఎవరెవరి నివాసస్థలాలకు వెళ్ళడానికి ప్రయాణమయ్యారు. నేనూ, నా స్నేహితురాండ్రు మరో ఇద్దరను వడివడిగా నడుచుకొంటూ వెళుతున్నాము. దార్లో మామిడిచెట్టు నా దృష్టిలో పడింది. చెట్టుపై దెయ్యముందన్న విషయాన్ని మరింత గట్టిపరుద్దాము; నా తోటివార్ని ఓ పట్టుపడదామని చిన్న నాటకం ఆడాను. ముగ్గురం మాట్లాడుకొంటూ వుండగా, నేను మాత్రం వార్ని వదిలేసి మామిడిచెట్టు దరి చేరాను. దీర్ఘ ప్రసంగంలో మునిగి వున్నవారికి నేనెటు పోయింది తెలియలేదు పాపం.

పెద్ద అరుపు!

'ఎటు పోయానో అని వారు కలవరపడుతుండగా, వున్నట్టుండి ఓ పెద్ద అరుపు అరచి చెట్టుక్రింద పడిపోయాను. పరుగెత్తుకుంటూ వారు నా దరి చేరారు. ఇదంతా ఆ దెయ్యం ప్రభావమని భావించారు. ఎలాగైతేనేం వార్ని బోల్తా కొట్టించాను గదా అని వుబ్బిపోయాను. కాని నా అరుపు, దాపులో వున్న హాస్టల్ విద్యార్థినులకు వినపడి, వార్డన్‌తో సహా ప్రత్యక్షమయ్యారు నా ముందు. అనుకొన్నది ఒకటైతే, మరొకటి జరిగిందే అని సతమతమౌతూ దిక్కుతోచక మనస్సులో మ్రొక్కుకున్నాను అందరి దేవుళ్ళకు. కళ్ళు గట్టిగా మూసుకొని, వూపిరి దీర్ఘంగా పీల్చసాగాను. వారికి నేను నిజంగానే అదిరిపోయానన్న నమ్మకం గల్పించడానికి అలా చేసాను. నన్ను హాస్టల్‌కు తీసుకెళ్ళి, ముఖంపై నీళ్ళు చల్లి, ఎప్పుడు కళ్ళు తెరుస్తానా అని ఎదురు చూడసాగారు. వాస్తవానికి నేను మూర్ఛిల్లితే గదా! ముఖంపై నీళ్ళు పడడమే తరువాయి కనురెప్పల్ని తెరచాను.

లక్ష ప్రశ్నలు!

'అందరూ లక్ష ప్రశ్నలతో నన్ను వేధించారు. అందరికి ఏదో ఒకటి చెప్పి, నా మాటపై నమ్మకాన్ని గల్పించాను. వార్డను అసలే కోపిష్టురాలు. నన్ను మరోసారి ఇలా చెయ్యొద్దని మందలిస్తుందేమో అనుకొన్నాను. కాని వార్డనుకీ నా నాటకం బూటకం కాదన్న నమ్మకం గల్గింది. ఇప్పటికీ నేను ఆడిందంతా నాటకం అన్న విషయం వాళ్ళలో ఎవ్వరికీ తెలియదు.' అని చెప్పింది చంద్రకళ.

—శ్రీనివాస్

ఆయన్ను మనసారా అభినందించారు, అక్కినేని.

ఆయన ఆశీర్వాదం, రచయితగా తమకు ధన్యతను చేకూర్చింది, అన్నారు వీటూరి.

కొత్త పాత్రలో కాంచన

'భక్తతుకారాం' చిత్రంలో కాంచనది సరికొత్త పాత్ర. తుకారాం అభంగాలకు జలి పొగ్గిన పరమభాగవతోత్తమురాలి పాత్రను ప్రతిభావంతంగా పోషించింది. నాగభూషణం దుష్ట పాత్రను దులిపేశారు. తుకారాం రెండవ భార్యగా అంజలీదేవీ, ఆవేశానురాగం నిండిన ధర్మపత్నిగా నటించింది.

అందర్నీ మించి ప్రకాశాను, వి. ఎస్. ఆర్. స్వామిని తప్ప. ఆయన ప్రతిభ మరోకసారి ఋజువైంది, ఈ చిత్రంలో.

ప్రేక్షకులు మార్పును కోరుతున్న తరుణం యిది. ఈ చిత్రం పండిత, పామరులను, విద్యార్థులను, మహిళలను ఆకర్షించి తీరుతుంది. లక్ష్మీ ఫిలింస్‌కి కటాక్షం యిస్తున్న చిత్రం.

'రిక్షావాలా'గా అక్కినేని!

తమిళంలో బహుళ ప్రజాదరణ పొందిన 'బాబు' చిత్రాన్ని తెలుగులో శ్రీ ఉమా ప్రొడక్షన్సువారు తమ మూడవ కానుకగా నిర్మిస్తున్నారన్న విషయం పాఠకులకు విదితమే.

ఆకటితో బ్రతుకుతూ, చీకటిలో కాలం గడుపుతున్న నిరుపేదల హృదయాలు, ఆత్మీయతకు, ఆప్యాయతకు నిలయాలు. తోటివాడు బాధపడుతుంటే, ఆ బాధను నివారించడానికి సాటి మానవుడు ముందడుగు వేయడం సమంజసం అని ప్రబోధించే ప్రయోజనాత్మక చిత్రమే శ్రీ ఉమా ప్రొడక్షన్సు పతాకం క్రింద యస్. యస్. భట్ నిర్మిస్తున్న చిత్రం.

పై చిత్రంలో కొత్త పోకడలతో కూడిన పాత్రలో నటసామ్రాట్ నాగేశ్వరరావు కన్పిస్తారు. మంచిని పంచి, మానవత్వాన్ని పెంచుకొన్న సామాన్య రిక్షావాలాగా అక్కినేని నటన మిక్కిలి ప్రశంసనీయంగా వుంది. మొదటి షెడ్యూలులో కొన్ని దృశ్యాలను, నాయకుడు నాగేశ్వరరావుపై ఒక పాటను చిత్రీకరించారు. మార్చి 7నుండి 22వరకు జరిగిన షూటింగులో శ్రీ సారథీ (స్టూడియోలో) దాదాపు మూడు వంతుల చిత్రం పూర్తయింది.

సనిమా


తాతినేని రామారావు దర్శకత్వం నెరపుతున్న ఈ చిత్రంలో జగ్గయ్య, రంగరావు, నాగభూషణం. గుమ్మడి, రాజబాబు, చంద్రమోహన్, జయంతి, మంజుల, లత, రోజారమణి మున్నగువారు ముఖ్య పాత్రధారులు.

పై చిత్రానికి ఆత్రేయ మాటలను, మహదేవన్ సంగీతాన్ని, వెంకటరత్నం కెమెరాను, కళను జి. వి. సుబ్బారావు, కూర్పును కృష్ణస్వామి సమకూరుస్తున్నారు. అన్నపూర్ణా విడుదల.

తియ్యటి కలలు పండిన వేళ

పరువం పొంగే వయస్సులో ఒకరికొకరు మనస్సు లిచ్చి పుచ్చుకొన్న యువతీయువకులు, వివాహం జరుగబోయే ముందు, ఏవేవో తియ్యటి కలలు కనడం సహజం. అందులోనూ ఆడది అనుభవించే ఆనందం వూహాతీతం. తమ ప్రణయం పండి పరిణయం అయిన తర్వాత, తొలిరేయినాడు, అనుభవించే అనిర్వచనీయమైన సౌఖ్యాన్ని గూర్చి యువతీ యువకులు ఇలా తలపోస్తారు.

'కన్నె వధువుగా మారేది జీవితంలో
ఒకేసారి



'జీవన తరంగాలలో
ప్రాకేళ్ళ, కోర్కెలు
ఆనందపు ఉత్సవం వికసేది ఈనాడే
తొలిసారి
అందుకే తొలిరేయి—అంతహాయి...
అంత హాయి'

అంటూ పరవశించి పాడుకొంటారు దాంపత్య జీవితాన్ని చవిచూడనున్న ప్రేయసీ ప్రియులు.

పై శృంగారరస సన్నివేశం అన్నపూర్ణా సినీ ఎంటర్‌ప్రైజెస్‌వారు నిర్మిస్తున్న 'శారద' చిత్రంలోనిది. పి. రాఘవరావు నిర్మిస్తున్న పై చిత్రంలో శోభన్‌బాబు, సత్యనారాయణ, రావుగోపాలరావు, శారద, జయంతి మున్నగువారు ముఖ్య భూమికలను ధరిస్తున్నారు. కె. విశ్వనాథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి బొల్లిముంత మాటలను, జి. కె. రాము ఛాయను, కుదరవల్లి కళను, అంకిరెడ్డి కూర్పును, చక్రవర్తి సంగీతాన్ని నిర్వహిస్తున్నారు. ఆంధ్రలో జ్యోతి ద్వారా విడుదలౌతుంది.

పసి హృదయాలు

ఈ చిత్రాన్ని దర్శకుడు మల్లికార్జునరావు వసడిమయంగా వుండేట్టు శ్రద్ధ

సినిమా డైరీ

- విజయలక్ష్మిమూవీస్ అనే కొత్త పంపిణీసంస్థ గుంతకల్లులో మార్చి 21న వెలసింది. ఈ సంస్థకి జి.వి.ఎస్.రాజు అధినేత.
- పిఎస్ కంబైన్స్ వారి ఈస్ట్‌మన్‌కలర్ చిత్రానికి "మంచివాడు" అని పేరుపెట్టారు. ఈ చిత్రానికి వి.మధుసూదనరావు దర్శకుడు.
- కౌముదీ పిక్చర్స్ "కోడెనాగు" చిత్రానికి ఆచార్యఆత్రేయ, మల్లెమాల వ్రాసిన పాటలను, ప్రసాద్ థియేటర్లో పెండ్యాల రికార్డ్ చేయించారు. ఈ చిత్రానికి కె. ఎస్. ప్రకాశరావు దర్శకుడు.
- ఉమా ప్రొడక్షన్స్ వారి "బాబు" షూటింగు మార్చి 12 నుండి 19 వరకు సారథిలో జరిగింది. తాతినేని రామారావు దర్శకుడు.
- శిల్పకళాకంబైన్స్ వారి "రాముడే దేముడు" షూటింగు మార్చి 15 నుండి 18వరకు ప్రసాద్‌లో, 18 నుండి 26 వరకు వ్యాహినీలో జరిగింది. ఈ చిత్రానికి బి.వి.ప్రసాద్ దర్శకుడు.
- పద్మాలయా పిక్చర్స్‌వారి "దేముడు చేసిన మనుషులు" చిత్రంలో జయలలిత, విజయనిర్మల, కాంచన ముఖ్యపాత్రధారులు. ఈ చిత్రానికి వి. రామచంద్రరావు దర్శకుడు.



'కోటివిద్యలూ కూటికొరకే'లో
లక్ష్మి, రమాప్రభ.

వక్షాలను చూపిస్తున్నారు చిత్రీకరణలో.

ఇటీవల బయన్ను సినిమా స్టూడియోలో కలిశాను. మీ కథను వివరించగలరా, అన్నాను.

రాధ, శారద, సుధ ...

భర్తే సర్వస్వం అని తలచి అతని కొరకు, తన జీవితాన్నే త్యాగం చేసిన కరుణామయి రాధ ఒకతె—

విచిత్రమైన, విరుద్ధ ప్రకృతుల మధ్య నిలిచి, విషాదాలతో నిండిన వారి అంతరంగాలను పుష్పింపచేసే ప్రయత్నంలో తన జీవితాన్నే పణంగా పెట్టిన శారద ఒకతె—

తన సుఖసంతోషాల కోసం, భర్త జీవితంతో చెలగాట మాడిన సుధ ఒకతె—

ఈ ముగ్గురి జీవిత సంఘటనల సారమే 'మనిహృదయాలు' చిత్రం, అన్నారు ఏం. మల్లికార్జునరావు. శారదగా జమున, రాధగా చంద్రకళ, సుధగా సునందిని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృష్ణ, రామకృష్ణ, అల్లు రామలింగయ్య, కె. వి. చలం, త్యాగరాజు, విజయభాను ముఖ్య పాత్రధారులు.

నవయుగ ద్వారా విడుదలయ్యే ఈ చిత్రానికి రాజశ్రీ రచన్ను, జి. కె. వెంకటేష్ సంగీతాన్ని, ప్రకాష్ ఛాయను, కళాకర్ కళను, శ్రీనివాసరెడ్డి సహా దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు.

'మీనా' సినిమా!

ప్రముఖ నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి విరచితమైన 'మీనా' నవలకి సినిమా యోగం పట్టింది.

నందినీ పిక్చర్స్ అధినేత సి. వి. రమణయ్య ఈ నవలయొక్క సర్వభాషల హక్కులను కొన్నట్టు, ఆయనే చెప్పారు.

నాయికగా వాణిశ్రీ

కథానాయిక పాత్రను వాణిశ్రీ పోషిస్తుంది. ప్రధాన భూమికలను కృష్ణ, రాజబాబు, రమాప్రభ ధరిస్తారు. ఈ చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు. సంగీతాన్ని మహదేవన్, ఛాయను సుకదేవ్, కూర్పును ప్రకాశం చేపట్టారు.

అప్పలాచార్యా కలం!

'మీనా' సినిమాకు సంభాషణలు వ్రాసే బాధ్యతను అప్పలాచార్యకు అప్పగించారు, నిర్మాత. కె. సుబ్బిరెడ్డి (ఇల్లు-ఇల్లాలు) సమర్పించు చిత్రం యిది.

అప్పలాచార్య కలం బలం నాకు బాగా తెలుసు. అనేక చిత్రాలకు ఆయన అజ్ఞాత వీరుడిగా వ్యవహరిస్తున్న సంగతి వింకరికో తెలుసు.

ఉత్తమ నటీనటులు నటించే చిత్రం

బొంబాయి ఫిలింఫేర్ పత్రిక నిర్వహించిన బాలట్‌లో ఉత్తమ నటుడిగా ఎస్వీ రామారావు, ఉత్తమ నటిగా జయలలిత ఎన్నికయ్యారన్న విషయం పాఠకులకు తెలుసు.

రామారావు—జయలలిత కలిసి నటిస్తున్నారు, పద్మాలయా పిక్చర్స్‌వారి 'దేవుడు చేసిన మనుషులు' చిత్రంలో. ఈ చిత్రానికి వి. రామచంద్రరావు దర్శకుడు.

జగ్గయ్యా - కృష్ణ!

ఈస్ట్‌మన్‌కలర్‌లో నిర్మితమవుతున్న ఈ చిత్రంలో జగ్గయ్య, కృష్ణ, ఎస్వీ రంగారావు, కాంతారావు, సత్యనారాయణ విజయనిర్మల, కాంచన ముఖ్యపాత్రధారులు. చిత్రనిర్మాత అయిన జి. హనుమంతరావు వ్రాసిన కథ యిది. ఈ చిత్రానికి వి. ఎస్.

మీకు తెలుసా?

ప్రముఖనటి, నర్తకి కుమారి హేమమాలిని అమెరికా, కెనడా దేశాలను తన బృందంతో పర్యటించబోతూంది. ఈ పర్యటన కార్యక్రమాలను శ్రీనివాసా ఫిలిమ్స్, ఇంటర్నేషనల్, (హైద్రాబాదు)కు చెందిన శ్రీ నషీర్ కుమార్ ఏర్పాటు చేశారు.

'బంగారు బాబు' ప్రదర్శింపబడే ప్రతి థియేటరుకు 'జెనరేటర్' వుండడంవల్ల ఎక్కువమంది సినిమాను చూడడానికి వీలుగా వుంటుంది. 'పవర్‌కట్' ఈ చిత్రాన్ని యేమీ చెయ్యలేదు.

'ఒకనారి—వంద తుపాకులు' చిత్రంలో 'షావుకారు' జానకి గెస్టు పాత్రను అంగీకరించింది.

హిందీలో విజయఢంకా మ్రోగిస్తున్న 'విక్టోరియా—203' చిత్రాన్ని ఒక పెద్ద సంస్థ తెలుగులో నిర్మిస్తారట. ఒక పెద్ద డైరెక్టర్, యిద్దరు పెద్ద నటులు ఆ పాత్రలను పోషించాలరట. హాను ఎవరో?

'దేముడు చేసిన మనుషులు' చిత్రంలో వెండితెర అతిరథ, మహారథులందరూ నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగు మైసూర్ చాముండేశ్వరిలో జరుగుతుంది, మద్రాస్‌లో విద్యుచ్ఛక్తి కొరత వుండి కాబట్టే.

ఆర్. స్వామి ఛాయను: రమేష్‌నాయుడు సంగీతాన్ని చేపట్టారు.

బెంగుళూరు షూటింగు

మార్చి 17 న షూటింగు ప్రారంభమైంది, బెంగుళూరు చాముండేశ్వరీ స్టూడియోలో. ఈ చిత్రం జూన్‌కల్లా పూర్తవుతుందట. తారకరామ విడుదల. కృష్ణ తలపెట్టిన మహాయజ్ఞం యిది.

మూడు వేషాల్లో ఒకే నటి

పుష్పాంజలి ప్రొడక్షన్స్ 'పద్మవ్యూహం' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారన్న వార్తను పాఠకులకు యిదివరకే తెలిపాను. ఈ చిత్రానికి కథ, సినిమా అనుకరణను ఉషశ్రీ వ్రాశారు.

దర్శకత్వ భారాన్ని 'ప్రేమపక్షులు' డైరెక్టర్‌కి అప్పగించారు, నిర్మాత ఇన్నారెడ్డి. నాయక పాత్రను కొత్త నటుడు ప్రకాష్ పోషిస్తున్నారు.

పై చిత్రంలో చంద్రకళ విభిన్న మనస్తత్వాలు కలిగిన మూడు పాత్రలను చేపట్టింది. తల్లిగాను, అల్లరి పిల్లగాను, సాత్వికురాలిగాను ఆమె నటిస్తోంది. ఈ చిత్రానికి మోదుకూరి జాన్సన్ మాటలను, అశ్వద్ధామ సంగీతాన్ని, సుకదేవ్ ఛాయను, అంకిరెడ్డి కూర్పును, సూరన్న కళను

సినిమా

నిర్వహిస్తున్నారు. ప్రధాన పాత్రలను సత్యనారాయణ, రాజసులోచన, రావుగోపాలరావు, మాలతి మరియు చంద్రమోహన్ ధరిస్తున్నారు.

ఫిబ్రవరి 22నుండి, మార్చి 22వరకు శారదా స్టుడియోలో జరిగిన షెడ్యూలుతో షూటింగు దాదాపు పూర్తయినట్లే, అన్నారు నిర్మాత ఇన్నారెడ్డి, ఈ చిత్రం పూర్ణా ద్వారా విడుదలవుతుంది.

విచిత్ర వ్యక్తి!

చంద్రమోహన్ను విచిత్ర వ్యక్తిగా పేర్కొనవచ్చు. కారణం — అతగాడు ధరిస్తున్న పాత్రలే.

అతడు లేని చిత్రం దాదాపు లేదనే చెప్పాలి. ఏ చిత్రం తారాగణం చూచినా, అతడి పేరు తప్పక కనిపిస్తుంది.

ఉపనాయక పాత్రలు కొన్ని. హాస్య పాత్రలు కొన్ని, విలన్ వేషాలు కొన్ని, హీరో భూమికలు కొన్ని ... యిలా చిన్న వాళ్ళలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా చెలామణి అవుతున్నాడు, చంద్రమోహన్.

చేపట్టిన పాత్ర ఎలాంటిదయినా, దాని నిర్వహణలో గట్టివాడు అనిపించుకునే సత్తా అతనికి వుంది.

కాస్త పొడవు మనిషిగా భగవంతుడు పుట్టించి యుంటే, అతడికి వున్న ట్యాలెంటుకి, మంచి హీరోగా చెలామణి అయి వుండేవాడు.

'చేసుకున్న వాడికి చేసుకున్నంత' అన్న నానుడిపై నమ్మకం వున్న వ్యక్తి గావడం చేతనే, వచ్చిన వేషంతో సరిపెట్టుకుంటున్నాడు, 'రంగుల రాట్నం' కథానాయకుడు, 'స్త్రీ' ప్రతి నాయకుడు అయిన చంద్రమోహన్.

'మే' విశిష్టత!

1973 'మే' నెలకి ఒక విశిష్టత వున్నట్టు కనిపిస్తూ వుంది. మన చలన చిత్రరంగానికి చెందిన నటీ, నటులు చాలా మందికి అమెరికా వెళ్ళాలన్న తలంపు ఏర్పడినట్టు వుంది.

కొందరు స్వంతఖర్చులతో పయనం అయితే, మరికొందరు చలనచిత్రోత్సవ సభ్యులుగా ఆదేశాన్ని పర్యటించవచ్చు. మొత్తానికి 'మే' అంతా మద్రాస్ హాలీవుడ్ కళావిహీనగా వుంటుందేమో!

'స్త్రీ'కి ఏ-సర్టిఫికెట్!

శ్రీ పూర్ణామూవీస్ నిర్మించిన 'స్త్రీ' చిత్రానికి సెన్సారుబోర్డువారు 'ఏ' సర్టిఫికేటు యిచ్చారు.

'ఏ' అనగానే— యిందులో శృతిమించిన శృంగారమో లేక అసభ్యదృశ్య సమ్మేళనమో వుందని భ్రమపడేరు సుమా.

కథ చాలా పునాతమైనది; నీతిని ప్రబోధించేది అని అందరూ ఆమోదిస్తారు, చిత్రం చూస్తే.

అమాయకులైన కన్నెపిల్లల జీవితాలతో చెలగాటమాడే దుర్మార్గులెందరో వున్నారీ సమాజంలో. వారి దురాగతాలకు అబలలు బలి కావలసిందేనా? అలాంటివారి ఆటలను కట్టడం ఎలా? ఈ సమస్యను పరిష్కరించే ప్రయోజనాత్మక కథయే 'స్త్రీ' చిత్రం.

'స్త్రీ' చిత్రాన్ని నిర్మించిన ఏ. పూర్ణచంద్రరావు, చంద్రశేఖర్‌గార్లను ఎందరో అభినందించారు. ఒక మంచికథను ఎన్నుకున్నందుకు. ఇంతవరకు వచ్చిన ప్రత్యాగాత్మ చిత్రాలకి, 'స్త్రీ'కి ఎంతో తేడా వుంది. ఆయన ప్రతిభ ప్రతి అడుగునా కనిపిస్తుంది, అని ప్రశంసించినవారు ఒక్కరా!



'జగమే మాయ'లో మురళీమోహన్, సునందిని.

యద్దనపూడి రాయడానికి నవలాకారులతో. హిట్ కథాగమనం గొప్ప ఈ చిత్రానికి ప్రజాదరణ లభించడం తథ్యం.

మలుపు – మార్పు

'స్త్రీ'లో ద్విపాత్రాభినయం చేసిన చంద్రకళకు, నటజీవితంలో పెద్ద మలుపును తెచ్చే చిత్రం యిది. ఇకపై కృష్ణంరాజుకు హీరో ఫ్యాన్ ఫాలోయింగ్ పెరుగుతుంది, ఈ చిత్రం విడుదలతో.

అబ్బ, ఆమె ఏం చేస్తుందిలే? అని అవహేళన చేసిన అనన్య ప్రతిభావంతులే అబ్బో, ఎంత అద్భుతంగా చేసింది చంద్రకళ అని ఆశ్చర్యపడ్డారు. ఏ ఆర్టిస్టుకయినా మంచి పాత్ర వస్తేనే, అందులో తన ప్రతిభను చూపెట్టి, మెప్పించే ప్రయత్నం జరుగుతుంది.

అతిశయోక్తి కాదు గాని, 'స్త్రీ'లో చంద్రకళ అద్వితీయమైన నటన్ను ప్రదర్శించింది అని చెప్పక తప్పదు. కొత్తదనాన్ని కాంక్షించే ప్రేక్షకులకు ఈ చిత్రం పెద్ద రిలీఫ్ నిస్తుంది.

జగమే మాయ

ఈ పాటను ఘంటసాల మాస్టారు అద్భుతంగా పాడారు. ఇప్పటికీ, ఎప్పటికీ యీ పాటకి ప్రజల ఓటు లభిస్తుంది.

అదే పేరును సహోదయ ఆర్ట్ పిక్చర్స్ తమ మొదటి చిత్రానికి నామధేయంగా పెట్టుకున్నారు.

'జగమే మాయ' కథను, మాటలను గొల్లపూడి వ్రాశారు. ప్రస్తుతం కూర్గు కొండల్లో షూటింగు జరుగుతూ వుంది. 'రైతుకుటుంబం' నిర్మాత పి. వి. సుబ్బారావు యీ చిత్రం ద్వారా ముగ్గురు కొత్తవాళ్ళను వెండితెరకు పరిచయం చేస్తున్నారు.

'ధర్మదాత, పాపం పసివాడు' చిత్రాలను అందించిన పూర్ణచంద్రరావు నిర్వహణలో తయారయ్యే మరొక సంచలన చిత్రమే యిది. ఈ చిత్రానికి సత్యం సంగీతాన్ని, కె. ఎస్. మణి ఛాయను నిర్వహిస్తున్నారు.

'జగత్ కిలాడీలు, ఆడజన్మ' చిత్రాలకు దర్శకత్వం నిర్వహించారే అయ్యర్ మూర్తి, ఆయనే 'జగమే మాయ' డైరెక్టరు. ముఖ్యపాత్రలను జయలలిత, రాజబాబు, సుకరశిని, మురళీమోహన్, గిరిబాబు పోషిస్తున్నారు. పాటలన్నీ కలర్‌లో చిత్రీకరించ బడుతాయి. లక్ష్మీ ఫిలింస్ విడుదల.

విజయలలిత సోదె చెప్పింది

విజయలలిత ఏమిటి? సోదె చెప్పడం ఏమిటి? అలాగయితే మాకూ చెపుతుందా? అని పాఠకులు ప్రశ్నించవచ్చు.

సోదె చెప్పవలసిన అవసరం ఆమె కేముంది? రవిచిత్ర నిర్మాత వై. వి రావు ఆమెచేత చెప్పించారు. తమ నిర్మించిన 'ఒకనారి—వందతుపాకులు' చిత్రంలో. ఆ చిత్రంలో ఆమె భవానీ పాత్రను పోషించింది. ఆపాత్ర సోదె చెప్పవలసి వచ్చింది, పరిస్థితుల ప్రాబల్యంవల్ల.

'కంచి కామాచ్చమ్మ, మధుర మీనాచ్చమ్మ
కరుణించు మా తల్లి కనకదుర్గమ్మా
పైడి పోలేరమ్మ, కొల్లూరి మరిడమ్మ
కొండపై వెలసినా, కనక మా అప్పమ్మ
విరుక సెప్పాలమ్మ, విరుక సెప్పరి'

అంటూ ప్రభాకరరెడ్డికి జోస్యం పలికింది, విజయలలిత.

'ఒకనారి— వందతుపాకులు' చిత్రంలో యిదొక హుషారైన సన్నివేశం. ఈ చిత్రానికి కె. వి. ఎస్. కుటుంబరావు దర్శకుడు. సిపాయీ చిన్నయ్య తర్వాత ఇదే నా దర్శకత్వం. ఒక ముఖ్య పాత్రలను ధరించింది ఈ చిత్రంలో. త్వరలో విడుదల.

ఆత్రేయ కలం ఘంటసాల గానం

కౌముది పిక్చర్స్‌వారి 'కోడెనాగు' ఈస్ట్‌మన్ కలర్‌చిత్రం షూటింగు మార్చి 20న ప్రారంభం. ఎక్కడో తెలుసా? చంద్రగిరి కొండలపైన.

పై చిత్రంయొక్క పాటల రికార్డింగు మార్చి 14న ప్రసాద్ థియేటర్లో ఆరంభమైంది. దైవపూజను నటరత్న రామారావు, విజయా పూర్ణచంద్రరావు, త్రివిక్రమరావు, ఎం.ఎస్. రెడ్డి, జయలక్ష్మీ నాగేశ్వరరావుగార్లు చేసిన పిమ్మట ఆచార్య ఆత్రేయ వ్రాసిన పాటను, రికార్డ్ చేశారు సంగీత సారధి పెండ్యాల.

'నాలో కలిసిపో
నా ఎదలో నిలిచిపో
కాచుకున్న కౌగిలిలో
కవ్వరమై కరిగిపో'— ఈ పాటను

ఆచార్య కలం ఎంత అందంగా అందించిందో, అంతకంత నిండుదనం వచ్చింది ఘంటసాల గంధర్వగానంతో. ఈ పాటను నా మటుకు పదిసార్లు విన్నాను, చెవులో.



'శారద'లో శారద.

ఘంటసాల కారణజన్ముడు అనక తప్పదు. ఆయనతో పోటీ చెయ్యగలరా మరెవ్వరైనా? అందుకే ఆయనంటే గౌరవం యితరులకు.

'కోడెనాగు' కథానాయక పాత్రను శోభన్, నాయిక భూమికను చంద్రకళ, లక్ష్మి ధరిస్తున్నారు. ప్రధానపాత్రలను ఆత్రేయ, రాజబాబు పోషిస్తున్నారు. ఎం. ఎస్. రెడ్డికి చిత్రం బానర్ వేల్యూని, ధనార్జన్ని తెచ్చిపెడుతుంది. ఈ చిత్రం విజయాద్వారా విడుదలవుతుంది.

మట్టిబొమ్మలు

గతవారం ప్రసాద్ స్టుడియో లో 'రాముడే దేముడు' సెట్లో చలంగారిని కలిశాను. ఫల్గుణా కంబైన్స్ నిర్మిస్తున్న ఆ చిత్రంలో తన పాత్ర చాలా వున్నతమైనదని, వుదాత్తమైనదని, ప్రజల సానుభూతిని పొందగలదని, చలం చెప్పారు.

'దేవుడమ్మ' ఎప్పుడు విడుదలవుతుంది? అన్న ప్రశ్నకి 'ఆంధ్రదేశంలో ప్రశాంత వాతావరణం ఏర్పడేవరకు రిలీజ్ చెయ్యదలచలేదు' అన్నారు.

ఏప్రిల్ లో 'మట్టిబొమ్మలు' చిత్ర నిర్మాణం ప్రారంభమవుతుంది. రెండు మాసాల్లో షూటింగు పూర్తవుతుంది. జూన్నాటికి ఆ చిత్రం కూడా రెడీ అవుతుంది' అని చెప్పారు చలం.

'మట్టిబొమ్మలు' యిప్పటికి సగం అయివుండేది, పవర్కట్ సమస్య ఏర్పడి వుండకపోతే. ఏప్రిల్లో నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదు అని కూడా చలం ద్వారా తెలుసుకున్నాను.

చలం చేపట్టే కథలన్నీ, ప్రేక్షకుల్ని ఆకట్టుకునేవిగా వుంటాయి. అలాంటి కథలయితేనే, ఆయన ఒప్పుకుంటారు నటించడానికి. ఎన్నో శ్రమలకోర్చి, కష్టించి, కృషితో పైకివచ్చిన వ్యక్తిగాబట్టే, తన స్థానాన్ని కాపాడుకునే పథకాలను అవలంబిస్తాడు, చలం.

వాళ్ళముందు నేనెంత

అన్నారు, ప్రేక్షకుల ప్రత్యేక గౌరవానికి, అభిమానానికి పాత్రమైన చలం. 'నాగేశ్వరరావుగారు నా గురువు; రామారావుగారు నా

సినిమా

తండ్రి. నేను ఆ మహానటులిద్దరినీ ఇలాగే పిలుస్తాను. వాళ్లవద్ద నేర్చుకోదగినది, వలసినది ఎంతోవుంది. క్రమశిక్షణ వాళ్ల దగ్గిర నేర్చుకోవాలి పరిశ్రమకు వాళ్లిద్దరూ రెండు నేత్రాల్లాంటివారు' అని వాళ్లపై తనకున్న గౌరవభావాన్ని వ్యక్తపరిచారు, చలం.

చలం ప్రత్యేకత

'బుల్లెమ్మ — బుల్లోడు' విడుదల తర్వాత, చలంతో చిత్రనిర్మాణం జరపాలి. అని వచ్చిన నిర్మాతలెందరో నాకు తెలుసు? అతనికి దురాశ వుండివుంటే, డజను మందికి వాగ్దానంచేసి, డబ్బు పట్టి వుండొచ్చు.

అతగాడికి డబ్బుకన్నా మంచికథ, చక్కటిపాత్ర అన్న ఆశ ఎక్కువ. తను ఎలాంటి పాత్రను పోషిస్తే, ప్రజలు చూస్తారు అని, అతనికి బాగా తెలుసు. అందుకే తక్కువ చిత్రాల్లో కనిపిస్తాడు చలం.

డిమాండు లేకగాదు; ఆయనకి కథ నచ్చకనే చాలామందికి చెయ్యలేను అని చెప్పాడు.

— శ్రీనివాస్

అవీ — ఇవీ ...

మదరాసులో

'ఏజంట్ రాజా'

మదరాసులోని వవ్యాంధ్ర యువజనసమితి వారు యిటీవల 'ఏజంట్ రాజా' నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. దర్శక నిర్మాత శ్రీ ఎం. మల్లికార్జునరావు ఈ ప్రదర్శనకి అధ్యక్షత వహించారు.

ఇందులో శ్రీయుతులు కె. బి. రామచంద్రరావు, పి. దామోదరరావు, రామమోహనరావు, కె. వి. జయచంద్ర, రామారావు, రాజారావు, రాములు, అప్పారావు, కుమారి మమత, మీనాక్షి నటించారు. నటీ నటులంతా చక్కని నటనని ప్రదర్శించి నాటకాన్ని రక్తి కట్టించారు.

శ్రీ జి. ఎన్. పతి రాసిన ఈ నాటకానికి శ్రీ బి. నాగరాజన్ దర్శకత్వం వహించారు.

(ఒ. వి.)

మొక్కపాటి నరసింహశాస్త్రి కాలధర్మం

బారిస్టర్ పార్వతీశం నవల ద్వారా తెలుగువారికి సుపరిచితులైన ప్రముఖ హాస్యరచయిత శ్రీ మొక్కపాటి నరసింహ శాస్త్రిగారు పిఠాపురంలోని వారి స్వగృహంలో మార్చి 5 వ తేదీన స్వర్గస్థులైనారు.

శాస్త్రిగారు 1892 లో జన్మించారు. ఎడింబరో విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యని అభ్యసించారు.

బారిస్టర్ పార్వతీశం నవలవల్ల సామాన్య పాఠకలోకంలోనూ, సాహిత్య లోకంలోనూ విశిష్టమైన ఖ్యాతిని, స్థానాన్ని ఆర్జించుకున్నారు.

ఈ ప్రముఖ హాస్యరచయిత కలంనుండి మొక్కుబడి (నాటికల సంకలనం), భిక్షువు (చిన్నకథల సంకలనం), ఏకోదరులు (నవల), ప్రతిబింబాలు (కథలు), బారిస్టరు బాతాఖానీ (వ్యాసాలు) మొదలైనవి వెలువడ్డాయి.

శ్రీ శాస్త్రిగారి కలంనుంచి వెలువడి యింకా అముద్రితంగాఉన్న రచనలు ఎన్నో ఉన్నాయి. హాస్యంపై ఒక గ్రంథం, సుబ్బారాయుడు అనే హాస్య నాటిక, మిస్ మోహిని నవల మొదలైనవి వాటిలో కొన్ని.

మునిమాణిక్యం నరసింహారావు మరణం

సుప్రసిద్ధ హాస్యరచయితగా, 'కాంతం' పాత్ర సృష్టికర్తగా తెలుగువారి మనస్సుల్లో, సాహిత్యంలో ఒక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకున్న శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు తమ 75వ ఏట ఫిబ్రవరి నాలుగో తేదీ ఉదయం హైదరాబాదులో మరణించారు.

శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు తమ జీవితాన్ని ఉపాధ్యాయ వృత్తితో ప్రారంభించారు. తర్వాత కాంతం కథల ద్వారా అఖండఖ్యాతిని ఆర్జించారు. కొంత కాలం ఆకాశవాణిలో పాఠశాల కార్యక్రమ నిర్వాహకులుగా పనిచేశారు.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press: 8 & 9, Thambu Chetty Street, Madras-1 and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3.
Editor : S. Radhakrishna.



[illegible]

చిత్రకారుడు : శ్రీ వై. బాలయ్య

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

